అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 09-06-2024


సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 110 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు + వెబ్‌లో (సోపతి) | వెల : 8.00



ఈనాడు సంస్థల అధినేత
రామోజీరావు కన్నుమూత

గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరిక



(ఫైల్)

- శనివారం తెల్లవారుజామున మృతి
- ఆయన మరణం మీడియా రంగానికి తీరని లోటు
- తెలుగు నేల ఓ గొప్ప వ్యక్తిని కోల్పోయింది
- రాష్ట్రపతి, ప్రధాని, సీఎం సహా పలువురి సంతాపం
- అధికార లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు
- ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు పాత్రికేయ రంగంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మెన్, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు (88) అనారోగ్యంతో మతి చెందారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో కుటుంబసభ్యులు ఆయన్ను ఇటీవల హైదరాబాద్ నానక్‌రామ్ గూడలోని స్టార్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు గుండెకు స్టెంట్ వేసి, ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. అయితే డాక్టర్లు చివరి నిమిషం వరకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చికిత్సకు ఆయన శరీరం సహకరించక పోవడంతో శనివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. అనంతరం ఆయన భౌతిక కాయాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు. రాజకీయ, సినీ, వ్యాపార, తదితర రంగాలకు చెందిన ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు. రామోజీరావు అంత్యక్రియలు ఆయనకు అత్యంత ప్రీతి పాత్రమైన ఫిల్మ్ సిటీలో ఆదివారం ఉదయం 9 గంటలకు అధికారిక లాంఛనాలతో జరగనున్నాయి. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సీఎస్‌ను ఆదేశించడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

అక్షర యోధుడికి అశ్రునివాళి

ఒక్క సిరా చుక్క లక్షల మెదళ్లను కదిలిస్తుంది. ఒక సంకల్పం కోట్లాది మందికి స్ఫూర్తి నిస్తుంది. కదిలించిన ఆ సిరా చుక్క... స్ఫూర్తి నిచ్చిన ఆ సంకల్పం ఎవరో కాదు... తెలుగు మీడియా రంగంలో అనేక మార్పులకు, కొత్త కొత్త పంథాలకు శ్రీకారం చుట్టిన అక్షర యోధులు చెరుకూరి రామోజీరావే.... ఆ విధంగా పత్రికా రంగంపై చెరగని ముద్ర వేసిన ఆయన మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ...2లో

పత్రికారంగంలో చెరగని ముద్ర

రామోజీరావుకు నివాళులు

పి ప్రభాకర్, సీజీఎం నవతెలంగాణ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'ఈనాడు గ్రూప్ అధినేత రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. పత్రికారంగంలో అయనది చెరగని ముద్ర. తెలుగు సమాజానికి ఆయన సేవలు విలువైనవి. ఈటీవీ ద్వారా టెలివిజన్ రంగంలోనూ ...11లో

ఉక్కిరిబిక్కిరి!

- చుట్టుముడుతున్న ఆర్థిక సమస్యలు
- భారీగా సర్కారు పెండింగ్ బిల్లులు
- ముగిసిన ఎలక్షన్ కోడ్
- పాక్షికంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేత
- ఏడాదిగా కాంట్రాక్టర్ల ఎదురుచూపులు
- వెంటాడుతున్న రైతు రుణమాఫీ
- ప్రత్యామ్నాయ ఆదాయంపై ప్రభుత్వ దృష్టి



ఇక పాలనపైనే రేవంత్ సర్కార్ నజర్

ఆరు లక్షల కోట్ల రూపాయల అప్పులు తీర్చే బాధ్యతను నెత్తికెత్తుకున్న రేవంత్ సర్కార్ ఇప్పుడు అదనపు ఆదాయం కోసం నానా అవస్థలు పడుతుంది. ప్రజల ఆకాంక్షలు, ప్రభుత్వ లక్ష్యాలకు మధ్య భారీ అంతరం ఏర్పడటంతో దాన్ని భర్తీ చేయడంపై ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. పెండింగ్ బిల్లులు కాంట్రాక్టర్లనే కాదు...అధికారుల్నీ చికాకు పెడుతున్నాయి. అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇప్పుడు వాటిని పరుగులు పెట్టించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. ఎలక్షన్ల హడావిడి ముగియడంతో ఇక సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఆర్థికస్థితిని గాడినపెట్టే కసరత్తు ప్రారంభించారు.

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎలక్షన్ కోడ్ ముగిసింది. ఇక సర్కారు పాలనపై సమస్త ప్రజానీకం దృష్టి నిలిపింది. అధికారంలోకి వచ్చే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తామన్న హామీల అమలుకోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వాటిలో ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పెన్షన్ల పెంపు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ధరణి పోర్టల్ సవరణలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు కూలీలకు ఆర్థిక చేయూత, మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు నెలకు రూ.2,500 బ్యాంకు ఖాతాల్లో జమ వంటి అనేక అంశాలు ఉన్నాయి. అయితే వీటన్నింటిపై రేవంత్ సర్కార్ ఇప్పుడు దృష్టి పెట్టింది. ఎలక్షన్ కోడ్ ముగియగానే గృహజ్యోతి స్కీం పరిధిలోకి వచ్చే ఇతర విద్యుత్ వినియోగదారులందరికీ 'జీరో' బిల్లులు ఇచ్చే ప్రక్రియను ప్రారంభించింది.

అయితే ఇవన్నీ ఆర్థికపరమైన అంశాలు కావడంతో సర్కారు ఉక్కిరిబిక్కిరి అవుతుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల కాంట్రాక్టర్లకు ఏడాది నుంచి బిల్లులు చెల్లించలేదు. దీనితో ఆయా పనులన్నీ సగంలో నిలిచిపోయాయి. పెండింగ్ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రాజెక్టులతో పాటు రోడ్లు, నాళాల మరమ్మతులు చేసిన కాంట్రాక్టర్లందరికీ కలిపి ప్రభుత్వం దాదాపు రూ.50వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్టు సమాచారం.

రెండేండ్లుగా ప్రయివేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించలేదు. దీనితో ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు కూడా సర్కారుపై ఒత్తిడి తెస్తున్నాయి. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ సేవలు అందిస్తున్న డెంటల్ ఆస్పత్రులు రెండు వారాలుగా కొత్త పేషెంట్ల నమోదును నిలిపివేశాయి. ప్రభుత్వం నుంచి తమకు రావల్సిన బకాయిలు వచ్చే వరకు కొత్త కేసులు తీసుకోబోమని హైదరాబాద్ హైదర్‌గూడలోని సురక్షా డెంటల్ మల్టీ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ రాజోలు తెలిపారు. వివిధ సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలు తమకు వర్కవుట్ కావట్లేదనీ, 2004 నాటి చార్జీలనే ఇప్పటికీ వర్తింప చేస్తున్నారనీ, వాటిని సవరించాలని కోరుతున్నారు. అయితే ఆరోగ్యశ్రీ లోని 1,375 సేవల ప్యాకేజీల రేట్లను పెంచుతూ శనివారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఆగస్టు 15వ తేదీ లోపు రైతు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లేసి చెప్పిన విషయం తెలిసిందే. దీనికోసం దాదాపు రూ.35వేల కోట్ల నిధులు కావల్సి ఉంది. రుణమాఫీ జరిగితే, బ్యాంకర్ల నుంచి కొత్త రుణాలు ...11లో

ఆదాయాన్వేషణ

ఇటీవల వివిధ శాఖలపై సంయుక్తంగా సమీక్షా సమావేశం నిర్వహించిన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషించాలని అన్ని శాఖల ఉన్నతాధికారుల్ని ఆదేశించారు. శాఖల వారీగా వారంరోజుల్లో అలాంటి ప్రతిపాదనల్ని తన దృష్టికి తెస్తే, మంత్రిమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రకటించిన ఎల్‌ఆర్ఎస్ స్కీం ఇప్పటికీ నత్తనడకనే సాగుతుంది. సర్కారు ఆశించిన స్థాయిలో ఆదాయం రావట్లేదు. మరోవైపు భూముల విలువ, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుపై కసరత్తు జరుగుతుంది. ఇప్పటికే రాష్ట్రంలో భూములు సామాన్యులకు అందుబాటులో లేని స్థాయిలో ఉన్నాయి. వాటిని మరోసారి పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఆందోళనా ప్రభుత్వంలో ...11లో

ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ



సీడబ్ల్యూసీ తీర్మానం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని నియమించాలని కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేసింది. శనివారం నాడిక్కడ అశోక హెూటల్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, గౌరవ గొగోయ్ సహా సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం ఆ పార్టీ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ విలేకరుల సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత పదవి చేపట్టాలని రాహుల్ గాంధీని సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా కోరిందని తెలిపారు. పార్లమెంటు లోపల ప్రతిపక్షానికి నాయకత్వం వహించడానికి రాహుల్ సరైన వ్యక్తి అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ చేసిన అలుపెరగని కృషిని సీడబ్ల్యూసీ తీర్మానం ప్రశంసించింది.

"కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేసిన భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్ర కాంగ్రెస్‌ను దేశ ప్రజలకు మరింత దగ్గరగా చేసింది. ఆయన ఆలోచనలను, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఈ రెండు యాత్రలు దేశ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపులు తిప్పాయి. లక్షలాది మంది కార్యకర్తలు, కోట్లాది మంది ఓటర్లలో ఆశలు, విశ్వాసాన్ని ఈ రెండు యాత్రలు నింపాయి" అని సీడబ్ల్యూసీ తీర్మానంలో పేర్కొన్నారు.

"రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం సింగిల్ మైండెడ్‌గా, పదునైనదిగా, సూటిగా సాగింది. 2024 ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణను ఆయన ప్రధాన అంశంగా చేశారు. ఎన్నికల ప్రచారంలో చాలా శక్తివంతంగా ప్రతిధ్వనించిన పాంచ్ న్యాయ్-పచీస్ హామీ కార్యక్రమం రాహుల్ యాత్రల ఫలితం. ఇందులో ప్రజలందరి భయాలు, ఆందోళనలు, ఆకాంక్షలు, ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు, కార్మికులు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనారిటీల ఆకాంక్షలు ప్రతిబింబించాయి" అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత పదవిని స్వీకరించడానికి రాహుల్ గాంధీ అంగీకరించారా? అని ప్రశ్నించగా, త్వరలోనే నిర్ణయం ...11లో

నేడు మోడీ ప్రమాణ స్వీకారం

కొలువుదీరనున్న కొత్త సర్కార్

- దేశ రాజధానిలో భద్రత కట్టుదిట్టం
- 8 వేల మంది అతిథులు హాజరు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శనివారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్‌లో వరుసగా మూడోసారి ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేయడంతోపాటు నేతల కోసం ప్రత్యేక చర్యలు కూడా తీసుకోనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి వివిధ రంగాల నిపుణులు, సాంస్కృతిక ప్రదర్శనకారులతో సహా 8,000 మంది అతిథులు హాజరుకానున్నారు.ఆదివారం సాయంత్రం 7:15 గంటలకు ప్రధానమంత్రి, ఇతర కేంద్ర మంత్రి మండలి సభ్యులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి భవన్‌లో ఐదు కంపెనీల పారామిలటరీ సిబ్బంది, ఎన్ఎస్జీ కమాండోలు, డ్రోన్లు, స్నిపర్లతో సహా బహుళ స్థాయి భద్రతతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. వేడుకలో నేరపూరిత, తీవ్రవాద కార్యకలాపాల బెదిరింపులను నివారించడానికి వివిధ వైమానిక ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించడాన్ని నిషేధిస్తూ, ఢిల్లీ మీదుగా నో-ఫ్లై జోన్‌ను పబ్లిక్ అడ్వైజరీ ప్రకటించింది. ఈ పరిమితి జూన్ 9 నుండి జూన్ 10



వరకు అమలులో ఉంటుంది. ఉల్లంఘించినవారు ఐపీసీసీ సెక్షన్ 188 ప్రకారం జరిమానాలను ఎదుర్కొంటారు.విదేశీ ప్రముఖుల కోసం ప్రత్యేక ప్రోటోకాల్‌తో సహా మెరుగైన భద్రతా చర్యలు అమలులో ఉన్నాయి. ఈ ...11లో

జూన్ 15 నుంచి లోక్‌సభ తొలి సెషన్

11లో..

కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారం

నేడే గ్రూప్-1 ప్రిలిమ్స్

- 897 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 4.03 లక్షల మంది అభ్యర్థుల దరఖాస్తు
- పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్ష ఆదివారం జరగనుంది. ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించడం కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఏర్పాట్లు పూర్తి చేసింది. 31 జిల్లాల్లోని 897 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యేందుకు దరఖాస్తు చేశారు. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం పది గంటలకు అంటే పరీక్షా ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోరు. బయోమెట్రిక్ ...11లో

ఆర్టీసీ బస్సెక్కండి

గ్రూప్-1 అభ్యర్థుల కోసం ప్రత్యేక సర్వీసులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్ష రాసే అభ్యర్థుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నదని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. పరీక్ష ఆదివారం కావడంతో అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా రాష్ట్రంలోని 897 పరీక్షా కేంద్రాలకు బస్సులు నడుపుతున్నామన్నారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాజధాని హైదరాబాద్ నుంచి జిల్లాలకు ఈ రోజు సాయంత్రం నుంచే అభ్యర్థుల రద్దీ ఎక్కువగా ఉన్నందున, ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్ పాయింట్లలో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్రంలోని ప్రధాన బస్ స్టేషన్లలో ప్రయాణీకుల సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశామనీ, అక్కడ పరీక్షా కేంద్రాల సమాచారాన్ని అభ్యర్థులకు ఇవ్వడంతో పాటు ఏ బస్సులో వెళ్లాలో అధికారులు చెప్తారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4.03 లక్షల మంది అభ్యర్థులు గ్రూప్-1 ప్రిలిమినరీకి హాజరవుతుండగా, గ్రేటర్ హైదరాబాద్‌లోనే దాదాపు 1.70 లక్షల మంది ఈ పరీక్షలు రాస్తున్నారని వివరించారు. రద్దీకి అనుగు ణంగా సిటీ బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో పరీక్షా కేంద్రాలకు క్షేమంగా వెళ్లి, ప్రశాంత వాతావరణంలో గ్రూప్-1 ప్రిలిమ నరీ పరీక్షలు రాయాలని కోరుతూ, ఆయన అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

రామోజీకి నివాళి

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణం పట్ల టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ...11లో

నీట్ అవకతవకలపై విచారణ జరిపించాలి : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ ద్వారా విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ట్విట్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన కీలకమైన ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్‌కు సంబంధించిన కొన్ని వ్యవహారాలు చూస్తుంటే అవకతవకలు జరిగినట్టు స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు.ఎప్పుడూ లేని

చేప ప్రసాదం పంపిణీలో విషాదం

క్యూ లైన్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన చేప ప్రసాదం పంపిణీలో విషాదం చోటుచేసుకుంది. క్యూలైన్‌లో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి

అన్నదాతపై అప్పుల భారం

పెట్టుబడి రెండింతలు | గిట్టుబాటు ధర కరువు

- రైతుకు చేయూతనివ్వని సంక్షేమ పథకాలు
- సంక్షోభంలో వ్యవసాయం రంగం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

పుడమికి పురుడు పోసి పుట్ల కొద్ది పంట తీసినా అన్నదాతకు పూట గడిచే పరిస్థితి లేదు. కుటంబం అంతా ఆరుగాలం కష్టపడినా బుక్కెడు మెతుకులు నోట్లోకి వెళ్లడం లేదు. దీనికి ప్రధాన కారణం అన్నదాతపై పడే ఆర్థిక భారం. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు సాగు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. నారు పోసింది మొదలు దుక్కులు దున్నడం నాట్లు, కోతల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించే వరకూ ప్రతిదీ డబ్బుతో కూడుకున్నవే. ఏటికేడు ఎరువులు, విత్తనాలు, పంట పెట్టుబడి రెండింతలు కావడం. పంట కోసం తెచ్చిన వడ్డీలు మీద పడడం. చివరికి పంట దిగుబడి సరిగ్గా రాకపోవడం.. వచ్చిన పంటకు గిట్టుబాటు లేకపోవడంతో రైతుకు అప్పులే మిగులుతున్నాయి. ఆ అప్పులు తీర్చే మార్గం లేక.. వడ్డీలు కడుతూ నెట్టుకొస్తున్నారు. దాంతో పాటు ప్రభుత్వాల విధానాలూ రైతుపై పెనుభారం మోపుతున్నాయి. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా.. రైతుకు ఏ మాత్రం చేయూతనివ్వడం లేదు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం ప్రత్యేకంగా చట్టం చేయడానికి పాలకులు చర్యలు తీసుకోవడం లేదు. ఒక్కోసారి వాతావరణంలో నెలకొన్న పరిస్థితులతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కూడా ప్రయత్నాలు ఆశించినంత ఉండవు. ప్రభుత్వాలు చొరవ తీసుకుని రైతుపై ఆర్థిక భారం తగ్గేలా ప్రత్యామ్నాయ చర్యలు అన్వేషించాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రంలో 80 లక్షల మంది రైతులు సుమారు కోటి 60 లక్షల ఎకరాలల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వానాకాలంలో రాష్ట్రంలో కోటి 56 లక్షల ఎకరాలు సాగు చేయనున్నట్టు వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏడు లక్షల రైతు కుటుంబాలు పది లక్షల ఎకరాల్లో



వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నాయి. ప్రతియేటా వ్యవసాయం రంగంలో సాగు ఖర్చులు రెట్టింపు అవడంతో రైతులకు సాగు భారం అవుతోంది. రసాయనిక ఎరువులతో నిండిపోయిన భూముల్లో పంట దిగుబడి తగ్గుతుండటంతో పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. దుక్కి దున్నినప్పటి నుంచి పంట విక్రయించే వరకు పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. కానీ గిట్టుబాటు మాత్రం కావడం లేదు.

పెట్టుబడి రెండింతలు..

చమురు ధరలు పెరగడంతో దీని ప్రభావం ఎరువు, విత్తనాలు, ఇతర ఖర్చులపై పడుతోంది. 2021-22లో పొలం దుక్కి దున్నేందుకు గంటకు రూ. వెయ్యి ఉంది. ప్రస్తుతం గంటకు రూ.1500 అయింది. ఒక ఎకరం పొలం నాటు వేసే సమయానికి మూడు సార్లు దున్నాల్సి వస్తోంది. సుమారు 5 గంటలు పడుతుంది. ఈ లెక్కన కేవలం దుక్కి ఖర్చు రూ. 7500 అవుతుంది. నాటు ఖర్చులు గతంలో రూ. 3500 ఉంటే ప్రస్తుతం రూ. 5500లకు పెరిగాయి. వ్యవసాయ కూలీలకు గతంలో రూ. 350 నుంచి రూ. 750కి పెరిగింది. ఇలా అన్ని ఖర్చులు 30 నుంచి 40 శాతం పెరిగాయి. కానీ ధాన్యం రేటు మాత్రం గత కొన్నేండ్ల నుంచి పెరిగింది 3 శాతం మాత్రమే. దీంతో వ్యవసాయం గిట్టుబాటు ...10లో

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మోడీ, సీఎం రేవంత్‌రెడ్డితో సహా పలు రంగాలకు చెందిన ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

చెరగని ముద్ర వేసిన గొప్పవ్యక్తి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



"రామోజీరావు దూర దృష్టితో సమాజంలో చెరగని ముద్ర వేశారు. ఆయన మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. పత్రికా, టీవీ రంగంతో సహా అనేక సంస్థలు స్థాపించిన ఆయన ఎంతో మందికి మార్గదర్శకుడిగా నిలిచిన సృజనాత్మక వ్యాపారవేత్త. వివిధ రంగాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి" అని ఆమె పేర్కొన్నారు.

దేశాభివృద్ధి కోసం ఆలోచించారు: ప్రధాని మోడీ



"రామోజీరావు మరణం ఎంతో బాధాకరం. ఆయన ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమే ఆలోచించే వారు. ఆయన లేని లోటు దేశానికి తీరని నష్టం. భారతీయ సినీ, పత్రికా రంగాల్లో చెరగని ముద్ర వేశారు. పట్టుదల, కృషితో సినీ, మీడియా రంగంలో కొత్త ఆవిష్కరణలకు నాంది పలికి. నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ఆయన నుంచి అపార జ్ఞానాన్ని పొందేందుకు అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి" అని ప్రధాని పేర్కొన్నారు.

పూడ్చ లేని లోటు: సీఎం రేవంత్ రెడ్డి



"రామోజీరావు లేని లోటు పూడ్చలేనిది. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన వ్యక్తిగా ఆయన చిరస్మరణీయులు. ఇటీవలే ఆయనతో భేటీ అయ్యాను. రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి" అని సీఎం పేర్కొన్నారు.

రామోజీరావు మరణం పట్ల సీపీఐ(ఎం) సంతాపం



ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంతాపాన్ని ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చెరుపల్లి సీతారాములు, డిజి నర్సింహారావు సందర్శించి రామోజీరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ పత్రికా రంగాన్ని, ప్రసార మాధ్యమాలను ఆయన కొత్త పుంతలు తొక్కించారని చెప్పారు. ఆయన మరణం పత్రిక, ప్రసార మాధ్యమాలకే కాకుండా అనేక ఇతర రంగాలకూ తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి సానుభూతిని ప్రకటించారు.

తెలుగుకు వన్నె తెచ్చిన వ్యక్తి: చంద్రబాబు



"రామోజీరావు తెలుగుకు వెలుగులు నింపి వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి. సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించారు. ఆయన మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసింది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన కోలుకుంటారని భావించాను. కాని ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదు. ఆయన మరణం రాష్ట్రానికే కాదు దేశానికి కూడా తీరని లోటు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

అక్షర వీరుడు రామోజీరావు: కేసీఆర్



అక్షర వీరుడు రామోజీరావు. ఆయన తెలుగు పాత్రికేయ, సినీ రంగాలకు ఎనలేని సేవలు చేశారు. ఆయన మృతి తీరని లోటు. వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం.

ఈనాడు ఆయన మానసపుత్రిక
బి వెంకట్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏఐఏడబ్ల్యూయూ



ఈనాడు పత్రికను రామోజీరావు తన మానసపుత్రికగా భావించి ఆ రంగంలో నూతన ఒరవడి సృష్టించారని ఏఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ పేర్కొన్నారు. ఫిలిమ్‌సిటీలో భౌతికగాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికారంగంలో ఆయనది సుదీర్ఘ ప్రయాణమని కొనియాడారు. తెలుగు పత్రికా రంగ చరిత్రలో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. వామపక్షాలతోనూ ఆయన అనుబంధం పెన వేసుకున్నదని గుర్తు చేశారు.

సారా ఉద్యమానికి రామోజీ రావు బాసటగా నిలిచారు :ఐద్వా జాతీయ నాయకురాలు పుణ్యవతి

ఈ నాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు నాటి సారా వ్యతిరేక ఉద్యమానికి బాసటగా నిలిచారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నాయకురాలు ఎస్ పుణ్యవతి గుర్తు చేశారు. ఆయన మృతి తెలుగు ప్రజలకు దిగ్భ్రాంతి కలిగించిందని తెలిపారు.



రామోజీరావు ఈనాడు పత్రిక ద్వారా ఆనాటి సారా ఉద్యమానికి ఎంతో మద్దతు ప్రకటించారని తెలిపారు.

1993లో విజయ వాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం స్వర్ణోత్సవ సభలకు ముఖ్య అతిథిగా హాజరై మద్దతు ప్రకటించారని తెలిపారు .రామోజీ మరణం పట్ల ఐద్వా సీనియర్ నాయకురాలు టీ జ్యోతి, రాష్ట్ర అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మీ ఉపాధ్యక్షులు ఆశాలత, హైమావతి సంతాపాన్ని ప్రకటించారు.

తెలుగు సంస్కృతికి ప్రతిబింబం రామోజీరావు : నారాయణ

తెలుగు సంస్కృతికి ప్రతిబింబం రామోజీరావు అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. ఏపీలో కొత్త ప్రభుత్వం జాతికి ఉపయోగపడేలా ఆయన స్మారకాన్ని నిర్మించాలని సూచించారు. రామోజీరావు మరణం పట్ల సంతాపం ప్రకటించారు. ఆయన పేరు చెప్పగానే అంతర్జాతీయ స్థాయిలో ఫిల్మ్‌సిటీ, గ్రామీణ స్థాయిలో పత్రిక గుర్తుకు వస్తాయని చెప్పారు. ఆయన ప్రగతిశీల వ్యక్తి అనీ, తొలిదశలో వామపక్ష ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు.సీఆర్ ఫౌండేషన్, వృద్ధాశ్రమం పట్ల ఆయనకు మక్కువ ఎక్కువ అని అన్నారు.

సీపీఐ నేతల నివాళి

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు భౌతికకాయాన్ని సందర్శించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు.

పలువురి సంతాపం

తెలుగు మీడియా, సినీ రంగాలకు రామోజీ చేసిన సేవలు మరవ లేనివని పేర్కొంటూ పలువురు ప్రముఖులు తమ సంతాపాన్ని ప్రకటించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మెన్ గుత్త సుఖేందంరెడ్డి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమాంరెడ్డి, పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రెస్ అకాడమీ చైర్మెన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, సమచార శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంతరావు రామోజీ మరణం పట్ల తమ సంతాపాన్ని ప్రకటించారు.

వివాదాస్పదంగా దాస్ నియామకం

- ఏపీ అధికారిని నియమిస్తారా ?

అంటూ బీఆర్‌ఎస్ నేతల గరంగరం

- గులాబీ కాలంలోనే ఏం చేశారు ?
- ఎదురుతిరుగుతున్న కాంగ్రెస్

నవతెలంగాణ ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర సాగునీటి పారుదల, అభివృద్ధి శాఖ సలహాదారుగా ఏపీ మాజీ సీఎస్ ఆదిత్యనాథ్ దాస్ నియామకం వివాదాస్పదమవుతున్నది. ఏపీ ప్రయోజనాల కోసం పని చేసిన అధికారిని తెలంగాణలో ఎలా నియమిస్తారంటూ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. కేఆర్‌ఎంబీలో తెలంగాణ అవసరాలను తొక్కిపెట్టేలా చూశారనీ, ఆయన్ను తెలంగాణ సలహాదారుగా నియమించడం ఎంతవరకు సమంజసమని అడుగుతున్నారు. దాస్ గతంలో ఏపీ మాజీ సీఎస్‌గానే గాక ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శిగా పని చేశారు. అలాగే 2021కి ముందు ఏపీ సాగునీటి శాఖకు ముఖ్యకార్యదర్శిగా, ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఢిల్లీలో ఏపీ సర్కారు సలహాదారుగా వ్యవహరించారు. అలాంటి వ్యక్తిని రాష్ట్రంలోని కీలకమైన శాఖకు సలహాదారుగా నియమించడం సరికాదనే వ్యాఖ్యానాలు వస్తున్నాయి. ఆదిత్యనాథ్ దాస్‌ను లోక్‌సభ ఎన్నికల ముందే నియమించాలని రేవంత్ సర్కారు భావించింది. ఆయనతో సంప్రదింపులు సైతం చేపట్టింది. ఆలోపు పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ రావడం, వెనువెంటనే కోడ్ అమల్లోకి వచ్చేయడంతో నియామకం సాధ్యం కాలేదని తెలిసింది. దీంతో కోడ్ ఎత్తేసిన ఒక రోజులోనే దాస్‌ను సలహాదారుగా నియమించడం గమనార్హం. ఏపీ అధికారిని నియమించారంటూ బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నా, కాంగ్రెస్ నేతలు నియామకాన్ని సమర్థిస్తున్నారు. అధికారులు ఏ ప్రభుత్వంలో పనిచేస్తే, ఆ ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇప్పుడు ఆయనకున్న అనుభవం దృష్ట్యా రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ, కొత్త ప్రాజెక్టుల రూపకల్పన, కేఆర్‌ఎంబీ, జీఆర్‌ఎంబీల్లో నీటి ప్రయోజనాల కోసం ఆదిత్యనాథ్ దాస్ సేవలను వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నదని అంటున్నారు. ఏపీలో చంద్రబాబు అధికారంలోకి రాగానే, తెలంగాణపై కర్రపెత్తనం ప్రారంభించారని సింగిరెడ్డి అనడాన్ని తప్పుబడుతున్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శలు పనిగట్టుకుని చేయడం సరికాదనీ, కర్రపెత్తనం చేస్తే సహించే పరిస్థితి తెలంగాణ ముఖ్యమంత్రికి, మంత్రులకు లేదని వ్యాఖ్యానిస్తున్నారు. పోతిరెడ్డిపాడు, దుమ్ముగూడెం, రాయలసీమ ఎత్తిపోతల పథకాలతో తెలంగాణ నీటిని తరలించడంలోనూ ఆదిత్యనాథ్ దాస్ కీలకపాత్ర పోషించారని సింగిరెడ్డి చెప్పడం సిగ్గుచేటని కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారు. గత పదేండ్లుగా అధికారంలో ఉన్నది బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఆయన మంత్రివర్గ సహచరులే కదా, తెలంగాణ నీటి ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుంటే ఏంచేశారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ హయాంలోనే కృష్ణాజలాలను తీవ్రంగా నష్టపోయామనీ, కాళేశ్వరం ప్రాజెక్టును నిబంధనలకు విరుద్ధంగా కట్టి వేల కోట్లు నష్టపోయేలా చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు కోసం చేసిన అప్పుకు కాంగ్రెస్ సర్కారు వడ్డీ కడుతున్న సంగతిని గుర్తు చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశారనీ, ఇప్పుడు నిర్మాణాలకు గ్యారెంటీ లేదని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిన సంగతిని కాంగ్రెస్ నేతలు సింగిరెడ్డికి గుర్తు చేస్తున్నారు.

ఆదిత్యానాథ్ దాస్ నియామకం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆధిత్యనాథ్‌దాస్‌ను రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు పదవి నుంచి తొలగించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి విషయాల్లో చంద్రబాబు ఆదేశిస్తున్నాడు .. శిష్యుడు రేవంత్ పాటిస్తున్నాడని విమర్శించారు. ప్రమాణ స్వీకారానికి ముందే తెలంగాణపై చంద్రబాబు కర్రపెత్తనం మొదలైందనడానికి ఈ నియామకమే నిదర్శనమని పేర్కొన్నారు. నాటి జలయజ్ఞం ప్రాజెక్టుల నుంచి నేటి పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేసి పనులు ఆపిన వ్యవహారంలో ఆదిత్యాదాస్‌ది కీలకపాత్ర అని తెలిపారు. ఏపీ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తికి తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవిని ఎందుకు కట్టబెట్టారో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టుల వ్యతిరేకిగా ముద్రపడ్డ వ్యక్తిని ఏ ప్రయోజనాల కోసం ఈ పదవిలో కూర్చోబెట్టారో చెప్పాలని ప్రశ్నించారు. ఆంధ్రాకు కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటిని తరలించటంలో ఆయనది కీలకపాత్రని తెలిపారు. కేఆర్‌ఎంబీలో తెలంగాణ వాదనను తొక్కిపట్టి ప్రాజెక్టుల మీద హక్కులు కోల్పోయేలా చేసిన వ్యక్తిని నియమించడం వెనక కాంగ్రెస్ ఆలోచనేంటని ప్రశ్నించారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 10.35 లక్షల కేసుల పరిష్కారం

- రూ.743 కోట్ల పరిహారం చెల్లింపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఆయా కోర్టులు, వినియోగదారుల ఫోరాల్లో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌తో 10,35,520 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా రూ.743 కోట్లను నష్ట పరిహారం కింద చెల్లించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ పిలుపు మేరకు శనివారం రాష్ట్రంలోని అన్ని కోర్టులు, వినియోగదారుల ఫోరాల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా రకరకాల కేసులపై ఇరుపార్టీల మధ్య విచారణతోపాటు సమన్వయం చేశారు. జిల్లాలతోపాటు హైకోర్టులో పరిష్కారం చేసిన కేసుల్లో 5,81,611 ప్రిలిటిగేషన్ కేసులు, 4,53,909 పెండింగ్ కేసులను పరిష్కరించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ సుజోయ్ పాల్, చైర్మెన్ జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి అన్ని కోర్టులతో సమన్వయం చేశారు. ఈ మేరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి సిహెచ్ పంచాక్షరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి

- ఎన్టీఏను రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేయాలని కోరింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి హడావుడి లేకుండా దేశంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల సమయంలో నీట్ ఫలితాలను ప్రకటించిందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 14న ఫలితాలను వెల్లడించాల్సి ఉండగా, పది రోజుల ముందుగానే ప్రకటించడంపై దేశవ్యాప్తంగా ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఏ వచ్చినప్పటి నుంచి దాని పారదర్శకతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. గత పరీక్షల్లో అది చేసిన తప్పిదాలు, అవకతవకలు పునరావృతమవుతున్నాయని తెలిపారు. నీట్ పరీక్ష 720 మార్కులకు నిర్వహించారని వివరించారు. గణితంలోనే పూర్తి మార్కులను సాధించడం సాధ్యం కాదనీ, అలాంటిది నీట్‌లో 720కి 720 మార్కులొచ్చాయని పేర్కొన్నారు. దీనిపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విద్యాకేంద్రీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేపడతామని తెలిపారు. నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని కోరారు. నీట్ అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : ఏఐఎస్ఎఫ్

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఏ నిర్వహించిన నీట్ రాతపరీక్ష, ఫలితాలపై అనేక అనుమానాలున్నాయని తెలిపారు. ఈ ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనుమానాలను వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. 720కి 720 మార్కులు రావడమే ఇందుకు నిదర్శనమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి : పీడీఎస్‌యూ

నీట్ యూజీ పరీక్ష ఫలితాల అవకతవకలపై లోతుగా విచారణ జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ రాతపరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరారు. ఆ ఫలితాలపై అనేక అనుమానాలు, సందేహాలు కలుగుతున్నాయని తెలిపారు. ఈ ఫలితాల్లో 62 మందికి 720కి 720 మార్కులు రావడం, ఒకే కేంద్రంలో ఎనిమిది మందికి పూర్తి మార్కులు రావడం, గ్రేస్ మార్కులు కేటాయించిన తీరు పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. గుజరాత్ కేంద్రంగా ఒక కన్సల్టెన్సీ సంస్థ ఒక్కో విద్యార్థి నుంచి పది లక్షల రూపాయలు తీసుకుని నీట్ ప్రశ్నాపత్రాన్ని లీక్ చేసినట్టు వార్తలొచ్చాయని తెలిపారు. విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల కానున్నాయి. జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు సాధించిన 2.50 లక్షల మంది అభ్యర్థులు అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత సాధించారు. వారిలో 1.91 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేశారు. గతనెల 26న ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్షలు రాసిన అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లను గతనెల 31 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రాథమిక కీని ఈనెల రెండో తేదీన విడుదల చేశారు. ఐఐటీల్లో సీట్ల ప్రవేశాలకు సంబంధించి ఈనెల 10 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

జర్నలిజంలో కొత్త పుంతలు

- రామోజీ మృతికి టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఈనాడు మీడియా గ్రూప్ సంస్థల చైర్మెన్ రామోజీరావు మతి పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజే ఎఫ్) రాష్ట్ర కమిటి సంతాపాన్ని తెలియజేసింది. అలుపెరుగని అక్షర యోధునికి ఘన నివాళులర్పించింది. ఆయన కుటుంబానికి , రామోజీ గ్రూపు సంస్థల జర్నలిస్టులు, ఉద్యోగులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. రామోజీరావు పాత్రికేయ రంగంలో చెరగని ముద్ర వేశారనీ, పత్రికా స్వేచ్ఛను, జర్నలిజం విలువలను కాపాడేందుకు విశేష కృషి చేశారని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య పేర్కొన్నారు. పత్రికా రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారని చెప్పారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వేలాది మంది జర్నలిస్టులను తయారుచేసి తెలుగు సాహిత్య, సమాచారాభి వద్ధికి తోడ్పడ్డారని చెప్పారు. తెలుగు భాషకు, తెలుగు మీడియా రంగానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివంటూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తెలంగాణ ఉద్యమ రచన మొదలైంది

ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్

నవతెలంగాణ-ఓయూ



తెలంగాణ ఉద్యమ రచన మొదలైందని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. నలమాస కృష్ణ రచించిన "ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం" పుస్తకావిష్కరణ సభ శనివారం ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ లో నిర్వహించారు. ఛాయ ఈ పుస్తకాన్ని ప్రచురించారు. మాందాల భాస్కర్ అధ్యక్షత వహించిన ఈ సభకు కె.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రపంచ గర్వించదగిన విద్యార్థి ఉద్యమం తెలంగాణ విద్యార్థి ఉద్యమం అని, అందులో ఆత్మహత్యలు బాధాకరం అన్నారు. విద్యార్థుల త్యాగం లేకపోతే తెలంగాణ రాష్ట్రం లేదన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమాన్ని సంఘటనగా కాకుండా ఆ విద్యార్థి ఉద్యమ క్రమాన్ని రచయిత ఇందులో రికార్డ్ చేశారని తెలిపారు. విద్యార్థుల చేతిలో నుంచి ఉద్యమాన్ని లాక్కునేందుకే రాజకీయ జేఏసీ ఏర్పడిందని ఇందులో చేసిన సూత్రీకరణ చర్చనీయాంశమన్నారు. ప్రొఫెసర్ సీ. కాశీం మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం మీద ఇప్పటి వరకు నిర్మాణాత్మక రచన లేదని, ఆ ఖాళీని ఈ పుస్తకం కాస్త పూరిస్తుందని తెలిపారు. నెత్తురు చిందకుండా తెలంగాణ వచ్చింది అనుకునేవారు తయారైన కాలంలో చిందిన నెత్తురును నమోదు చేసిన పుస్తకం ఇదన్నారు. పుస్తక రచయిత నలమాస కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థి ఉద్యమంపై చేసిన ఈ పరిశోధన కేవలం విద్యార్థులకు సాధారణంగా ఉండే లక్షణాన్నే కాకుండా సామాజిక ఉద్యమాల్లో వాళ్లు పోషించిన పాత్రనూ విశ్లేషిస్తుందని తెలిపారు. ఇంకా పుస్తక సహా సంపాదకుడు డేవిడ్, ఛాయ సంపాదకులు అరుణాంక్ లత, పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడారు.

ప్రొఫెసర్ వెంకటేష్ నాయక్, ప్రొఫెసర్ గాలి వినోద్, ప్రొఫెసర్ ననుమాస స్వామి, దుర్గం భాస్కర్, కోట శ్రీనివాస్, దరువు ఎల్లన్న, స్టాలిన్, కంచర్ల బద్రి, మోహన్ ధరావత్, నెల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి పీజీ ఈసెట్ రాతపరీక్షలు

- 13 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ
- 22,712 మంది దరఖాస్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డీ(పీబీ) కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే పోస్టు గ్రాడ్యుయెట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) రాతపరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయి. 19 సబ్జెక్టుల్లో ప్రవేశాల కోసం ఈనెల 13 వరకు ఆన్‌లైన్‌లో ఆ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు పీజీఈసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజూ రెండు విడతల్లో పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం మొదటి విడత ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 వరకు, రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి విడతకు ఉదయం 8.30 గంటల నుంచి, రెండో విడతకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని తెలిపారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

హాల్‌టికెట్‌తోపాటు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతోపాటు ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. కాలిక్యులేటర్లు, మ్యాథమెటికల్/లాగ్ టేబుళ్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, గడియారాలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు తెచ్చుకోవడం నిషేధమని తెలిపారు. పీజీఈసెట్‌కు 22,712 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వారిలో 12,532 మంది అమ్మాయిలు, 10,180 మంది అమ్మాయిలున్నారని తెలిపారు. పీజీఈసెట్ రాతపరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://pgecet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

బడిబయటి పిల్లలు 16,683 మంది

ప్రాథమిక స్థాయిలో 11,405, మాధ్యమిక స్థాయిలో 5,278

- జోగులాంబ గద్వాలలో అత్యధికంగా 1,221 మంది
- హన్మకొండలో అత్యల్పంగా 120 మంది
- విద్యాశాఖ సర్వేలో గుర్తింపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బడిబయట పిల్లలు 16,683 మంది ఉన్నారు. వారిలో ప్రాథమిక (ఎలిమెంటరీ) స్థాయిలో 11,405 మంది, మాధ్యమిక (సెకండరీ) స్థాయిలో 5,278 మంది పిల్లలున్నారు. పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యధికంగా 1,221 మంది ఉన్నారు. వారిలో ప్రాథమిక స్థాయిలో 956 మంది, మాధ్యమిక స్థాయిలో 265 మంది ఉన్నట్టు గుర్తించారు. హన్మకొండ జిల్లాలో అత్యల్పంగా 120 మంది ఉన్నారు. వారిలో ప్రాథమిక స్థాయిలో 95 మంది, మాధ్యమిక స్థాయిలో 25 మందిని గుర్తించారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాథమిక స్థాయిలో 659 మంది, మాధ్యమిక స్థాయిలో 303 మంది కలిపి 962 మంది ఉన్నారు. కామారెడ్డి జిల్లాలో ప్రాథమిక స్థాయిలో 591 మంది, మాధ్యమిక స్థాయిలో 348 మంది కలిపి 939 మంది, సిద్దిపేట జిల్లాలో ప్రాథమిక స్థాయిలో 458 మంది, మాధ్యమిక స్థాయిలో 398 మంది కలిపి 856 మంది ఉన్నట్టు అధికారులు గుర్తించారు. హైదరాబాద్ జిల్లాలో ప్రాథమిక స్థాయిలో 553 మంది, మాధ్యమిక స్థాయిలో 21 మంది కలిపి 574 మంది పిల్లలున్నారు.

వారి వయస్సు తగ్గ తరగతిలో ప్రవేశం

బడి బయట ఉన్న పిల్లలు మధ్యలో చదువును మానేయడం, పాఠశాలలకే వెళ్లని వారు ఉండొచ్చు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2010, ఏప్రిల్ ఒకటో తేదీన అమల్లోకి వచ్చింది. 6-14 ఏండ్ల వయస్సు గల పిల్లలను బడిలో తప్పనిసరిగా చేర్పించాలని చట్టం చెబుతోంది. బడి బయట ఉన్న బడిఈడు పిల్లలను విద్యాశాఖ గుర్తించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,683 మంది ఉన్నారు. బడిబయట ఉన్న పిల్లలను వారి వయసుకు తగ్గ తరగతిలో ప్రవేశం కల్పించాలి. ఆ తరగతిలో కూర్చోవడానికి ముందు వారికి తగిన అభ్యసనా స్థాయిని పెంచాల్సిన అవసరముంది. ఆ పిల్లలకు ప్రత్యేక బోధన కార్యక్రమం చేపట్టాలని విద్యాహక్కు చట్టంలో నిబంధనలు చెప్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ చిత్తశుద్ధితో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడమే కాకుండా వారిని బడుల్లో చేర్పించి నాణ్యమైన విద్య అందించాల్సిన అవసరమున్నది.

బడిబయట ఉన్న పిల్లల వివరాలు

జిల్లా	ప్రాథమిక స్థాయి	మాధ్యమిక స్థాయి
1. ఆదిలాబాద్	563	121
2. భద్రాద్రి కొత్తగూడెం	429	143
3. హన్మకొండ	95	25
4. హైదరాబాద్	553	21
5. జగిత్యాల	220	232
6. జనగామ	133	130
7. భూపాలపల్లి	236	131
8. జోగులాంబ గద్వాల	956	265
9. కామారెడ్డి	591	348
10. కరీంనగర్	275	333
11. ఖమ్మం	456	377
12.ఆసిఫాబాద్	659	303
13. మహబూబాబాద్	242	98
14. మహబూబ్‌నగర్	353	92
15. మంచిర్యాల	135	215
16. మెదక్	246	165
17. మేడ్చల్ మల్కాజిగిరి	440	20
18. ములుగు	201	67
19. నాగర్‌కర్నూల్	255	108
20. నల్లగొండ	248	236
21. నారాయణపేట	361	289
22. నిర్మల్	213	77
23. నిజామాబాద్	297	13
24. పెద్దపల్లి	88	67
25. రాజన్న సిరిసిల్ల	181	125
26. రంగారెడ్డి	550	163
27. సంగారెడ్డి	585	107
28. సిద్దిపేట	458	398
29. సూర్యాపేట	192	91
30. వికారాబాద్	343	210
31. వనపర్తి	493	146
32. వరంగల్	153	124
33. యాదాద్రి భువనగిరి	205	38
మొత్తం	11,405	5,278



ఐకమత్యంగా..

- బీజేపీకి బుద్ధి చెప్పిన హిందూ-ముస్లిం ఓటర్లు
- యూపీ, పశ్చిమ బెంగాల్‌లో కాషాయపార్టీకి ఝలక్

న్యూఢిల్లీ : ఈ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు బీజేపీకి గట్టి షాక్‌ను ఇచ్చాయి. చార్ సౌ పార్ నినాదంతో వెళ్లిన బీజేపీకి కనీసం కూటమితో కలుపుకొని 300 సీట్లను కూడా సాధించకుండా చతికిలపడిపోయింది. బోటాబొటి మెజారిటీతో కూటమిలోని పార్టీల సహాయంతో మోడీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. అయితే, గత ఎన్నికలకు భిన్నంగా బీజేపీకి హిందూ-ముస్లింలు షాకిచ్చారనీ, ఇక్కడ వారి ఐకమత్యం కాషాయపార్టీకి సీట్లు తగ్గటానికి బలమైన కారణంగా పని చేసిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ప్రధానిగా మోడీ తన అనేక టీవీ ఇంటర్వ్యూలలో ముస్లింలను కొంతవరకు అభ్యర్థించారు. "నేను మొదటిసారిగా ముస్లిం సమాజానికి, వారిలో బాగా చదువుకున్న ప్రజలకు చెబుతున్నాను. ఆత్మపరిశీలన చేసుకోండి. మీరు ఎందుకు వెనుకబడి ఉన్నారు? కారణం ఏమిటి? కాంగ్రెస్ హయాంలో మీకు ఎందుకు ప్రయోజనాలు రాలేదు? ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు మారుతున్నారు" అంటూ మోడీ ముస్లింలను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. అయితే, ముస్లింలు అతని మాట విన్నట్టు కనిపించడం లేదని ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. ముఖ్యంగా, యూపీ, పశ్చిమ బెంగాల్ ఫలితాలను చూస్తే ఇది అర్థమవుతుంది. ఇక్కడ ఈ సారి ఎన్డీఏ కంటే ఎక్కువ ఓట్ల వాటాను ఇండియా బ్లాక్‌లోని పార్టీలు పొందాయి.

మోడీ కాలంలోని మూడు లోక్‌సభ ఎన్నికల్లో (2014, 2019, 2024), 2017, 2022 విధానసభ ఎన్నికలలో యూపీలో 80 లోక్‌సభ లేదా 403 అసెంబ్లీ స్థానాల్లో ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా బీజేపీ నిలబెట్టలేదు. అయినప్పటికీ, బీజేపీ సర్వశక్తిమంతమైన మెజారిటీలను సాధించింది. అయితే, ముస్లిం వర్గం పట్ల బీజేపీ తీరుతో పాటు బీజేపీలోని అగ్రనాయకత్వం మధ్య ఆధిపత్య పోరే యూపీలో కషాయపార్టీకి నష్టాన్ని చేకూర్చిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇదే బీజేపీకి పెద్ద ఆందోళన కలిగించే అంశమని వారు అంటున్నారు.

యూపీలో 20 శాతం, పశ్చిమ బెంగాల్ జనాభాలో దాదాపు 33 శాతం మంది ముస్లిం జనాభా ఉన్నది. 2019లో బీజేపీ పశ్చిమ బెంగాల్‌లోని 42 ఎంపీ స్థానాలకు గానూ 18 స్థానాలను గెలుచుకున్నది. ఇప్పుడు మాత్రం 11 స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఆ పార్టీకి ఏర్పడింది. సీట్లు వచ్చే అన్ని రాష్ట్రాల్లోనూ బీజేపీ సింపుల్ ఫార్ములానే అనుసరిస్తున్నది. హిందువులను రెచ్చగొట్టి గంపగుత్తగా ఓట్లు పడేలా చేసుకోవటమే బీజేపీ ప్లాన్. అయితే, ఇది యూపీ, పశ్చిమ బెంగాల్‌లోని ముస్లింలనే కాకుండా, హిందువులనూ ఆలోచింపజేసింది. బీజేపీ కుయుక్తులను అర్థం చేసుకున్న వీరు.. ఊహించని షాకింగ్ ఫలితాలను కమలం పార్టీకి ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో "మహిళలపై అఘాయిత్యాల" అంశాన్ని బీజేపీ లేవనెత్తినా.. అక్కడి ప్రజలు నమ్మలేదని చెప్తున్నారు. ఈ కారణాలతో హిందూ-ముస్లిం ఓటర్ల ఐకమత్య బలం కాషాయపార్టీకి అర్థమైందనీ, ఇది భవిష్యత్ రాజకీయాలకు మంచి సూచిక అని మేధావులు, సామాజికవేత్తలు అంటున్నారు.

జమ్మూ కాశ్మీర్‌లో
అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ షురూ

- అధికారికంగా ప్రారంభించిన ఈసీఐ

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) అధికారికంగా ప్రారంభించింది. జమ్మూ కాశ్మీర్‌లోని కేంద్ర పాలిత ప్రాంత (యూటీ) శాసనసభకు సాధారణ ఎన్నికల కోసం 1968 ఎన్నికల చిహ్నాల (రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్ 1968లో పేరా 10బి కింద ఉమ్మడి గుర్తును కేటాయించాలని కోరుతూ దరఖాస్తులను ఆమోదించాలని కమిషన్ నిర్ణయించిందని ఈసీఐ సెక్రెటరీ జయదేబ్ లాహిరి ఒక ప్రెస్ నోట్ ద్వారా వివరించారు. జమ్మూకాశ్మీర్ ప్రజలు తమ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని యూటీలో త్వరలో ఏర్పాటు చేస్తారని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ పేర్కొన్నట్టు స్పష్టం చేశారు. 2014లో జమ్మూకాశ్మీర్‌లో చివరి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ముఫ్తీ మహ్మద్ సయీద్ నేతృత్వంలోని బీజేపీ, పీడీపీల సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2016లో ముఖ్యమంత్రి ముఫ్తీ మహ్మద్ సయీద్ మరణం తర్వాత, సంకీర్ణానికి ఆయన కుమార్తె మెహబూబా ముఫ్తీ నేతృత్వం వహించారు. జూన్ 18, 2019న సంకీర్ణ ప్రభుత్వం నుంచి బీజేపీ వైదొలిగింది. ఆ తర్వాత మెహబూబా ముఫ్తీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో జమ్మూకాశ్మీర్‌లో గవర్నర్ పాలన విధించబడింది. ఆ తర్వాత రాష్ట్రపతి పాలన వచ్చింది. ఆగస్టు 5, 2019న ఆర్టికల్ 370, 35(ఎ)ను మోడీ సర్కారు రద్దు చేసింది. రాష్ట్రాన్ని రెండు యూటీలుగా చేసింది. దీంతో అప్పటి నుంచి జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) పాలనలో ఉన్నది.

మేకపోతు గాంభీర్యం

- పరాజయం ఎక్కడంటూ వితండవాదం
- యూపీ ఎదురు దెబ్బల ప్రస్తావనే లేదు
- ఎన్డీఏ భేటీలో కాంగ్రెస్‌పై మోడీ వ్యంగ్యాస్త్రాలు



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో 240 స్థానాలు మాత్రమే గెలుచుకున్న బీజేపీ... మెజారిటీకి ఆమడ దూరంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా ప్రధాని మోడీ మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాలులో ఎన్డీఏ నేతలను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగాన్ని గమనిస్తే ఈ విషయం అర్థమవుతుంది. గతంలో తాము ఎన్నడూ ఓడిపోలేదని, ఇప్పుడు కూడా పరాజయం చెందలేదని ఆయన చెప్పుకొచ్చారు.

'మేము ఓటమి పాలయ్యామంటూ గత రెండు రోజులుగా ప్రచారం జరుగుతోంది. బహుశా కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఆయా పార్టీలు ఇలా చెబుతూ ఉండవచ్చు. ఇలాంటి కల్పిత కథలు అల్లడం వారికి అవసరం. గణాంకాలను బట్టి చూస్తే చరిత్రలో ఇప్పుడు ఏర్పడబోయేది బలమైన కూటమి ప్రభుత్వం. ఓటమి వెనుక విజయాన్ని కప్పిపుచ్చేందుకు వారు ప్రయత్నించారు. కానీ మేము గతంలో ఎన్నడూ ఓడిపోలేదని, ఇప్పుడు కూడా ఓటమి చెందలేదని ప్రజలకు తెలుసు' అని ఆయన ప్రతిపక్షాలపై విమర్శలు సంధించారు.

బీజేపీ కాదు... ఎన్డీఏ ప్రభుత్వం

ప్రధాని వ్యాఖ్యలు ఎలా ఉన్నప్పటికీ ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీకి తెలుగుదేశం, జేడీయూ పార్టీల మద్దతు తప్పనిసరి అని ఫలితాలు చెబుతున్నాయి. ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, జేడీయూ అధిపతి నితీష్ కుమార్ మోడీ పక్కనే కూర్చోవడం పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. వాస్తవానికి బీజేపీ ఎన్నికల ప్రచారం యావత్తూ మోడీ చుట్టూనే సాగింది. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోకు కూడా 'మోడీ కీ గ్యారంటీ' అని పేరు పెట్టారు. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ బీజేపీకి లభించక పోవడంతో రాబోయేది 'మోడీ ప్రభుత్వం' కాదని, 'ఎన్డీఏ ప్రభుత్వమని స్పష్టమైపోయింది.

రామ జపం కాదు... జగన్నాథ జపం

కాగా ఎన్నికల్లో తగిలిన ఎదురు దెబ్బలపై ఎన్డీఏ సమావేశంలో మోడీ కనీసం ప్రస్తావించనైనా లేదు. కాంగ్రెస్‌పై మాత్రం ఎప్పటి మాదిరిగానే నిప్పులు చెరిగారు. పది సంవత్సరాల తర్వాత కూడా ఆ పార్టీ సెంచరీ కొట్టలేకపోయిందని ఎద్దేవా చేశారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లను కలిపినా కూడా ఈ ఎన్నికల్లో బీజేపీ సాధించిన స్థానాల సంఖ్యను చేరుకోలేదని గుర్తు చేశారు. ఇండియా బ్లాక్‌ను అత్యంత వేగంగా మునిగిపోతున్న నావగా అభివర్ణించారు. విజయం సాధించిన తర్వాత చేసిన ప్రసంగంలో కూడా ఉత్తరప్రదేశ్‌లో ఎదురైన పరాజయాలను మోడీ గుర్తు చేసుకోలేదు. అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని ఎన్నికల ప్రచారాంశంగా ఉపయోగించుకొని, తీరా విజయోత్సవ సందేశంలో జగన్నాథస్వామిని ప్రస్తుతించారు. జగన్నాథ స్వామి దేవాలయం ఉన్న పూరీ క్షేత్రం ఒడిశాలో ఉంది. ఆ రాష్ట్రంలో ఎన్డీఏకు మంచి ఫలితాలు లభించిన విషయం తెలిసిందే. దానిని దృష్టిలో పెట్టుకొనే మోడీ జగన్నాథ స్మరణ చేశారు. కాగా తమిళనాడులో పార్టీకి ఒక్క సీటు రాకపోయినా అక్కడి కార్యకర్తలను మోడీ ప్రశంసించారు.

వేదికను పంచుకోని ఆర్‌ఎల్‌డీ

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి తీవ్ర ఆశాభంగం కలిగించిన రాష్ట్రం ఉత్తరప్రదేశ్. అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన ఆ రాష్ట్రంలో బీజేపీకి వచ్చింది 33 స్థానాలే. భాగస్వామ్య పక్షమైన ఆర్‌ఎల్‌డీతో కలిపి ఎన్డీఏకు వచ్చింది 36 సీట్లు. ఇండియా బ్లాక్ 43 స్థానాల్లో జయకేతనం ఎగరేసింది. అందులో ఒక్క సమాజ్‌వాదీ పార్టీకే 37 సీట్లు రాగా కాంగ్రెస్‌కు ఆరు స్థానాలు లభించాయి. కేంద్రంలో ఏర్పడబోయే ఎన్డీఏ ప్రభుత్వంలో గతంలో మాదిరిగా కాకుండా ఈసారి మిత్రపక్షాలన్నీ కీలక పాత్ర పోషించబోతున్నాయి. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన ఆర్‌ఎల్‌డీ అధినేత జయంత్ చౌదరి సహచర నేతలతో కాకుండా సమావేశంలో నూతన ఎంపీలతో కలిసి కూర్చోవడం ఆసక్తిని కలిగించింది. మరో మిత్రపక్షమైన అప్నాదళ్ (సోనేలాల్) ఒకే ఒక స్థానాన్ని గెలుచుకున్నప్పటికీ ఆ పార్టీ నేత అనుప్రియ పటేల్ వేదికపై కూర్చున్నారు. గతంలో ఇండియా బ్లాక్‌లో ఉన్న చౌదరి ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో ఎన్డీఏ పంచన చేరారు.

ఎదురు దెబ్బలు మంచివే!

- దూకుడుకు కళ్లెం
- సన్నగిల్లుతున్న ప్రజాదరణ
- మత విభజనకు ప్రయత్నిస్తే జరిగేది ఇదే
- బీజేపీ కార్యకర్తల మనోగతం



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీ కార్యకర్తలను తీవ్రమైన నిరాశా నిస్పృహల్లో ముంచెత్తాయి. పార్టీకి వరుసగా మూడోసారి కూడా స్పష్టమైన ఆధిక్యత లభిస్తుందని ఆశించిన నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా డీలా పడ్డారు. ఫలితాలు వెలువడిన రోజు టీవీలు, యూట్యూబ్ ఛానల్స్, సామాజిక మాధ్యమాలకు అతుక్కుపోయిన బీజేపీ శ్రేణులకు మధ్యాహ్నానికే పరిస్థితి అర్థమైపోయింది. బీజేపీ సొంతంగా 350కి పైగా స్థానాలు సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడంతో పట్టరాని ఆనందంతో సంబరాలు చేసుకున్న కార్యకర్తలు వాస్తవ ఫలితాల ప్రకటనతో హతాశులయ్యారు.

ఈ ఫలితాలు తాము ఊహించలేదని పలువురు కార్యకర్తలు వాపోయారు. కొందరు మాత్రం ఇది ప్రజాస్వామ్యానికి మంచి పరిణామమేనని, ప్రచారంలో చోటుచేసుకున్న పొరబాట్లపై బీజేపీకి సరైన సందేశమే అందిందని వ్యాఖ్యానించారు. హిందూ ఓట్లు గంపగుత్తగా బీజేపీకి పడలేదని సామాజిక మాధ్యమాలలో పలువురు పోస్టులు పెట్టారు. పార్టీ మెజారిటీని కోల్పోవడం మంచిదేనని ఓ కార్యకర్త వ్యాఖ్యానించారు. 'ప్రజాస్వామ్యంలో అపరిమిత అధికారాలు సంక్రమించకుండా ఇలాంటివి అడ్డుకుంటాయి' అని ఆయన చెప్పారు.

2019లో గెలుచుకున్న సీట్లు లభించకపోయినా లోక్‌సభలో బీజేపీ కనీసం సగం స్థానాలనైనా గెలుచుకుంటుందని ఆశించానని మరో కార్యకర్త తెలిపారు. మెజారిటీ తగ్గిపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని అంటూనే ఏ పార్టీ అయినా 400 స్థానాలు గెలుచుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని చెప్పారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగాయని ఫలితాలు నిరూపించాయని మరో కార్యకర్త అన్నారు. ప్రజాభిప్రాయంలో విభజన స్పష్టంగా కన్పించిందని, బీజేపీ ప్రభుత్వ పాలనపై ప్రజలందరూ సంతోషంగా ఏమీ లేరని చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వం విధానాలు రూపొందించుకోవాలని, నైపుణ్యాభివృద్ధిని కొనసాగించాలని సూచించారు. వ్యాపారం, పెట్టుబడులకు రాజకీయ స్థిరత్వం అవసరమని అన్నారు.

పది సంవత్సరాల తర్వాత మరోసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడంపై కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. సంకీర్ణ ప్రభుత్వాలు దేశానికి మంచివి కావని వారు అభిప్రాయ పడ్డారు. సంకీర్ణంలోని భాగస్వామ్య పక్షాలు తమ కోసం, తమ ప్రాంతం కోసం మాత్రమే పని చేస్తాయని వారు చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతి, ఇతర సంస్కరణలు ఇప్పుడు అమలు కాబోవని కొందరు తెలిపారు. ప్రజా తీర్పు బీజేపీ దూకుడుకు కళ్లెం వేసిందని కొందరు పార్టీ కార్యకర్తలు అన్నారు. పార్టీకి ఉన్న ప్రజాదరణ సన్నగిల్లుతోందని వారు అంగీకరించారు. బీజేపీ ఉత్తరా ఖండ్ మైనారిటీ ఫ్రంట్ కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు మహమ్మద్ రఫీ దిండా గుజ్జర్ మాట్లాడుతూ ఈ ఫలితాలు బీజేపీకి... ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ఎదురు దెబ్బేనని చెప్పారు.

బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు సమాజంలో కొన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యం కాలేదని హైదరాబాద్‌కు చెందిన ఆరోగ్య కార్యకర్త కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇక ప్రతి సమాజం యొక్క అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కేవలం గుజరాత్ నేతలకు పెద్దపీట వేస్తే సరిపోదని చురక వేశారు. క్రైస్తవ సమాజంలో బీజేపీ ఆదరణ కోల్పోయిందని చెప్పారు. కొందరు బీజేపీ నాయకులు అవలంబించిన మైనారిటీ వ్యతిరేక వైఖరి కారణంగా క్రైస్తవుల్లో అభద్రతాభావం నెలకొన్నదని అన్నారు. మత విభజనకు ప్రయత్నిస్తే ఇలాగే అవుతుందని బీజేపీకి సంకేతం అందిందని మరో కార్యకర్త వ్యాఖ్యానించారు.

నాయకత్వంలో మితిమీరిన విశ్వాసం, పార్టీ ఓటర్లలో ఆత్మసంతృప్తి బీజేపీ ఓటమికి కారణమయ్యాయని కొందరు అభిప్రాయపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలు, రాజపుత్రులను దూరం పెట్టడం వంటివి బీజేపీ పరాజయానికి దోహదపడ్డాయని హర్యానాకు చెందిన ఓ ప్రభుత్వోద్యోగి చెప్పారు. బీజేపీ నేతల దుందుడుకు వైఖరితో కొన్ని రాష్ట్రాల్లో సీట్లు తగ్గాయని ఓ కార్యకర్త విశ్లేషించారు. తన పేరుతోనే మోడీ ఎన్నికల ప్రచారం చేశారని, స్థానిక నేతలను పట్టించుకోలేదని, అందుకే యూపీలో బీజేపీ దెబ్బతిన్నదని మరొకరు చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధ్య తెరవెనుక విభేదాలు ఉన్నాయని, పార్టీ టిక్కెట్లు ఎవరికి ఇవ్వాలనే విషయంలో యోగి సలహాను అమిత్ పట్టించుకోలేదని కొందరు ఫిర్యాదు చేశారు.

సామాన్యునిగా మొదలై అసామాన్యునిగా..


- తెలుగు మీడియాను నాలుగు దశాబ్దాల పాటు ఏలిన దిగ్గజం
- రామోజీరావు జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చెరుకూరి రామోజీరావు... మీడియా ప్రపంచంలో పరిచయం అక్కర్లేని పేరు. తెలుగు మీడియా, సినీ రంగాలకు గొప్ప సేవలందించిన వ్యక్తిగా ప్రసిద్ధి చెందిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం. 1936 నవంబర్ 16న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెదపారుపూడి గ్రామంలో ఓ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో ఆయన జన్మించారు. తల్లిదండ్రులు చెరుకూరి వెంకట సుబ్బారావు, సుబ్బమ్మలు. కుటుంబంలో ఇద్దరక్కల తర్వాత మూడో సంతానంగా జన్మించిన ఆయనకు విలక్షణ, సృజనాత్మకత అనేవి చిన్నప్పటి నుంచే అలవడ్డాయి. బహుముఖ ప్రజ్ఞ, కఠోర సాధన ఆయన అస్త్రాలు. నలుగురు నడిచిన బాటలో కాకుండా కొత్త దారులు సృష్టించిన రామోజీ... ఎందరికో మార్గదర్శకులయ్యారు. రైతు బిడ్డగా మొదలై వ్యాపార వేత్తగా రాణించిన ఆయన.... మీడియా మహా సామ్రాజ్యాన్ని నెలకొల్పడంతో పాటు సినీ రంగంలో ఎన్నో గొప్ప చిత్రాలను నిర్మించి తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

అన్నదాతతో ప్రారంభం

రైతుల కోసం ఓ ప్రత్యేకమైన పత్రికను ప్రచురించాలని నిర్ణయించుకున్న రామోజీరావు విశాఖపట్నం నుంచి 1969లో అన్నదాత మాస పత్రికను ప్రారంభించారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని రైతులకు అందించడంతో ఈ పత్రిక బాగా ప్రాచుర్యం పొందింది. ఆ తర్వాత ఈనాడు దిన పత్రికను అదే విశాఖ నుంచి 1974లో ప్రారంభించారు. పత్రికకు వచ్చిన ఆదరణ తర్వాత రామోజీ సినీ నిర్మాణ రంగాలవైపు మళ్లారు. 1983లో ఉషా కిరణ్ మూవీస్ ప్రొడక్షన్ హౌస్‌ని స్థాపించారు. దీని ఆధ్వర్యంలో అనేక తెలుగు చిత్రాలను నిర్మించారు. ఈ బ్యానర్‌లో తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ, బెంగాలీ సహా 80కి పైగా విభిన్న భాషల్లో సినిమాలు నిర్మించారు. ఆయన నిర్మించిన రామోజీ ఫిల్మ్ సిటీ ప్రపంచంలోనే అతి పెద్ద ఫిల్మ్ స్టూడియో కాంప్లెక్స్‌గా మన్ననలు పొందింది. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో 2 వేల ఎకరాల్లో ఈ స్టూడియో విస్తరించి ఉంది. 1996లో ప్రారంభమైన ఈ స్టూడియోలో ఏకకాలంలో 15 నుంచి 25 చిత్రాలను చిత్రీకరించవచ్చు. సినిమా ప్రీ ప్రొడక్షన్ నుంచి పోస్ట్ ప్రొడక్షన్ వరకూ అన్ని సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయి. ఫిల్మ్ సిటీగానే కాకుండా, ఇది గొప్ప పర్యాటక ప్రదేశంగా ప్రసిద్ధి పొందింది. ప్రింట్ మీడియాతో పాటు వివిధ భాషల్లో ఈటీవీ పేరుతో వార్తా చానళ్లనూ ఏర్పాటు చేసి ప్రజలకు వినోదాన్ని అందించారు. వీటితో పాటు ప్రియా ఫుడ్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ తదితర సంస్థలను నెలకొల్పి ఎందరికో ఉపాధి కల్పించారు.



అవార్డులు

మీడియా, జర్నలిజం ప్రపంచానికి రామోజీ చేసిన విశేష సేవలకు గాను 2016లో భారతదేశపు రెండో అత్యున్నత పౌర పురస్కారం ఆయనకు లభించింది. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ రామోజీని పద్మవిభూషణ్‌తో సత్కరించారు. దీనికి ముందు 1985లో ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ చలనచిత్ర పురస్కారం (తెలుగు), 1998లో ఫిల్మ్‌ఫేర్ ప్రత్యేక అవార్డు, 2000లో ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ చలనచిత్ర పురస్కారం (తెలుగు), జాతీయ చలనచిత్ర పురస్కారం (నిర్మాత), 2004లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు ఆయన్ను వరించాయి.

ఆపన్న హస్తం

కరోనా మహమ్మారి సమయం (2020)లో రామోజీ రావు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల రిలీఫ్ ఫండ్‌కు రూ. 10 కోట్లు విరాళంగా ఇచ్చారు. అంతే కాకుండా వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల పునరావాసంతో సహా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా పలు విపత్కర సమయాల్లో ఆయన అనేక సేవల ద్వారా ప్రజలకు ఆపన్నహస్తం అందించారు.

హోరాహోరీ

- 114సీట్లలో మెజారిటీ 50వేల కంటే తక్కువే
- ఇందులో ఇండియా గెలుపొందినవి 56
- 29 ఎన్డీఏ అధికారంలో ఉన్న రాష్ట్రాల నుంచే
- ఎన్డీఏకు దక్కినవి 54 సీట్లు
- ఈసీ ఎన్నికల ఫలితాల విశ్లేషణలో వెల్లడి

న్యూఢిల్లీ : బీజేపీ మిత్రపక్షాల మద్దతుతో మోడీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 2019లో కాషాయపార్టీ గెలుపొందిన ఎంపీల సంఖ్య 303 నుంచి ఇప్పుడు 240కి పడిపోయింది. స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన 272 మెజారిటీ మార్కు కంటే ఇది చాలా తక్కువ. అయితే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సీట్ల సంఖ్య 52 నుండి 99కి పెరిగి చక్కటి ప్రదర్శనను కనబర్చింది.

అయితే, దేశవ్యాప్తంగా 114 లోక్‌సభ నియోజక వర్గాల్లో (లోక్‌సభలోని మొత్తం 543 సీట్లలో ఇది 21 శాతం) పలువురు అభ్యర్థుల మధ్య గట్టి పోటీ జరిగింది. ఈ స్థానాల్లో గెలుపొందిన అభ్యర్థుల మెజారిటీ 50వేల కంటే తక్కువగా ఉన్నది. ఈ 114 సీట్లలో.. 56స్థానాలను ఇండియాబ్లాక్ గెలుచుకున్నది. ఎన్డీఏ 54సీట్లలో విజయం సాధించింది. పంజాబ్‌లోని భటిండాలో శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ)కు చెందిన హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ గెలుచుకున్నారు. మిగిలిన మూడు స్థానాలను స్వతంత్రులు పొందారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) వెల్లడించిన ఫలితాల విశ్లేషణలో ఇది స్పష్టమైంది. కాగా, జూన్ 4న జరిగిన ఓట్ల లెక్కింపును ప్రభావితం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించిందని బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ప్రతిపక్షనేతలు ఆరోపించిన విషయం విదితమే. అత్యంత హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల పోరులో 10,000 కంటే తక్కువ మార్జిన్‌తో ఇండియా బ్లాక్ 11 స్థానాలను గెలిచింది. ఎన్డీఏ తొమ్మిది సీట్లను స్వంతం చేసుకున్నది.

యూపీలోని 80 సీట్లలో.. ఎన్డీఏ 36 స్థానాలను గెలుచుకున్నది. ఇందులో బీజేపీకి దక్కినవి 33. మరోపక్క, ఇండియా బ్లాక్‌కు 43 స్థానాలు వచ్చాయి. అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) 37 విజయాలతో రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన ఈ రాష్ట్రంలోని 32 నియోజకవర్గాల్లో పోటీ ఉత్కంఠభరితంగా సాగింది. ఇక్కడ గెలిచిన, ఓడిన అభ్యర్థుల మధ్య ఓట్ల తేడా 50,000 కంటే తక్కువగా ఉంది. వీటిలో, ఎస్పీ 13, బీజేపీ 17, ఎన్డీఏ మిత్రపక్షాలు రెండు గెలుచుకున్నాయి. పదివేల ఓట్ల కంటే తక్కువ ఓట్ల తేడా ఉన్నవి ఆరు స్థానాలు ఉన్నాయి. వీటిలో హమీర్‌పూర్, సేలంపూర్, దౌరాహ్రా మూడు స్థానాలను ఎస్పీ గెలుచుకోగా, మిగిలిన



స్థానాలు ఫరూఖాబాద్, బన్స్‌గావ్, ఫుల్‌పూర్‌ను బీజేపీ కైవసం చేసుకున్నది. కాగా, జూన్4న ఫలితాల రోజున తమ అభ్యర్థుల విజయం కోసం బీజేపీ నేతృత్వంలోని యూపీ ప్రభుత్వంతో రాష్ట్ర పరిపాలన అధికారులు చేతులు కలిపినట్టు ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ఆరోపించిన విషయం విదితమే. ఫరూఖాబాద్‌లో ఎస్పీ అభ్యర్థి నావల్ కిషోర్ సఖ్యపై బీజేపీ అభ్యర్థి ముఖేష్ రాజ్‌పుత్ 2,678 ఓట్లతో గెలుపొందటం గమనార్హం.

బీజేపీ పాలిత రాజస్థాన్‌లోని జైపూర్ రూరల్ నియోజకవర్గంలో కాషాయపార్టీ అభ్యర్థి రావ్ రాజేంద్ర సింగ్ 1,615 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ చోప్రా ఓట్లను తిరిగి లెక్కించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ గోవింద్ సింగ్ దోటసార ఓట్ల లెక్కింపులో "టాంపరింగ్" జరిగిందని అనుమానించారు.

పలు రాష్ట్రాల్లోనూ 50,000 కంటే తక్కువ ఓట్ల తేడాతో అభ్యర్థులు గెలుపొందారు. ఎన్డీఏ దక్కించుకున్న 54 స్థానాల్లో 39 (72 శాతానికి పైగా) బీజేపీ, దాని మిత్రపక్షాలు పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో ఉన్నాయి. కేంద్రం పరిపాలనలో ఉన్న అండమాన్ అండ్ నికోబార్ దీవులలో కూడా గట్టి పోటీని ఎదుర్కొని చివరికి బీజేపీ గెలిచింది. కాగా, వీటిలో ఎన్డీఏకు అధికంగా 15 సీట్లు ఒక్క యూపీ నుంచే రావటం గమనార్హం.

50,000 కంటే తక్కువ మార్జిన్‌తో ఇండియా బ్లాక్ గెలుపొందిన 56 స్థానాల్లో 29.. ఎన్డీఏ అధికారంలో ఉన్న రాష్ట్రాల నుంచే ఉండటం గమనార్హం. ఇందులో ఎక్కువ శాతం యూపీ నుంచి 13 స్థానాలను ఎస్పీ గెలుచుకున్నది. ఇండియా బ్లాక్‌కు చెందిన మరో 25 మంది ఎంపీలు కాంగ్రెస్ లేదా దాని భాగస్వాములు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో విజయం సాధించారు. చండీగఢ్, లక్షద్వీప్ వంటి యూటీలలోనూ ఇండియా బ్లాక్ విజయం సాధించింది.

పదివేల కంటే తక్కువ మార్జిన్‌తో విజయాలు

దాదాపు 20స్థానాల్లో 10వేల లోపు ఓట్ల ఆధిక్యం నమోదైంది. వీటిలో కనీసం 11 స్థానాలను ఇండియా బ్లాక్ కైవసం చేసుకోగా, 9 ఎన్డీఏ గెలుచుకున్నది. ఈ 11 స్థానాల్లో ఐదింటినీ ఎన్డీఏ-పాలిత రాష్ట్రాల నుంచి స్వంతం చేసుకోగా.. కేంద్రపాలిత చండీగఢ్, లక్షద్వీప్ లలో రెండు స్థానాలను ఇండియా బ్లాక్ గెలుచుకున్నది. మిగిలిన స్థానాలు ఇండియా బ్లాక్ భాగస్వాములు పాలించే రాష్ట్రాల నుంచి ఉన్నాయి.

కేరళలోని అట్టింగల్‌లో కాంగ్రెస్ అత్యల్పంగా 684 ఓట్ల తేడాతో ఒక స్థానాన్ని గెలుచుకున్నది. చండీగఢ్‌లో 2,504, లక్షద్వీప్‌లో 2,647, పంజాబ్ ఫిరోజ్‌పూర్ 3,242, మహారాష్ట్ర ధూలే నుంచి 3,831, తమిళనాడులోని విరుదునగర్‌లో 4,379 ఓట్ల తేడాతో ఈ ఐదు లోక్‌సభ స్థానాలను హస్తం పార్టీ కైవసం చేసుకున్నది. యూపీలోని హమీర్ పూర్‌లో 2,629, సేలంపూర్‌లో 3,573, ధౌరాహ్రాలో 4,449 ఓట్ల ఆధిక్యతతో ఎస్పీ విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) 6,399 ఓట్ల ఆధిక్యంతో ఆ రాష్ట్రంలోని ఆరంబాగ్‌ను గెలుచుకున్నది. శరద్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) 6,553 ఓట్ల తేడాతో మహారాష్ట్రలోని బీడ్‌ను స్వంతం చేసుకున్నది.

ఎన్డీయేకు, పదివేల కంటే తక్కువ ఓట్ల తేడాతో గెలిచిన తొమ్మిది సీట్లలో ఐదు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే దక్కాయి. యూపీలోని ఫరూఖాబాద్‌లో బీజేపీ 2,678 ఓట్ల ఆధిక్యతతో, బన్స్‌గావ్‌లో 3,150, ఫుల్‌పూర్‌లో 4,332 ఓట్ల తేడాతో కాషాయపార్టీ విజయం సాధించింది. మహారాష్ట్రలోని ముంబై నార్త్ వెస్ట్‌లో బీజేపీ మిత్రపక్షం ఏక్‌నాథ్ షిండే శివసేన రికార్డు స్థాయిలో 48 వేల ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఒడిశాలోని జాజ్‌పూర్‌లో 1,587, రాజస్థాన్‌లోని జైపూర్ రూరల్‌లో 1,615, ఛత్తీస్‌గఢ్ లోని కాంకేర్‌లో 1,884, తెలంగాణలోని మహబూబ్ నగర్‌లో 4,500, పశ్చిమ బెంగాల్‌లోని బిష్ణుపూర్‌లో 5,567 ఓట్ల ఆధిక్యతతో బీజేపీ విజయం సాధించటం గమనార్హం.

మొన్నా మధ్య సుభాష్ చంద్రబోస్ మన దేశ ప్రథమ ప్రధాని అనీ తన అజ్ఞానాన్ని అందరికీ పంచేపని చేసింది. పోనీ సినీనటి కదా! అజ్ఞానాన్నీ క్షమించారు ప్రజలు. కానీ ఆమెలాంటి అనేకమంది ప్రజలు బతకటానికి మెతుకులు సృష్టిస్తున్న రైతన్నలపైన నోరు పారేసుకున్నది. గతంలో ఢిల్లీ వీధుల్లో తమ హక్కులకోసం పోరాటం చేస్తున్న కర్షకవీరుల ఆందోళనను ఉద్దేశించి ఆందోళన చేస్తున్న వాళ్లందరూ వందో, రెండువందలో డబ్బు తీసుకుని వచ్చిన వాళ్లేనని అంటే కిరాయి ఆందోళనగా అభివర్ణించింది. అంతేకాదు వాళ్లందరూ దేశద్రోహులని, ఉగ్రవాదులని కూడా నోరుపారేసుకుంది. ఆ ఆందోళనలో పాల్గొన్న తమ తల్లులను, తండ్రులను ఆ రకంగా అవమానకరంగా మాట్లాడటాన్ని ఎవరు ఓర్చుకుంటారు? చెంపచెల్లుమనిపించిన కానిస్టేబుల్ కుల్వీందర్‌కౌర్ గుండెల్లో దాగిన బాధ అలా వ్యక్త మయింది.

ధర్మాగ్రహం

కొద్దిగా ఆలస్యంగానైనా సరే ప్రజలు చాలా అద్భుతంగా, సరైన విధంగానే స్పందిస్తారు. ఎవరికి ఎప్పుడు ఏ రకంగా చురకలు పెట్టాలో, మళ్లీ పిచ్చి వేషాలేయకుండా ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉండేట్టు చేయటం జనానికి వందశాతం తెలుసు. అయితే గియితే ఆలస్యం జరిగిపోతుంటుంది అంతే! నిజంగా ప్రజలకు నిజాయితీగా అవగాహన కలిగించగలిగితే సమయంమించి పోకుండానే ప్రతిస్పందించ గలుగుతారు సాధారణ ప్రజలు. ఈ విషయాన్ని ఇటీవలి రెండు సంఘటనలు,



ప్రజల ప్రతిస్పందనలు రుజువు చేస్తున్నాయి. మొదటిది, రాజ్యాంగపు లౌకిక, ప్రజాస్వామిక విలువలను హేళన చేసి, అసలు రాజ్యాంగాన్నే మార్చేసి హిందూరాష్ట్రంగా ప్రకటిద్దామనుకున్న మోడీ పరివారానికి కర్రుకాల్చి వాత పెట్టారు. బీజేపీకి స్వతహాగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలాన్నే ఇవ్వలేదు. పదిమందిపై ఆధారపడేట్లు చేశారు. వీళ్లనుకున్నట్లు 400 సీట్లు జనమిస్తే ఇష్టారాజ్యంగా నియంతృత్వం చెలరేగేది. కానీ ఆ పప్పులు ఉడకనీయలేదు జనం. అసలు ఊసులోనే లేకుండా పోయేవారు. కానీ ఎక్కడో ఏదో తప్పిదం. అదలా ఉంచితే, రెండోది, మొన్న చండీగఢ్ విమానాశ్రయంలో సి.ఐ.ఎస్.ఎఫ్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ కొత్తగా ఎంపీగా ఎన్నికయిన సినీనటి కంగనారనౌత్ చెంపచెళ్లుమనిపించింది. సాధారణంగా పోలీసులు సామాన్యులను అకారణంగానే కొడతారని పేరు. కానీ ఈ సంఘటన చూస్తే భలే సరిగ్గా, అవసరంగా, న్యాయంగా కొట్టిందనిపిస్తోంది.

కంగనా రనౌత్ బాలీవుడ్ హీరోయిన్. అందరికీ తెలిసిన నాయికనే. ఈమె నటించడం చేస్తే ఎవరికేమి ఇబ్బంది లేదు. మోడీగారికి అత్యంత భక్తురాలు. ఆయన ఏదిచేసినా వందశాతం సరైనదేనని నిర్మోహమాటంగా వాదించేంత భక్తురాలు. అయినా మనకేమి ఇబ్బంది లేదు. ఇట్లాంటి వాళ్లు అనేకులున్నారు. మొన్నా మధ్య సుభాష్ చంద్రబోస్ మన దేశ ప్రథమ ప్రధాని అనీ తన అజ్ఞానాన్ని అందరికీ పంచేపని చేసింది. పోనీ సినీనటి కదా! అజ్ఞానాన్నీ క్షమించారు ప్రజలు. కానీ ఆమెలాంటి అనేకమంది ప్రజలు బతకటానికి మెతుకులు సృష్టిస్తున్న రైతన్నలపైన నోరు పారేసుకున్నది. గతంలో ఢిల్లీ వీధుల్లో తమ హక్కులకోసం పోరాటం చేస్తున్న కర్షకవీరుల ఆందోళనను ఉద్దేశించి ఆందోళన చేస్తున్న వాళ్లందరూ వందో, రెండువందలో డబ్బు తీసుకుని వచ్చిన వాళ్లేనని అంటే కిరాయి ఆందోళనగా అభివర్ణించింది. అంతేకాదు వాళ్లందరూ దేశద్రోహులని, ఉగ్రవాదులని కూడా నోరుపారేసుకుంది. ఆ ఆందోళనలో పాల్గొన్న తమ తల్లులను, తండ్రులను ఆ రకంగా అవమానకరంగా మాట్లాడటాన్ని ఎవరు ఓర్చుకుంటారు? చెంపచెల్లుమనిపించిన కానిస్టేబుల్ కుల్వీందర్‌కౌర్ గుండెల్లో దాగిన బాధ అలా వ్యక్త మయింది. అసలు సంఘటనలో విమానాశ్రయ నిబంధనలను పాటించక పోయిన కంగనాతో సంఘర్షణ పెరిగి చెంపదెబ్బకు దారితీసింది.

ప్రజల కోసం పనిచేసే ప్రజానాయకులు పార్టీలో కరువయినపుడు, జనాకర్షణగల సినిమా నటులను, హంగూ దర్పం ఉన్న అధికారులను, అధికంగా డబ్బున్న బడా బాబులను పార్టీలు ఎన్నికలకు దింపుతాయి. స్వతహాగా సినీరంగం నుంచి ప్రజారంగంలోకి వచ్చిన వాళ్లు వేరు. అట్లా వచ్చిన వారికి సమాజం పట్ల అవగాహన, కష్టాలు, దు:ఖాలు ఏమీ అర్థం కావు. జ్ఞానమూ అంతంత మాత్రమే. ఇప్పుడీమె హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీ తరపున ఎంపీగా పోటీ చేసి గెలిచారు కూడా. చెంపచెల్లుమన్న కంగనా పైఅధికారులకు ఫిర్యాదు చేసింది. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ కూడా ఆగమేఘాల మీద స్పందించారు. కుల్వీందర్‌కౌర్‌ను సస్పెండ్ కూడా చేశారు. మహిళా బాక్సర్లు బహి రంగంగా లైంగిక వేధింపుల గురించి ఫిర్యాదు చేస్తే ఏ ఒక్కరూ స్పందించలేదు. మరి మహిళా కమిషన్లు అప్పుడేమి చేశాయో! టెక్నికల్‌గా కానిస్టేబుల్ కొట్టడం తప్పని అంటున్నవాళ్లు, ట్రాక్టర్లు తోలి రైతుల్ని చంపిన వాళ్ల సంగతేమిటి? ఎవరు అడుగుతున్నరు! కుల్వీందర్ కౌర్ చేసింది నూటికి నూరుపాళ్లు న్యాయమైనదే! తన తల్లిదండ్రుల గౌరవం కోసం ఇలాంటి వంద ఉద్యోగాలయినా వదులుకుంటా అంటున్న కౌర్ ఆత్మాభిమానం గొప్పది. అశేష శ్రమజీవులను అవమానించిన దానికి ధర్మాగ్రహం ప్రతిచర్య ఇది. కౌర్‌కు మద్దతుగా నిలుద్దాం.

సంపాదకీయం

మూడో అవతారంలో మోడీ సర్కార్



తెలకపల్లి రవి

అత్యంత శక్తివంతుడైన మోడీ 3.0గా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని సాగిన ప్రచారం విఫలమై బలహీనపడిన మూడో అవతారంగా ఆదివారం అధికారం స్వీకరించడం ఆసక్తికర పరిణామం. దీనికి మరో విశేషణం కూడా జోడించవలసి వుంటుంది. మారిన పరిస్థితుల్లో ప్రధాని పదవిని అందుకోగల పోటీదార్లుగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టబోతున్న చంద్రబాబు నాయుడుకు అవకాశం లభించిందన్న ప్రచారం కూడా వీగిపోయింది. నితీశ్‌కు మేమెప్పుడూ అలాంటి ప్రతిపాదన ఇచ్చింది లేదని 'ఇండియా' నాయకులు ప్రకటించేశారు. ఇక చంద్రబాబు విషయానికొస్తే ఆయన అలాంటి ఆలోచనేది సూచనగానైనా చెప్పకపోగా నరేంద్రమోడీ నాయకత్వ పటిమను, దార్శనికతను ఆకాశానికెత్తి పొగిడారు. ఇంకా చెప్పాలంటే నితీశ్ మోడీకి పాదాభివందనం చేయబోగా పక్కనున్నవారు వారించాల్సి వచ్చింది. బీహార్‌లో ఎన్నికల ప్రచారం సమయంలో ఇలాగే నితీశ్ పాదాభివందనానికి విఫల యత్నం చేశారు. నితీశ్ లాంటి సీనియర్ నాయకుడు పదవి కోసం మోడీ కాళ్లు పట్టుకోవాలనుకోవడం బీహార్ ప్రజలకు మింగుడు పడటం లేదని మృత్యుంజయతివారి అనే సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు. చంద్రబాబు అయితే మోడీ నాయకత్వంలో తాము ఎన్డీయేగా పోటీ చేస్తున్నట్టు ఒకటికి రెండుసార్లు వారు సంయుక్త ప్రకటనలే చేశారు. మోడీని ఎన్నుకునే తరుణంలోనే చంద్రబాబు మాట్లాడుతూ గతంలో అనేకమంది నాయకులు దేశాన్ని పాలించినా మోడీ హయాంలోనే మన దేశం అంతర్జాతీయ ఖ్యాతిని పొందిందని ప్రశంసలతో ముంచెత్తారు.మోడీ అమిత్‌షాలతో సహా బీజేపీ కేంద్ర నాయకులు వచ్చి ఉమ్మడి ప్రచారంలో పాల్గొన్న కారణంగానే ప్రజల్లో కేంద్రం మనతో ఉందనే నమ్మకం కలిగిందని వ్యాఖ్యానించారు.ఇక జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మోడీ ఉంటే భారతదేశం ఎవరి ముందు తలవంచే పరిస్థితి రాదని ప్రత్యేకంగా కీర్తించారు. మొత్తంపైన బీజేపీ మనుగడకోసం మిత్రపక్షాలపై ఆధారపడుతుంది గనక తమ కోర్కెలపై ఒత్తిడి చేసే అవకాశం పెరుగుతుందని వ్యాఖ్యాతలు వేసిన అంచనాలు విఫలమై వారు మరింతగా మోడీ ఘనతనే ఆకాశానికి ఎత్తేందుకు సిద్ధమయ్యారు.

చెంపలేసుకుంటే మారిపోయినట్టేనా?

ప్రభుత్వం ఏర్పడుతున్న ప్రారంభఘట్టంలోనే ఇలా ఉంటే రేపు మోడీ కాస్త స్థిరపడ్డాక ఏం జరుగుతుందో ఊహించడం కష్టమేమీ కాదు. ఆ అసహనం, అహం మోడీ మాటల్లో తొంగి చూసింది. నిజానికి మోడీ నాయకుడిగా ఎన్నికైన సమయంలో వ్యవహరించిన తీరే ఆయన ఎలాంటి పాఠం నేర్చుకున్నారో తెలియజెప్పింది. రకరకాల వాక్య విన్యాసాలతో చప్పట్లు కొట్టించుకునే మోడీ ముందుగా రాజ్యాంగం దగ్గరకు వెళ్లి కళ్లకద్దుకున్నారు. తను , హోంమంత్రి అమిత్‌షా మాట్లాడిన తీరు వల్ల, కొందరు నేతల వాచాలత వల్ల బీజేపీ గెలుపు రాజ్యాంగానికి ముప్పు అని ప్రజలకు అర్థమైనందునే ఆమడదూరంలో ఆపేశారని మోడీకి అర్థమైంది. అందుకే దాన్ని కాపాడతానని చెప్పడానికి ఈ ప్రహసనం తలపెట్టారన్నమాట. మాట్లాడితే ప్రతిదీ మార్చేయాలనీ, తీసేయాలని చెప్పేవారు ఉన్న రాజ్యాంగాన్ని ఏదో గౌరవిస్తున్నట్టు చెప్పుకోవడం అందుకోసమే. అయితే ఇప్పుడు పదవీ స్వీకారం కోసం ఏం చెప్పినా రేపు వాస్తవంగా ఏం జరిగేది ప్రజలకు తెలుసుగనకే అంలాటి తీర్పునిచ్చారు. బీజేపీ మొదట్లో చేసిన హడావుడితో పోలిస్తే ప్రస్తుత పరాధీనత తీవ్రమైన కుదుపులాంటిదే. కానీ అదేదో చిన్న విషయమైనట్టు మోడీ తన ప్రసంగంలో ఎన్డీయే తిరిగి వచ్చేసిందని గొప్పలు పోయారు. 30 ఏండ్లుగా ఎన్డీయే అత్యంత విజయవంతగమైన కూటమిగా పురోగమిస్తున్నదంటూ తన పదేండ్ల నిర్వాకాలను కప్పిపుచ్చే పాచిక వేశారు. ఎందుకంటే గతరెండు సార్లు పేరుకు ఎన్డీయే ప్రభుత్వాలైనా



బీజేపీకి కూడా పెద్ద మాట లేకుండా కేవలం మోడీ ఏకవ్యక్తి ప్రాబల్యమే నడిచిన తీరు ఎవరు మర్చిపోతారు? వారు చాలా అపహాస్యం చేసిన ఇండియా వేదిక వాస్తవ రూపం దాలుస్తుంటే ఉలిక్కిపడి అప్పుడే మళ్లీ ఫొటో సెషన్ లాంటి ఎన్డీయే భేటీ నాటకం నడిపారు.అలాంటి మోడీ ఇప్పుడు ఫలితాల తర్వాత సర్వపంథ్ సమభావ్ అంటూ అన్ని పార్టీలనూ సమానంగా చూస్తామనే పాట ఎత్తుకున్నారు. వాస్తవానికి లౌకిక తత్వాన్ని సర్వధర్మ సమభావ్ అంటూ అన్ని మతాలకు ప్రోత్సాహంగా మార్చింది పాలకులే. మెజారిటీ మతభావాలను సంతృప్తిపరుస్తూ మైనార్టీలను అభద్రతలోకి నెట్టింది ఈ పోకడలే. దాన్నే ఇప్పుడు భాగస్వామ్య పార్టీలకు అన్వయించి సర్వపంథ్ సమభావ్ అంటున్నారన్నమాట.

ఎన్టీఆర్,చంద్రబాబు భిన్న వైఖరులు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కన్నా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఈ విషయంలో మరింత సూటిగా మాట్లాడారు. తాము ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్ కొనసాగిస్తామన్నారు. అదే సమయంలో మైనార్టీలకు సహాయపడటం తప్ప బుజ్జగింపు తమ వైఖరి కాదంటూ బీజేపీ తరహా వాదన చేశారు. జాతీయ ప్రాంతీయ ఆకాంక్షల మధ్య సమతుల్యత ఉండాలని ఆయన అనడం ఏపీ ప్రత్యేక సమస్యల పరోక్ష ప్రస్తావనేనని కొందరు వ్యాఖ్యానించారు గానీ వాస్తవానికి ఇంతవరకూ చంద్రబాబు నుంచి తమకు ఎలాంటి షరతుల సమస్యలు ఎదురవలేదని బీజేపీ వర్గాలు చెబుతూనే ఉన్నాయి. మంత్రి పదవుల విషయంలోనూ ఏడు పదవులు, స్పీకర్ స్థానం వంటి మాటలు గతంలో వినిపించగా ఇప్పుడు రెండు మూడు పదవులు,డిప్యూటీ స్పీకర్ అంటున్నారు. నితీశ్ కుమార్‌గానీ, చంద్రబాబు నాయుడు గానీ ఏకంగా ప్రధాని పదవి చేపట్టే అవకాశాలున్నాయనే ఊహాగానాలు కూడా నడిచాయి. 1996లో యునైటెడ్ ఫ్రంట్ కాలంలో ఆయన్ను ఈ పదవి చేపట్టవలసిందిగా కోరిన ఉదాహరణ గుర్తు చేస్తున్నారు. వాస్తవం ఏమంటే ఆ సమయంలో సీపీఐ(ఎం) నాయకుడు హరికిషన్ సింగ్ సూర్జిత్ లౌకిక పార్టీల ఐక్యతలో కీలక భూమిక పోషించేవారు. చంద్రబాబును ప్రోత్సహించిందీ యుఎఫ్ కన్వీనర్‌గా చేసిందీ ప్రధానంగా సూర్జిత్ చొరవే.ఆ బాధ్యతలో ఉంటూనే ఎన్డీయే వైపు వెళ్లిన రాజకీయం చంద్రబాబుదే. చక్రం తిప్పడం అనే పొగడ్తల వెనక ఈ సత్యాన్ని చాలామంది తరచూ మర్చిపోతుంటారు. ప్రాంతీయ పార్టీ అయినా తమ నాయకుడు ఎన్టీఆర్ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర వహించారని కూడా తరచూ చెబుతుంటారు. వాస్తవం ఏమంటే ఎన్టీఆర్ లౌకిక పార్టీల కూటమిగా నేషనల్ ఫ్రంట్‌కు మాత్రమే చైర్మన్‌గా ఉన్నారు. ఆ ఫ్రంట్ ప్రభుత్వాన్ని బీజేపీ రథయాత్రతో కూల్చివేసిన తర్వాత ఎన్టీఆర్ ఎన్నడూ మళ్లీ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోలేదు.1994లో టీడీపీ ఉమ్మడి రాష్ట్రంలో అసాధారణ విజయం సాధించినప్పుడు ఆయన కమ్యూనిస్టులతో మాత్రమే కలసి పోటీచేశారు. వీటన్నిటి సారాంశం ఒక్కటే. బీజేపీ మిత్రుల పట్ల పెద్ద విశ్వాసంగా ఉండదు.గతంలో దానితో కలసి పనిచేసిన పార్టీలన్నీ టీడీపీతో సహా మోసపోయిన చరిత్రే దీనికి నిదర్శనం.

1996లో యునైటెడ్ ఫ్రంట్ కాలంలో ఆయన్ను ఈ పదవి చేపట్టవలసిందిగా కోరిన ఉదాహరణ గుర్తు చేస్తున్నారు. వాస్తవం ఏమంటే ఆ సమయంలో సీపీఐ(ఎం) నాయకుడు హరికిషన్ సింగ్ సూర్జిత్ లౌకిక పార్టీల ఐక్యతలో కీలక భూమిక పోషించేవారు. చంద్రబాబును ప్రోత్సహించిందీ యుఎఫ్ కన్వీనర్‌గా చేసిందీ ప్రధానంగా సూర్జిత్ చొరవే.ఆ బాధ్యతలో ఉంటూనే ఎన్డీయే వైపు వెళ్లిన రాజకీయం చంద్రబాబుదే. చక్రం తిప్పడం అనే పొగడ్తల వెనక ఈ సత్యాన్ని చాలామంది తరచూ మర్చిపోతుంటారు. ప్రాంతీయ పార్టీ అయినా తమ నాయకుడు ఎన్టీఆర్ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర వహించారని కూడా తరచూ చెబుతుంటారు. వాస్తవం ఏమంటే ఎన్టీఆర్ లౌకిక పార్టీల కూటమిగా నేషనల్ ఫ్రంట్‌కు మాత్రమే చైర్మన్‌గా ఉన్నారు. ఆ ఫ్రంట్ ప్రభుత్వాన్ని బీజేపీ రథయాత్రతో కూల్చివేసిన తర్వాత ఎన్టీఆర్ ఎన్నడూ మళ్లీ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోలేదు.

అవసరార్థం కలయిక అంటే అర్థం చేసుకోవచ్చుగానీ దానివల్ల మోడీ స్వభావం మారిపోతుందని, వాళ్ల అడిగినవి చేసి ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేరుస్తారని నమ్మడం నిరాధారం.

మోడీ ప్రసంగమే నిదర్శనం

రాజ్యాంగాన్ని కళ్లకు అద్దుకోవడం వంటి నాటకీయ చర్యలను పక్కనపెడితే మోడీ ఈ సభలోనూ, రాష్ట్రపతిని కలిసి ఆహ్వానం అందుకున్న తర్వాత మాట్లాడిన తీరే ఆయనలో మార్పు లేదని చెబుతుంది. సర్వపంథ్ సమభావ్ అన్న ప్రధానమంత్రి ఇండియా వేదికను విధ్వంసక శక్తిగా తిట్టిపోశారు. ఎన్డీయే అఖండ విజయం అందుకుందని చెప్పుకుంటూ అనేక రాష్ట్రాలను పాలిస్తున్న ఇండియా పార్టీలు ప్రజల మద్దతుతో గణనీయంగా బలం పెంచుకున్నాయనే సత్యాన్ని కాస్త కూడా ఆమోదించలేక పోవడం ఆయన అసహనాన్ని వెల్లడించింది. మరో వంక ఒరిస్సాలో విజయం ఘనమైనట్టు ఉత్తరప్రదేశ్‌లో ఎదురుదెబ్బ లెక్కలోది కానట్టు చిత్రించి సంతోషించారు. నాయకులను బలోపేతం చేస్తారని ఎవరైనా ఎలా నమ్మగలరు? కాంగ్రెస్ వంద స్థానాలకు చేరిన వాస్తవాన్ని కూడా హరాయించుకోలేని మోడీ ఆ పార్టీకి మూడు ఎన్నికల్లో కలిపినా తమకు ఈ ఒక్కసారి వచ్చినన్ని సీట్లు రాలేదని ఎద్దేవా చేయడం ప్రధానికి తగిన పనేనా? చంద్రబాబు,నితీశ్ కుమార్ రాష్ట్రాలకు సహాయంపై ప్రత్యేకంగా ప్రస్తావనలు చేసినా మోడీ మాత్రం ఆ ముచ్చటే పెట్టుకోకపోవడం యాదృచ్ఛికం కాదు. ఇక ముస్లింలు, దళితులలో సృష్టించిన సందేహాలను తొలగించడం అవసరమనీ ఆయన అనుకోలేదు. ఎందుకంటే వాటిని కొనసాగించాలన్నదే బీజేపీ ఆరెస్సెస్‌ల వ్యూహం.దేశానికి బాగా ఉపయోగపడే నిర్ణయాలు చేస్తాము, మరింత కఠినంగా వేగంగా పనిచేస్తామంటూ శ్లేష ప్రయోగించారు.ఈ ఎన్నికల ఫలితాలకు ముందే వచ్చే పదవీ కాలంలో చేయవలసిన పనులు చర్చించి ప్రచారంలో పెట్టిన మోడీ ఈ సభలోనూ తాము పదేండ్లు పాలన చేస్తామన్నారు. అయిదేండ్లకు ఎన్నికైన సర్కారు పదేండ్ల గురించి చెప్పడమేంటి?అంటే ఇందులోని అతితెలివిని గమనించాలి. పూర్తి మెజారిటీ లేని మోడీని ఎవరోఒకరు ఎప్పుడైనా కూలదోయవచ్చునని కథలు వచ్చాయి గనక ఏకంగా తమ పాలనా కాలాన్ని రెట్టింపు చేసి చెప్పేస్తున్నారన్నమాట. ప్రచారక్ ప్రధానమంత్రి(పిపిఎం) మోడీకి బాగా ఆలవాటైన వాగాడంబరం ఇదే.

జాగ్‌తేరహో!

ప్రభుత్వ రంగంపైన లేదా ఉద్యోగ వర్గాల రైతాంగ ఉద్యమాల కోర్కెలను నెరవేర్చే ప్రయత్నం చేస్తామని ఒక్క మాట కూడా అన్న దాఖలాలు లేవు.నిర్దిష్టంగా ఏ తరగతికి గానీ, రాష్ట్రాలకు గానీ ఎలాంటి మాట ఇవ్వకుండా ఊకదంపుడుతో సరిపెట్టే వచోవిన్యాసం మోడీ స్వంతం. ఆయినా ఆయన వత్తాసుదార్లు మాత్రం దానికే పరవశించమని చెబుతుంటారు. ఈ ఎన్నికల తీర్పు ప్రధానంగా సమాఖ్యతత్వానికి ఆర్థిక వనరుల బదలాయింపునకూ ప్రజలు ఇచ్చిన సందేశమని నిపుణులు అంటుంటే ప్రధాని ఆ మాటే చెవికెక్కించుకోలేదు. మరోవైపున 'నేను, బాబు,నితీశ్ అందరం సుపరిపాలన(గుడ్ గవర్నెన్స్‌కు) ప్రతినిధులమని' చెప్పుకున్నారు. ఎవరైనా సరే నిధులు లేకుండా ఎలా సుపరిపాలన చేయగలరు? ఏపీలాంటి విభజిత రాష్ట్రం అప్పుల నుంచి ఎలా బయటకురాగలదు? ఏపీతో సహా చాలా రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడం గురించి వింటుంటాం గానీ మోడీజీ పాలిస్తున్న కేంద్రమే దాదాపు రూ.2కోట్ల కోట్ల అప్పులో దిగబడిపోయిందనే నిజానికి సమాధానమేదీ? ఇలాంటి కఠిన ప్రశ్నలేవీ వేయకుండా విశ్వగురు, దార్శనికుడు అంటూ ఆయన్ను పొగిడి పరవశించడమే కర్తవ్యం. దీనంతటికీ పరాకాష్ట ప్రమాణస్వీకారం సన్నివేశంలో చూడొచ్చు. ఏమైనా బీజేపీ ఏకచ్ఛత్రాధి పత్యంతో మోడీ ఏకపక్ష పాలన ఘట్టం ముగిసింది. కానీ కేంద్ర నిరంకుశత్వ మతతత్వ ప్రమాదం మిగిలే ఉంది. రకరకాల అవకాశవాదాల మధ్య, అననుకూలతల మధ్య లౌకిక శక్తులు దాన్ని అడ్డుకోవలసిన బాధ్యత మరింత పెరుగుతున్నది. కాగాపోగా మోడీ బలహీనపడిన కారణంగా కార్పొరేట్ ఒత్తిళ్లు, ఈ సర్కారు లొంగుబాట్లు ఇంకా పెరగొచ్చు కూడా. వాటన్నిటికీ మూల్యం చెల్లించవలసిన వారు ప్రజలే. మోడియా ప్రచారార్భాటాలకు లోబడిపోకుండా వాటిపట్ల అప్రమత్తత పెంచుకుందాం. ■

'నేను, బాబు,నితీశ్ అందరం సుపరిపాలన (గుడ్ గవర్నెన్స్‌కు) ప్రతినిధులమని' చెప్పుకున్నారు. ఎవరైనా సరే నిధులు లేకుండా ఎలా సుపరిపాలన చేయగలరు? ఏపీలాంటి విభజిత రాష్ట్రం అప్పుల నుంచి ఎలా బయటకురాగలదు? ఏపీతో సహా చాలా రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడం గురించి వింటుంటాం గానీ మోడీజీ పాలిస్తున్న కేంద్రమే దాదాపు రూ.2కోట్ల కోట్ల అప్పులో దిగబడిపోయిందనే నిజానికి సమాధానమేదీ?ఇలాంటి కఠిన ప్రశ్నలేవీ వేయకుండా విశ్వగురు, దార్శనికుడు అంటూ ఆయన్ను పొగిడి పరవశించడమే కర్తవ్యం. దీనంతటికీ పరాకాష్ట ప్రమాణస్వీకారం సన్నివేశంలో చూడొచ్చు. ఏమైనా బీజేపీ ఏకచ్ఛత్రాధిపత్యంతో మోడీ ఏకపక్ష పాలన ఘట్టం ముగిసింది. కానీ కేంద్ర నిరంకుశత్వ మతతత్వ ప్రమాదం మిగిలే ఉంది. రకరకాల అవకాశవాదాల మధ్య, అననుకూలతల మధ్య లౌకిక శక్తులు దాన్ని అడ్డుకోవలసిన బాధ్యత మరింత పెరుగుతున్నది.

కింద పడ్డ నేనే గొప్ప!

కింద పడి ఎవరూ చూడకుండా టక్కన లేచి ఏమీ ఎరగనట్టు ప్రవర్తిస్తుంటాం. ఇది సాధారణంగా ప్రతి మనిషి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు జరుగుతూనే ఉంటుంది. కొంతమంది కింద పడ్డ నేనే గొప్ప అన్నంతగా ఫీలౌతుంటారు. ఈ విషయం కచ్చితంగా కమలనాథులకు వర్తిస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దెబ్బతిన్నా... తామే గొప్ప అన్నట్టు మాట్లాడుతున్నారు. ఈ అంశాన్ని వాట్సాప్ యూనివర్సిటీ భుజాన మోస్తున్నది. బీజేపీకి 400 సీట్లు వస్తాయంటూ మోడీ డాంభికాలు పలికారు. కానీ 240 సీట్లకు మాత్రమే పరిమితమైంది. ఇన్ని సీట్లు వచ్చినా బీజేపీ సంబరాలు చేసుకోవట్లేదట. కానీ 99 సీట్లు వచ్చిన కాంగ్రెస్ మాత్రం సంబురాలు చేసుకుంటుందని ఏడుస్తుంది.ఆ పార్టీకి సిగ్గూ లేదని దెప్పిపొడుస్తున్నది. అసలు విషయాలను మరుగుపరిచి పక్కోడి మీద పడి ఏడవడమే దాని పని. దేవుడు కరుణించలేని విధంగా అయోధ్యలో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయినా, ఆ విషయం మాత్రం సోషల్‌మీడియా సెలబస్‌లో ఉండదు. మోడీకి భారీగా మెజార్టీ తగ్గడంతో ఆయనపై ఆరెస్సెస్ గుర్రుగా ఉన్నా... అది కూడా వారి ట్రోలింగ్‌లో కనిపించదు. ప్రఖ్యాత రామ మందిరం ఉన్న అయోధ్య, భద్రాచలం, రామేశ్వరం, కొప్పల్, నాసిక్, చిత్రకోట వంటి ప్రాంతల్లో సైతం కమలం దెబ్బతిన్నది. అయినా పొద్దున లేస్తే సోషల్ మీడియాలో మాత్రం మోడీ భజన ఆపడం లేదు. దటీజ్ వాట్సాప్ యూనివర్సిటీ!

- గుడిగ రఘు

దిమ్మతిరిగే..

తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బలం పెరిగిందంటూ ఆపార్టీ నేతలు ఖుషీ అవుతున్నరు. అయితే ఎటొచ్చి అది బలుపు కాదు వాపు అని అంటున్నరాయే రాజకీయ విశ్లేషకులు. సొంత ఓట్లతో గెలిస్తే అది బలుపు అంటరు తప్ప, బీఆర్ఎస్ ఓట్లేపించుకుని సీట్లు కొడితే ఎట్ల అంటరు అంటూ జర్రంత ఆశ్చర్యపోతున్నరు. ఇక్కడ రెట్టింపు సీట్లతో ఆనందంలో ఉన్న కమలదళానికి, నార్త్‌లో దిమ్మతిరిగి కండ్లుబైర్లు కమ్మినాయే. మోడీ ఆశలు పెట్టుకున్న యోగీ రాష్ట్రంలో స్థానిక ఓటర్లు తోక కట్‌చేశారాయే. అంతేగాదుల్లో..అయోధ్య రామయ్య ఉన్న ఫైజాబాద్‌లో బీజేపీ ఓడిపాయే. కేంద్రంలో మోడీకి మెజారిటీ రాకపాయే. చంద్రబాబు, నితీష్‌కు సలామ్ కొట్టాల్సిన పనొచ్చే. ఇక ఒళ్లు దగ్గరపెట్టుకోవాల్సిన తరుణం ముందుకొచ్చిందంటూ ఆపార్టీ నేతల్లో గుసగుస ఇనిపియ్యబట్టే. అయినా నాకెందుకులే గీ తంటా. ఉంట మరీ.

- బి.బసవపున్నయ్య

పరుగు పందెం

ఈ మధ్య వీకఆఫ్ రోజు ఊరెళ్లినప్పుడు కరీంనగర్ బస్టాండ్‌లో చిన్ననాటి మిత్రుడొకరు కలిశాడు. పిచ్చాపాటి తర్వాత 'ఎక్కడికి రా' అని అడిగితే హైదరాబాదని చెప్పాడు. వాడితో పాటు వాళ్లావిడ, వాళ్లబ్బాయి, వాళ్లత్తగారు కూడా ఉన్నారు. ఆరా తీస్తే... వాడి చిన్న కొడుకుది పదోతరగతి అయిపోయింది. 9.5 జీపీ వచ్చింది. వాన్ని ఇంటర్‌లో జాయిన్ చేసేందుకు పట్నం బాట పట్టారు. మనసు చంపుకోలేక అడిగా. 'ఏరా కరీంనగర్‌లో మంచి కాలేజీలున్నాయంటారు కదా, మరి అంత దూరమెందుకురా' అంటే నీళ్ల నమిలాడు... 'గట్టిగా మాట్లాడకురా మా ఆవిడ వింటే మూడో ప్రపంచ యుద్ధం ఇప్పుడే మొదలవుద్ది' అని పక్కకు తీసుకుపోయాడు. మా కుటుంబంలో ఇప్పటి వరకు ఎవరూ డాక్టర్ కాలేదు. చిన్నోడినన్న డాక్టర్ చేయాలని మా ఆవిడ కోరిక. వద్దు ఖర్చులు భరించడం మనతో కాదన్నా... అయినా ఎవరూ వినలేదు. అందరూ వాడి పార్టే... చివరికి తప్పలేదు అని నిట్టూర్చాడు. గత వారం వచ్చి కాలేజీ గురించి అన్ని విషయాలు తెలుసుకున్నాం. హాస్టల్ ఫీజుతో కలిపి ఏడాదికి రెండున్నర లక్షలు అవు తాయట అని చెప్పాడు. 'అన్ని డబ్బులు పెట్టి చదివి పిస్తున్నావు. గవర్నమెంట్ సీట్ రాకుంటే ఎలా? ఇదేం ఇంజినీరింగ్ కాదుగదరా' అని సందేహం వెలిబుచ్చా. 'దానికి సిద్ధమయ్యాం... సర్కార్ కోటాలో సీట్ రాకుంటే కరీంనగర్‌లో ఓ ఇల్లుంది. అమ్మేసీ మేనేజ్‌మెంట్ కోటాలోనైనా సరే డాక్టర్‌ను చేయాలని డిసైడయ్యాం. తప్పదు గదరా.. మనం సంపాదించింది వాళ్లకోసం కాక మరెవరికి' అని చిన్నగా నవ్వాడు. ఇంతలో వాడి బస్సు బయలుదేరేందుకు సిద్ధమవడంతో వెళ్లి సీట్లో కూర్చున్నాడు. అత్యంత వేగంగా పరుగెడుతున్న నేటి ఆధునిక సమాజంలో...తమలా కాకుండా తమ వారసులను అత్యున్నత శిఖరాలకు అధిరోహింప జేయడానికి ఎన్ని కష్టాలయినా, ఎన్ని నష్టాలయినా భరించాల్సిందే అనే పట్టుదల వాడి ముఖంలో కనిపించింది. నాకనిపించిందప్పుడు... ప్రస్తుతం కార్పొరేట్ చదువుల పరుగుపందెం నడుస్తున్నది... ఆస్తులు అమ్మైనా సరే వాళ్లతో జతకట్టాల్సిందే... లేకుంటే వెనకబడిపోతామనే భయం పేద, మధ్యతరగతిని సైతం కార్పొరేట్ వైపు పరుగులు పెట్టిస్తోంది.

- ఊరగొండ మల్లేశం

భక్తాగ్రేసరుడు!



రాముడు, సీత ఉద్యానవనంలో మాట్లాడుకుంటూ విహరిస్తున్నారు. కొద్దిదూరంలో లక్ష్మణుడు కూడా ఉన్నాడు. ఉద్యానవనం ద్వారం వద్ద అలికిడై లక్ష్మణుడు అటువెళ్లాడు. అక్కడ నారదుడితో భటులు గొడవ పడుతున్నారు.

లక్ష్మణుడు భటులకు సర్దిచెప్పి నారదుడిని లోపలికి ఆహ్వానించాడు.నారదుడిని చూసి సీతా,రాములు నమస్కరించి ఉచితాసనాన్ని చూపారు.

"స్వామీ మీరు, నేను కలుసుకున్న సందర్భాలు నాకు గుర్తుకు లేవు. కానీ ఇప్పుడు మీరు ఇక్కడికి వేంచేయడం నాకు చాలా సంతోషకరం! మీరు విచ్చేసిన కారణమేమిటో సెలవియ్యండి!" అన్నాడు రాముడు.

నారదుడు మాట్లాడలేదు! పైగా అటు తిరిగి కూర్చున్నాడు.

సీతా, రామ,లక్ష్మణులు ఆశ్చర్యపోయారు.నారదుడు ఎందుకు అలా చేస్తున్నాడో వారికి అర్థం కాలేదు.

స్వామీ! మీకై మీరే విచ్చేశారు! కారణమేమిటో ఇప్పటికైనా సెలవియ్యండి! ఆచరించటానికి రాముడు సదా సిద్ధంగా ఉన్నాడు' అన్నాడు రాముడు వినయంగా.

అయినా నారదుడు మాట్లాడలేదు.

లక్ష్మణుడికి కోపం వచ్చింది. ఆవేశంగా నారదుడి వైపు రాబోయాడు, రాముడి సైగతో ఆగిపోయాడు.

"మునీంద్రా! ఇక్కడికి వచ్చి ఏమీ మాట్లాడకుండా కూర్చుంటే నా మనసు ఆందోళనకు గురి అవుతున్నది. ఎవరికి ఏం ఆపద వచ్చిందో చెప్పు నారదా!" అన్నది సీత.

"శ్రీరాముడు సాక్షాత్తు మహావిష్ణువు అవతారం! నీవేమో మహాలక్ష్మి అవతారానివి! కాని తన భక్తుడిని పట్టించుకోని నిర్లక్ష్యంతో వ్యవహరించటం ఎంతో అన్యాయం!" అన్నాడు నారదుడు.

"మేము భక్తుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించటం అసంభవం! మునీంద్రా మీరు పొరబడ్డారు!" అన్నాడు రాముడు.

"నరేంద్రమోడీ పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మీ భక్తాగ్రేసరుడు రామదాసుని మించిన వాడు!" అన్నాడు నారదుడు.

"మోడీ రామదాసుని మించిన వాడెలా అవుతాడు స్వామీ!" అన్నాడు లక్ష్మణుడు అసహనంగా.

"రామదాసు అంతకు ముందున్న గుడిని అభివృద్ధి చేశాడు! ఆభరణాలు చేయించాడు! కాని మోడీ ప్రపంచంలో అత్యంత గొప్ప గుడిని అయోధ్యలో నిర్మించాడు. రాముడికి ప్రపంచఖ్యాతిని కలిగించాడు! అటువంటి మోడీకి అవమానాల పాలు చేశారు!" అన్నాడు నారదుడు.

"మునీంద్రా! ఇంతకూ మీ ఉద్దేశ్యమేమీ! మోడీ లేకపోతే రాముడెవరో ప్రపంచానికి తెలియదా! అయినా మోడీకి జరిగిన అవమానమేమి? దానికి రాముడెలా కారణమవుతాడు!" అన్నాడు లక్ష్మణుడు కోపంగా.

"మొన్న జరిగిన ఎన్నికల్లో మోడీకి చావు తప్పి కన్నులొట్టపోయింది! అయోధ్యలో మోడీ పార్టీ ఓడిపోయింది! మిత్రుల మద్దతు లేకుండా అధికారంలో కొనసాగలేని దుస్థితి ఏర్పడింది! ప్రపంచంలోనే అత్యంత బలమైన నాయకుడిగా పేరుగాంచి, చివరకు దేశంలోనే బలహీనమైన ప్రధానిగా మారిపోయాడు!" అన్నాడు నారదుడు.

రాముడు చిన్నగా నవ్వాడు.

"మునీంద్రా! నేను పరిపాలన చేసింది త్రేతాయుగంలో. మోడీ కలియుగంలో పరిపాలన చేస్తున్నాడు. నేను ఆనాటి యుగధర్మాన్ని నిక్కచ్చిగా పాటించాను. మోడీ కలియుగధర్మం అంటే ప్రజాస్వామ్యాన్ని పాటించాలి. ప్రజాస్వామ్యం అంటే అధిక సంఖ్యాకుల మనోగతం. ఒక్క రజకుడు అన్న మాటకు, నా అర్ధాంగి తప్పేమీ లేదని తెలిసినా ఆమెను అడవుల పాలు చేశాను. కాని ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో అధిక సంఖ్యాకులైన ప్రజల మనోగతాన్ని ఒక్కటైనా మోడీ అమలు చేయలేదు! పైగా వారందరినీ నిరంకుశంగా అణిచివేశాడు. ఇదేనా రాజు లక్షణం! స్వంత ప్రజలనే అణిచివేసేవాడు రాజెలా అవుతాడు. రావణాసురుడు సైతం తన ప్రజలను ఎంతో ప్రేమగా చూసుకున్నాడు! రావణుడే కాదు. కృత, త్రేత, ద్వాపర యుగాలల్లో ఒక్క రాక్షసరాజు కూడా తన స్వంత ప్రజలను పీడించలేదు! కానీ మోడీ అందరు ప్రజలను, ముఖ్యంగా కష్టజీవులను విపరీతంగా పీడించాడు!" అన్నాడు రాముడు.

"నీకు గుడి కట్టించాడు కదా!" అన్నాడు నారదుడు.

"నాకు గుడి కట్టమని ఎవరి కలలోకి వచ్చి కోరలేదు! నాకు గుళ్లు, గోపురాలు అవసరం లేదు! నా భక్తుల గుండెల కన్నా గొప్ప గుడి ఏదీ ఉండదు! ప్రజల మధ్య విద్వేషాలు, విభేదాలు రెచ్చగొట్టి కట్టించే గుళ్లనాకు అవసరం లేదు! ఈ విషయం అయోధ్యవాసులకు కూడా తెలుసు! అందుకే అయోధ్యలో బీజేపీని ఓడించారు!" అన్నాడు రాముడు.

"నీ తర్వాత నీ అంతటి పరిపాలకుడని భారతదేశం రామ రాజ్యమైందని, హిందూ మత రక్షకుడని మోడీని కీర్తిస్తున్నారు కదా!" అన్నాడు నారదుడు.

"మునీంద్రా.. స్పృహలో ఉండి మాట్లాడుతున్నారా! రఘురాముడిని మించిన పరిపాలకుడా! ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకున్న రాముడెక్కడ? కరోనా వేలాది అనాథ శవాలు తన నియోజకవర్గం లోనే గంగానదిలో తేలియాడుతుంటే పట్టించుకోని మోడీ ఎక్కడ? ఇవన్నీ ప్రజలు గమనించారు కనకే! మోడీని హద్దులలో పెట్టారు!" అన్నాడు లక్ష్మణుడు.

"ఏదేమైనా! అందరిలా సాధారణ జన్మ ఎత్తని వాడు, దేవుడే పంపిన దేవదూతకి, మాటమీద నిలబడే మనిషికి ఇలాంటి దుస్థితి రావటానికి రాముడే కారణం!" అన్నాడు నారదుడు.

ఈ సారి లక్ష్మణుడు పెద్దగా నవ్వాడు.

"మునీంద్రా! మీరు ఎన్నికల పర్యటనలు బాగా చేసినట్లున్నారు! పెద్దనోట్ల రద్దు విఫలమైతే ఉరితీయమని చెప్పినవాడు, అబద్ధాలు చెబితే ఉరితీయమని చెప్పినవాడు ఈ పెద్దమనిషే! భారతదేశంలో అతిపెద్ద విఫల నిర్ణయ మని ప్రపంచమంతా కోడై కూసింది! కాని ఉరికి సిద్ధం కాలేదు! నల్లధనం తెచ్చి భారత ప్రజలందరికి పదిహేను లక్షల రూపాయల చొప్పున పంచుతానని చెప్పి అమలు చేయలేదు! అయినా ఉరి తీయలేదు! ఇతనేనా మాట మీద నిలబడే మనిషి! ఒకరోజు మహ్మదీయులను తిట్టి, మరుసటి రోజే నేనామాట అనలేదని దబాయించగల ఘనాపాటి! ఏ రోటి వద్ద ఆ పాట గల అవకాశవాది అని ప్రజలు గుర్తించారు! అందుకే గతంలో ఉన్న బలాన్ని కత్తిరించారు"! అన్నాడు లక్ష్మణుడు.

"అయినా, మోడీ మళ్లీ ప్రధాని అయ్యాడు కదా!" అన్నాడు నారదుడు.

"మళ్లీ ప్రధాని అయ్యే మాట నిజమే! ఇంకా కొందరు ప్రజలు హిందూ మత ఉద్ధరణ, అనే మాయలో పడిపోయి ఉన్నారు! వారందరూ వాస్తవాలు తెలుసుకునే రోజు దగ్గర్లోనే ఉంది! భారతదేశంలో ఇప్పుడు దశాబ్దకాలంలో ప్రజాస్వామ్యంలోకి పున:ప్రవేశించింది! పూర్తి ప్రజాస్వామ్యం పరిఢవిల్లేరోజు త్వరలోనే ఉంది!" అన్నాడు లక్ష్మణుడు.

నజర్

- ఉషాకిరణ్

పది దాటితే నో ఎంట్రీ

- నేటి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లాలో 52 సెంటర్లు.. 18,403 మంది అభ్యర్థులు
- బయోమెట్రిక్ విధానంలో అటెండెన్స్
- 9 నుంచి 10 గంటల మధ్యే కేంద్రంలోకి అనుమతి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్వహించే గ్రూప్- 1 పరీక్ష కోసం ఖమ్మం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండుసార్లు రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్ - 1 పరీక్ష నిర్వహించినా లీకేజీల కారణంగా రద్దు అయిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గ్రూప్-1 పరీక్షను సక్సెస్ ఫుల్ గా నిర్వహించి నిరుద్యోగుల మెప్పు పొందాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్ష కోసం జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ప్రిలిమినరీ ఎగ్జామ్ కు అభ్యర్థులను ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య కేంద్రంలోకి అనుమతిస్తారు. 10 గంటలు దాటిన తర్వాత ఎవరు వచ్చినా పరీక్ష హాల్లోకి అనుమతించరు. ఈసారి బయోమెట్రిక్ విధానంలో హాజరు తీసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు సైతం సెల్ ఫోన్లను పరీక్షా కేంద్రంలోకి తీసుకుపోవడానికి వీలులేదు. అలాగే పచ్చబొట్లు, టాటూలు, షఉలు ధరించిన అభ్యర్థులను పరీక్షా హాల్లోకి అనుమతించరు.

జిల్లాలో 18,403 మంది అభ్యర్థులు..

జిల్లాలో 18,403 మంది అభ్యర్థుల కోసం 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 52 సిట్టింగ్ స్క్వాడ్ తో పాటు డిపార్ట్మెంట్ ఆఫీసర్లను నియమించారు. వీరితో పాటు 18 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు 184 మందిని సైతం నియమించారు. ఈ పరీక్షలకు జిల్లా అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ నోడల్ ఆఫీసర్ గా వ్యవహరిస్తున్నారు. విజయ, ఎస్బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్ జాన్ బాబు, రాజ్ కుమార్ కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒక రోజు ముందే తమ కేంద్రాన్ని సందర్శించాలని టీఎస్ పీఎస్సీ అభ్యర్థులకు ఫోన్ మెసేజ్ లు పంపడంతో పాటు అధికారులకు సూచనలు చేస్తోంది.

అనేక సూచనలు...



గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష పై అధికారులతో సమావేశమైన కలెక్టర్

ఉదయం 10.00 గంటలకు కేంద్రాల గేట్లు మూసి వేస్తారు. మహిళా అభ్యర్థులను తనిఖీలు చేయడానికి, ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష హాలులో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థికి అభ్యర్థికి ఒక మీటరు దూరం పాటించేలా ఏర్పాటు చేశారు. ప్రతి అభ్యర్థి హాల్ టికెట్ తో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. హాల్ టికెట్ పై అభ్యర్థి ఫొటో సరిగా లేకపోతే గెజిటెడ్ అధికారిచే అటెస్టెడ్ చేయించుకొని, సొంత డిక్లరేషన్ రాసి ఇవ్వాల్సి ఉంటుంది. 3 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు వెంట తీసుకువెళ్లాలి. ఫ్లైయింగ్ స్కాడ్స్ , డిపార్ట్మెంట్ అధికారులకు కూడా సెల్ ఫోన్ లు అనుమతి లేదు. అభ్యర్థులు షఉస్, జ్యూవెల్లరి వేసుకొని రాకూడదు. ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్, సెల్ ఫోన్లకు, రికార్డింగ్ వస్తువులు, కాలిక్యులేటర్స్, వాచ్, రైటింగ్ ప్యాడ్ లకు అనుమతి లేదు. పరీక్ష ప్రారంభానికి కొంత సమయానికి ముందు నోడల్ ఆఫీసర్ స్ట్రాంగ్ రూం నుంచి ప్రశ్నాపత్రాలని కేంద్రాలకు తరలిస్తారు. ఇలా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్ష నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

రామోజీరావుకి నివాళులు అర్పించిన మంత్రి పొంగులేటి



నవతెలంగాణ-ఖమ్మం

రామోజీరావు మృతి పట్ల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీ లోనే రామోజీరావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీడియా రంగంలో విలువలతో కూడిన నూతన ఒరవడికి, ఎన్నో సంస్కరణలకు ఆద్యుడు రామోజీరావు అని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి మీడియా రంగానికి, తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని అన్నారు. ఆయన మతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రామోజీ రావు మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ సంతాపం

ఈనాడు గ్రూపు సంస్థల చైర్మెన్ రామోజీ రావు మరణం పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం తెలిపారు. శనివారం హైదరాబాద్ లో రామోజీ ఫిలిం సిటీ లోనే రామోజీరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీరావు చిరస్మరణీయులన్నారు. పత్రిక, టీవీ, సినిమా తదితర రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు ఆయనకు మాత్రమే కాకుండా యావత్ తెలుగు జాతికి గర్వకారణమన్నారు.

పెనుబల్లిలో రామోజీరావుకు ఘన నివాళులు

పెనుబల్లి : ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావుకు మండల రాజకీయ నాయకులు, ప్రముఖులు శనివారం నివాళులర్పించారు. వీఎం బంజర్ రింగు సెంటర్లో గాంధీ విగ్రహం ముందు రామోజీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చీకటి రామారావు మొరంపూడి బాబురావు, నాగాంజనేయులు, ఎస్కే బాబు, విశ్రాంతి ఉపాధ్యాయులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, తవు నాయక్, వంగ గిరిజాపతి మందడపు అశోక్ కుమార్, ఆచంటి శ్రీనివాసరావు, బుర్ర కోటేశ్వరరావు, వంగా దామోదర్ రావు, వేముల నరసింహారావు, కారుమంచి ఆనంద్, చీకటి నరసింహారావు ఉన్నారు.

రామోజీరావు మృతికి సండ్ర సంతాపం

కల్లూరు : ఈనాడు సంస్థల వ్యవస్థాపకులు, అక్షర యోధుడు, రామోజీ ఫిల్మ్ సిటీ అధినేత చెరుకూరి రామోజీరావు అకాల మరణానికి చింతిస్తూ... సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య తీవ్ర సంతాపం, కుటుంబ సభ్యులకు, అభిమానులకు సానుభూతి తెలియజేశారు. వారి మృతి సినీ ప్రపంచానికి తీరని లోటని అన్నారు.

బీఆర్ఎస్ మండల పార్టీ తీవ్ర సంతాపం

సంతాపం తెలిపిన వారిలో ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్ కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాలెపు రామారావు, సీనియర్ నాయకులు డా. లక్కినేని రఘు, డీసీసీబీ డైరెక్టర్ బోబొలు లక్ష్మణరావు, కాటమనేని వెంకటేశ్వరరావు, బొప్పన రామారావు, దేవరపల్లి భాస్కరరావు, మేకల కృష్ణ పాల్గొన్నారు.

చేపలకు భలే గిరాకీ

- అదును చూసి ధర పెంచిన వ్యాపారులు

నవతెలంగాణ-కల్లూరు

మృగశిర కార్తె రోజున చాపలు తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది ప్రజల్లో నమ్మకం. శనివారం మృగశిర కార్తె కావడంతో కల్లూరు చాపల మార్కెట్లో జనం పోటెత్తారు. జనం అవసరాన్ని గుర్తించి చాపల వ్యాపారులు కేజీ చాపలు 200 నుండి 250 రూపాయలు వరకు పెంచి అమ్ముతున్నారు. ఈ సంవత్సరం కల్లూరు మండలంలో పెద్ద చెరువు తప్ప అన్ని చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో చేపలకు గిరాకీ పెరిగింది. మండలంలో చేపలు లేకపోవడం వల్ల దూర ప్రాంతాల నుండి తీసుకువచ్చు అమ్మడంతో రేట్ పెరగడానికి ఇదొక్క కారణం అని అంటున్నారు. మృగశిర కార్తె కావడంతో ప్రతి ఒక్కరూ చేపల కోసం రావడంతో రద్దీ బాగా పెరిగింది. దీనికి తోడు చాపల మార్కెట్ ప్రధాన రహదారి పక్కన ఉండటం వల్ల



చేపలకు వచ్చినవారు ద్విచక్ర వాహనాలు రోడ్డుపైనే నిలపడంతో వచ్చే పోయే వాహనాలకు ఇబ్బంది మారింది. దీంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.



1994లో విజయవాడలో జరిగిన యువజన సంఘాల సంపూర్ణ మద్యపాన నిషేధ ఉద్యమ రాష్ట్ర సదస్సులో ప్రసంగిస్తున్న వావిలాల గోపాల కృష్ణయ్య. పాల్గొన్న ఎడమ నుంచి నలమల వెంకటేశ్వరరావు, నున్నా నాగేశ్వరరావు, ఈనాడు సంపాదకులు రామోజీరావు, పోటు రంగారావు, మిరియం వెంకటేశ్వర్లు (ఫైల్)

రామోజీరావు మృతికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సంతాపం

నవతెలంగాణ-ఖమ్మం

ప్రముఖ పత్రికా సంపాదకుడు చెరుకూరి రామోజీరావు మరణం పట్ల సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సంతాపం, కుటుంబానికి సానుభూతి తెలియజేస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియచేశారు. రామోజీరావు మొదట కమ్యూనిస్టు ఉద్యమంలో యువజన రంగంలో కార్యకర్తగా పనిచేశారని, సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావుల సహచర్యంలో పనిచేశారని గుర్తు చేశారు. తర్వాత వ్యాపార రంగంలోకి వెళ్ళిన రామోజీరావు ప్రధానంగా పత్రికా రంగంలో పనిచేసి జర్నలిజంలో సంచలనాలు సృష్టించారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో సారా వ్యతిరేక ఉద్యమంలో మద్దతుగా పాల్గొని మద్యపాన నిషేధం కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. అదే విధంగా మాతృ భాషను కాపాడటం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. పత్రికా రంగమైనా, ఎలక్ట్రానిక్ మీడియా అయినా అవినీతి మీద ఎనలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. అక్షరానికి సామాజిక బాధ్యత వుందని తన పత్రిక "ఈనాడు" ద్వారా రామోజీ నిరూపించారని తెలిపారు. ప్రజా పక్షం వహిస్తూ, వాస్తవాలు వెల్లడిస్తూ, జన చైతన్యం కలిగించాలరని, ప్రజల ఉద్యమాలకు అండగా నిలిచారని, విలువలు కలిగిన జర్నలిజాన్ని అందించి ఇతరులకు మార్గదర్శిగా వున్నారని అన్నారు. తెలుగువారు గర్వపడేలా హైద్రాబాద్‌లో అద్భుతమైన " రామోజీ ఫిలిం సిటీ "ని నిర్మించారని తెలిపారు. రామోజీరావు దేశానికి, రాష్ట్రానికి, పత్రికా రంగానికి చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు.

రామోజీరావు మృతికి మాజీ ఎంపీ నామ సంతాపం

- ఆయన మృతి మీడియా రంగానికి, సమాజానికి తీరని లోటు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మీడియా దిగ్గజం... ఈనాడు గ్రూపు సంస్థల చైర్మెన్, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు అకాల అస్తమయంపై ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మరణం తనను తీవ్రంగా కలచివేసిందని సంతాపం తెలిపారు. తను నమ్మిన విలువలు, సిద్ధాంతం కోసం మీడియా ప్రపంచంలో ఆయన సాగించిన ప్రయాణం అసామాన్యమైందని పేర్కొన్నారు. ఆయన మృతి మీడియా ప్రపంచానికి, సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మన మధ్య సజీవంగా లేకున్నా ఆయన స్థాపించిన సంస్థల రూపంలో నిత్యం మన కళ్ళ ముందే ఉంటారని అన్నారు. సామాజిక సేవ ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చిన నిత్య కృషి వలుడని తెలిపారు. అక్షర యోధునిగానే కాకుండా సినీ నిర్మాతగా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సినీ స్టూడియో నిర్మాణం, వాణిజ్య వేత్తగా ఆయన సాధించిన విజయాలు అందరికీ స్ఫూర్తివంతమని నామ వివరించారు. నైతిక విలువలు, ప్రమాణాలతో పాత్రికేయుని కంటే మిన్నగా రాణించారని పేర్కొన్నారు. నిరంతర శ్రమ, కార్యదీక్ష, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమే రామోజీరావు అని నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



మెగా లోక్ అదాలత్‌లో 931 కేసులు పరిష్కారం

నవతెలంగాణ- మధిర

మధిర కోర్టులో ప్రధాన న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డి అధ్యక్షతన మెగా లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. కేసుల వివరాలు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఎక్సైజ్ కేసులతో సహా 174 కేసులు పరిష్కారం కాగా 1,06,370 రూపాయలు జరిమానా విధించారు. అదే విధంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 76 కేసులు పరిష్కారం కాగా 1,02, 100 రూపాయలు జరిమానా విధించారు. ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి కోర్టులో 681 కేసులు పరిష్కారం కాగా 35,700 రూపాయలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా జరిగిన న్యాయ చైతన్య సదస్సులో ప్రధాన న్యాయమూర్తి టీ. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ కక్షిదార్లు సంయమనం పాటించి సాధ్యమైనంత వరకు పట్టుదలకు పోకుండా కేసులు పరిష్కారానికి చొరవ చూపాలని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎం.అబ్రహం, కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ఎస్.నాగలక్ష్మి, జె.భద్రయ్య బార్ అధ్యక్షులు బి.పుల్లారావు సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, చింతల గోపాల్, ఎస్.జనార్దన్ రావు, పల్ల పోతుల కృష్ణారావు, టీ.వెంకట్రావు, కె.విజయ్ కుమార్, ఎం.సతీష్, జే.రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ దిగ్విజయానికి సహకరించినందుకు పోలీసు అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎస్.దివి, బి.హనీషా, ఉపేందర్ లను న్యాయమూర్తి అభినందించారు.



ప్రార్థన మందిరాలకు విరాళం

- ఆధ్యాత్మికతపై ప్రేమను చాటిన తుళ్లూరి దంపతులు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఆధ్యాత్మికపై ప్రేమతో నూతనంగా నిర్మిస్తున్న ప్రార్థన మందిరాలకు దాత ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, కేఎస్ఆర్ గ్రానైట్స్ అధిపతి జమలాపురం గ్రామానికి చెందిన తుళ్ళూరి కోటేశ్వరరావు, నిర్మల కుమారి దంపతులు శనివారం విరివిగా విరాళాలను అందించారు. మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీఎస్ఐ ప్రార్థన మందిర నిర్మాణానికి సుమారు 10 లక్షల రూపాయల విలువ కలిగిన ఐరన్, సిమెంట్, గ్రావెల్ మెటీరియల్‌ను సంఘ పెద్దలకు అందించారు. ఎస్టీ కాలనీలో గల బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ మందిర నిర్మాణానికి రూ.5 లక్షల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. తండాలో సేవాలాల్ కోలాట నృత్య సమాజానికి కోలాట దుస్తులను వితరణ చేశారు. నూతన దుస్తులతో బంజారాలు ఉత్సాహంగా కోలాట నృత్యం చేశారు. గ్రామస్తుల అవసరాల నిమిత్తం అడిగిందే తడవుగా కాదనకుండా గ్రామాభివృద్ధి కోసం సాయం చేయడానికి ముందుండే ఉదారస్వభావం గల తుళ్ళూరి కోటేశ్వరరావు నిర్మలా కుమారి దంపతులను గ్రామ పెద్దలు అభినందించారు. ఈ సందర్భంగా బంజారాలు శాలువాతో దాతలను సత్కరించారు. పుట్టి పెరిగిన గ్రామాన్ని వదలకుండా ఏ అవసరమొచ్చిన పిలవగానే ముందుకొచ్చే తుళ్ళూరి దంపతులు జమలాపురం గ్రామస్థులు కావడం అదృష్టమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రామిరెడ్డి, నన్నపనేని రామారావు, అంకిరెడ్డి, టీడీపీ నాయకులు వాసిరెడ్డి శివకుమారి, వీరమాచినేని కృష్ణారావు, మేడా భాను ప్రతాప్,చర్చి సంఘ పెద్దలు, బంజారాలు పాల్గొన్నారు.



తల్లాడలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

- అభివృద్ధికి నోచుకోని మండల కేంద్రం

నవతెలంగాణ తల్లాడ

మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, మండల ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో పదవ తరగతి చదివిన విద్యార్థులు కల్లూరు, వైరా, ఖమ్మం, విజయవాడ తదితర దూర ప్రాంతాలకు వెళ్లి వ్యయ ప్రయాసల కోర్చి ఇంటర్మీడియట్ చదవాల్సిన పరిస్థితి ఏర్పాడింది. మండలంలో తల్లాడ, అన్నారుగూడెం, కుర్నవల్లి మిట్టపల్లి, పినపాక, గ్రామాలలో జిల్లా పరిషత్ హై స్కూల్‌లు ఉన్నాయి. ఆయా పాఠశాలలో పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు మండల కేంద్రంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక మార్లు మంత్రులు హామీలు ఇచ్చినప్పటికీ అమలు కాలేదు. మారుమూల మండలాలలో జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అటువంటిది రాష్ట్రీయ రహదారిలో జంక్షన్‌గా ఉన్నా తల్లాడలో జూనియర్ కళాశాల లేకపోవడం శోచనీయం. పేద మధ్య తరగతి విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్మీడియట్ చదువుకోలేక పదవ తరగతితోనే చదువులు ఆపేస్తున్నారు. విద్యార్థినిలు బస్సులలో తిరగలేక ఈవ్ టీజింగ్ భరించలేక చదువు మానేస్తున్నారు. మండల కాంగ్రెస్ నాయకులు మంత్రులపై ఒత్తిడి తెచ్చి తల్లాడలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోనైనా తల్లాడకు జూనియర్ కళాశాల వస్తుందని ఆశిద్దాం.

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించండి

నవ తెలంగాణ-మధిర

3వ రోజు బడిబాట కార్యక్రమంలో భాగంగా జెడ్పీహెచ్ఎస్ మడుపల్లి ప్రధానోపాధ్యాయులు తోట. నరసింహారావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు, కంచిపోగు ఆదాము, పి.కిషోర్, ఎస్.రామిరెడ్డి, కె.బాబురావు, కె.కృష్ణయ్య, సిహెచ్.చిట్టిబాబు, పిఎస్.మడుపల్లి (బీసీ కాలనీ) ప్రధానోపాధ్యాయులు డి.అర్జున్‌ని కలిసి 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను 6వ తరగతిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ క్లాసుల విద్యా బోధన, ఇంగ్లీష్ మీడియం బోధన, ప్రత్యేక పరీక్షల శిక్షణ, ఆటలలో నైపుణ్యాల పెంపుదల ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ కె.నాగమణి, సభ్యులు,పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్పిటల్ సమస్యలు పరిష్కరించండి





- క్యాజువాలిటీలో డాక్టర్ సేవలు మెరుగుపరచాలి
- డాక్టర్ పోస్ట్‌లు భర్తీ చేయాలి ఆస్పత్రి సూపరింటెండెంట్‌కి సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-ఖమ్మం

మూడు రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ వేలాది మంది పేషెంట్లు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిని నమ్ముకొని ఎంతో ఆశలతో వస్తున్నారని, వారికి ధైర్యం ఇచ్చే విధంగా వైద్య సేవలు ఉండాలని సీపీఐ(ఎం) నాయకులు కోరారు. శనివారం ఖమ్మంలోని సీపీఐ(ఎం) ఖమ్మం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ కిరణ్ తో భేటీ అయి పలు సమస్యలను ప్రతినిధి బృందం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ మాట్లాడుతూ అనేక ప్రధానమైన హెల్త్ విభాగాల్లో ఖాళీ పోస్టులు ఉన్నాయని ప్రధానంగా 50 డాక్టర్ పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేసి రోగులకు వైద్య సేవలు పెంచాలని కోరారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రి క్యాజువాలిటీలో సీనియర్ వైద్య సేవలు అవసరం ఉందని, కానీ సీనియర్ డాక్టర్‌లు కొద్ది టైం మాత్రమే ఉండి ప్రయివేటు క్లీనిక్ లుకు వెళ్ళుతున్నారని తెలిపారు. వివిధ శాఖల్లో ల్యాబ్ టెక్నీషియన్లు, సిస్టర్ జాబ్‌లు ఖాళీగా ఉన్నాయని వెంటనే వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా లక్షలు రూపాయలు విలువ గల గుండె ఆపరేషన్ సేవలకు పర్మనెంట్ హార్ట్ డాక్టర్‌ను నియమించాలని కోరారు. అలాగే 3 నెలలుగా పెండింగ్ లో ఉన్న కాంట్రాక్టర్ వర్కర్స్ కు జీతాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆసుపత్రిలో రోగులకు మెరుగైన ఉచిత సేవలు కోసం రాబోయే కాలంలో సమస్యల పరిష్కారం కోసం దశలు వారిగా ఆందోళనలు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సూపరింటెండెంట్ కిరణ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు జె.వెంకన్న బాబు, సిహెచ్.బద్రం, నాగేశ్వరరావు, పి.వాసు, మల్లికార్జున్ రెడ్డి, బి.ఎం. కష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలి

- 10న హైదరాబాద్‌లో జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రధాని మోడీ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించుకుంటూ, మరోవైపు పనిరోజులు తగ్గించు కుంటూ వ్యవసాయ కూలీలకు అన్యా యం చేస్తోందనివ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అన్నారు. ఈ క్రమంలో ఉపాధి హామీ చట్టం పరిరక్షణకై ఈనెల 10న హైదరాబాద్ లో రాష్ట్ర సదస్సు జరుగుతుందని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం తిరుమలాయపాలెంలో సదస్సును జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం వామపక్ష పార్టీల డిమాండ్ మేరకు వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా ఈ పథకం దాల్చిందని, కరువు పనిగా కూలీలు భావిస్తారని, మార్చి, ఏప్రిల్, మే నెలలో రెక్కల కష్టంపై ఆధారపడ్డ గ్రామీణ కూలీలకు ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఈ పని ఉంటుందని, ఈ పనిలో అనేక ఇబ్బందుల్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని అన్నారు. రెండు పూటల ఫొటో విధానం, పని కొలతల విధానం, డూమ్ కెమెరాలతో పని పరిశీలన అనే కొత్త షరతులు విధిస్తూ 100 రోజులు జరగాల్సిన పనిని కేవలం 50 నుంచి 60 రోజులు మాత్రమే పని కల్పిస్తున్నారని చెప్పారు. రోజుకు 300 రూపాయలు చొప్పున ప్రతి వ్యవసాయ కూలికి ఇవ్వాల్సింది, అలా కాకుండా 150 రూపాయలు రెండు వందల మధ్యలోనే ఇస్తున్నారని, ఇది సరైన విధానం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు నర్సుల వెంకటేష్, కొమ్ము వెంకన్న, బొజ్జ ముత్తయ్య, ఎస్ రాము, కొమ్ము నాగేశ్వరరావు, మహిళా కూలి నాయకులు ఉపేంద్ర, జయమ్మ, సునీత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం కోసం ఎస్ఎఫ్ఐ సంతకాల సేకరణ

నవతెలంగాణ-వైరాటౌన్

ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కార్పొరేట్ స్థాయిలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనికి గత తెలంగాణ ప్రభుత్వం బాధ్యత వహించాలని, కానీ నిర్లక్ష్యం చేస్తుందని, దీని ఫలితంగానే పేద విద్యార్థులు విద్యకు దూరం అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తల్లిదండ్రులపై అధిక భారం పడిందని, తమ



ఆదాయంలో అధిక భాగం విద్యపై ఖర్చు చేయాల్సి వచ్చిందని, ఇప్పుడున్న ఫీజుల స్థాయిని, తల్లిదండ్రులపై ఉన్న మోయలేని భారాన్ని వెంటనే ప్రభుత్వం అర్థం చేసుకొని ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న తరుణంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నర్సరీలో లక్షకుపైగా ఫీజులు వసూలు చేయడం వల్ల మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు చదువుకు దూరం అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) వైరా రూరల్ మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ అధ్యక్షులు పుప్పాల నాగరాజు, కమిటీ సభ్యులు రామిశెట్టి ఉపేందర్, గణేష్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
ఆదివారం | జూన్ 09, 2024 | www.navatelangana.com



డబల్ ఇండ్ల కాలనీ రక్షణగోడ నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కారేపల్లి

మండలంలోని పేరుపల్లి డబల్ బెడ్‌రూమ్ కాలనీ(పాతకేసీఆర్ కాలనీ)కి బుగ్గవాగునుండి రక్షణకు ప్రహారీ గోడ నిర్మించాలని, కాలనీలో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులను సీసీలు మార్చాలని నేషనల్ హ్యూమన్ రైట్ కౌన్సిల్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ షరీఫ్‌పాషా శనివారం కారేపల్లిలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను కలిసి విన్నవించారు. డబల్ ఇండ్ల కాలనీ సమస్యలకు నిలయంగా మారిందని, అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారంకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారని ఎస్‌కె.షరీఫ్ షాషా తెలిపారు.



కారేపల్లిలో కేవీ విద్యానికేషన్ ప్రారంభం

- దేశాభివృద్ధి విద్యతోనే సాధ్యం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో నిరుద్యోగుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేవీ విద్యానికేతన్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం ప్రారంభించారు. అన్ని హంగులతో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో కరస్పాండెంట్ వీ.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ విద్యాసంవత్సరం నుండి విద్యాలయంను ప్రారంభించారు. విద్యాలయంను ప్రారంభించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తరగతి గదులను కలియతిరిగి యాజమాన్యంను ప్రశంసించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాభివృద్ధి విద్యతోనే సాధ్యమన్నారు. విద్యతోనే సాంకేతకంగా దేశం అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీ పడుతుందన్నారు. విద్య వ్యాపారం చేయకుండా నిరుద్యోగులు తమ కాళ్లపై నిలబడాలనే ఉద్దేశంతో స్కూల్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయన్నారు. ఈకార్యక్రమంలో విద్యాలయ కరస్పాండెంట్ వీ.కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు



ఆంధ్ర గెలుపుతో ఆలయానికి పోటెత్తిన భక్తులు

- తెలంగాణ డిపో బస్సులు నడపాలి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభు జమలాపురం శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికలలో కూటమి విజయ దుందభి మోగించడంతో భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే స్వామి వారికి అర్చకులు పంచామృతాలతో ఘనంగా సర్వంగ అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. శనివారం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారి ఆలయంతో పాటుగా అన్ని ఉప ఆలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. మహిళా భక్తులు పొంగళ్ళు చేసి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఎదుట నివేదన చేసి స్వామి వారి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు. భక్తులు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు రావడానికి తెలంగాణ డిపోల నుండి ఖమ్మం, మధిర, సత్తుపల్లి డిపోల నుండి బస్సులు నడపాలని భక్తులు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తె లుగుదేశం జనసేన పార్టీ కూటమి అధికారంలోకి రావ డంతో కృష్ణ, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలు స్వామి వారి పై ఉన్న భక్తి భావంతో ఆయా జిల్లాల నుండి తెలుగుదేశం జనసేన పార్టీల శ్రేణులు ర్యాలీలుగా జమలాపురం ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మైలవరం ఎమ్మెల్యేగా వసంత కృష్ణ ప్రసాద్ విజయం సాధించడంతో వెలగలేరు గ్రామానికి చెందిన చనుమోలు రామ కిషోర్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులు వందలాదిగా ఆలయానికి కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మొరుసుమల్లి గ్రామస్తులు కాలినడకన స్వామివారి ఆలయానికి వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. నందిగామ నియోజకవర్గం నుండి తంగిరాల సౌమ్య విజయం సాధించడంలో గూడెం మాధవరం, దొడ్డ దేవరపాడు, వీర్లపాడు గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు వందలాదిగా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ పర్యవేక్షకురాలు కే.విజయ కుమారి, కృష్ణ ప్రసాద్, ఆలయ సిబ్బంది, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.



మొట్టమొదటిసారిగా 32 గంటల సుదీర్ఘ గానలహరి

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో 32 గంటల పాటు 32 మంది గాయకులతో సుదీర్ఘ గానలహరి కార్యక్రమానికి ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు నాగబత్తిని రవి, సాయిశ్రీ డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ ఎండి కమర్తపు శ్రీధర్, పారుపల్లి సురేష్, అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళాసాంస్కృతిక సంస్థ కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్, 32 గంటల సుదీర్ఘ గానలహరి గాంధర్వరాలు వంజా మాలతీ నాయుడు, ప్రముఖ సీనియర్ గాయకుడు వీవీ.రెడ్డి నటరాజ విగ్రహానికి, గానగాంధర్వులు కీర్తిశేషులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర మధురిమ కల్చరల్ ఈవెంట్స్ అధ్యక్షుడు ఇసనపల్లి నగేశ్ మాట్లాడుతూ ఖమ్మంతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి గాయని గాయకులు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా కో- ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ కో- ఆర్డినేటర్, 30 గంటల నాన్‌స్టాప్ సింగర్ అండ్ 8 ఇంటర్నేషనల్ రికార్డ్ హెూల్డర్ డాక్టర్ నాగశ్రీ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, జిల్లా చీఫ్ కో- ఆర్డినేటర్, ఖమ్మం యడ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామోజీరావుకి మంత్రి తుమ్మల నివాళి

నవతెలంగాణ-ఖమ్మం

ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతదేహానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులర్పించారు. శనివారం హైదరాబాదులోని రామోజీ ఫిలిం సిటీలో రామోజీరావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



పెండింగ్ డీఏలు చెల్లించాలి..

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు 4 విడతల కరువు భత్యమును రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు కే.జంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాటిని విడుదల చేయడంతో పాటు ఈ-కుబేరులో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేందుకు ఖమ్మంలో సంఘం రాష్ట్ర



నాయకులు షేక్ మహబూబ్ అలీ కూతురు వివాహానికి శనివారం హాజరైన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో జంగయ్య మాట్లాడారు. జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ లోన్‌లు, పార్ట్ ఫైనల్స్ చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లు చేయాలని నిర్ణయించడం పట్ల ప్రభుత్వానికి, విద్యాశాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ బడులలో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. విద్యా వాలంటీర్లు, సర్వీస్ పర్సన్స్‌ను నియమించడంతో పాటు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బడిబాటలో ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు చావ దుర్గభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు బుర్రి వెంకన్న, షేక్ యూసఫ్ సైదా, వల్లం కొండ రాంబాబు, వీవీ.రామారావు, పీ.సురేష్, ఉద్దండు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ తీర్పు అంతిమం

- 4వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్
- సత్తుపల్లి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్
- లోక్ అదాలత్‌లో 506 కేసులు పరిష్కారం
- 4వ ఏడీజే కోర్టులో 10 కేసులకు రూ. 73.48లక్షలకు పరిష్కారం

నవతెలంగాణ-సత్తుపల్లి



లోక్ అదాలత్‌ల ద్వారా పొందే తీర్పు అంతిమ తీర్పు అని, ఈ తీర్పును సవాల్ చేస్తూ పై కోర్టుల్లో అప్పీల్ చేసుకొనేందుకు అవకాశం ఉండదని 4వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి ఎం.శ్రీనివాస్ స్పష్టం చేశారు. సత్తుపల్లి కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జడ్జి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 2015 నుంచి దేశమంతటా నిర్దిష్ట అంశాలపై ప్రతినెలా జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. రాజీమార్గం రాజమార్గమని, ఇరు వర్గాలకు చెందిన కక్షిదారుల అంగీకారంతో వివాదంలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టులో వ్యాజ్యానికి ముందు దశలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కాంపౌండబుల్ కేసులను మినహాయించి విద్యుత్, ప్రజా వినియోగ బిల్లుల సమస్యలు, వివాహ సంబంధ సమస్యలు, డబ్బు రికవరీ, కార్మిక వివాదాలు ఇలా లోక్ అదాలత్ పరిధిలోకి పలు కేసులను లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం పొందడానికి వీలుకలుగుతుందని, కాలం డబ్బు ఆదా అవుతుందని జడ్జి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి మీరాం కాశీం, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తేళ్లూరి ఆడమ్స్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బోయినపల్లి రవి, ఏసీపీ అనిశెట్టి రఘు, సత్తుపల్లి పట్టణ, రూరల్ సీఐలు తెల్లబోయిన కిరణ్, వెంకటేశ్, కోర్టు, పోలీసు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 506, 4వ ఏడీజే కోర్టులో 10 కేసులు పరిష్కారం

సత్తుపల్లి కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 506 కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. 4వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో ప్రమాద (ఎంవీఓపీ) సంబంధించి 9 కేసులకు పరిహారం రూ.59.48లక్షలు, చెక్‌బౌన్స్ కేసుకు సంబంధించి రూ. 14లక్షలు, మొత్తం కలిపి రూ. 73.48లక్షలకు న్యాయమూర్తులు ఆయా కేసులను పరిష్కరించారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-ఖమ్మం



ఇంటర్ విద్యా వ్యవస్థలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఇతర సిబ్బంది సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లవలసిందిగా శనివారం ఖమ్మంలోని నయాబజార్ ఇంటర్మీడియట్ పరీక్ష పేపర్ల మూల్యాంకన కేంద్రంకు వచ్చిన ఖమ్మం, నల్గొండ, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డికి తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి మల్లయ్య, కొండ వినోద్‌బాబు మాట్లాడుతూ ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల్లో పనిచేస్తున్న అన్ని రకాల సిబ్బందికి రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా కూసుమంచి, తల్లాడ, కొణిజర్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.పలు కొత్త జిల్లాలలో ఖాళీగా ఉన్న ఇంటర్ విద్యా అధికార పోస్టులను, ప్రిన్సిపల్ పోస్టులను, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు శాంక్షన్ చేయటానికి కృషి చేయాలని, రెగ్యులర్ గాని డిగ్రీ, జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించడానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అదేవిధంగా ఇంటర్ విద్యలో పనిచేస్తూ రెగ్యులర్ కాబడిన అధ్యాపకులకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ అవకాశం కల్పించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంచడానికి అనేక సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవిబాబు, క్యాంపు ఏసిఓ జనరల్ వస్ అండ్ జనరల్ టు కుతుంబాక శ్రీనివాసరావు, ప్రవీణ్, ప్రిన్సిపాల్ అసోసియేషన్ బాధ్యులు, అధ్యాపక సంఘాల నాయకులు అనేక సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తన వంతు కృషిగా ఈ సమస్యలన్నిటిని ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కృష్ణారావు, చెన్నారావు, బి .వెంకటేశ్వర్లు, గ్రంథ పాలకుల సంఘ నాయకులు గోపాలకృష్ణ, ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు కృష్ణార్జునరావు, రాష్ట్ర కౌన్సిలర్ కే.శ్రీకాంత్, పంది సత్యనారాయణ, జిల్లా కోశాధికారి భాస్కర్, డీ.నరసింహారావు, బీ.నాగేశ్వరరావు, నరసింహారావు, వీ.శ్రీనివాసరావు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు సమిష్టిగా పనిచేయాలి

- అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు

నవతెలంగాణ-ఖమ్మం



రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు సమిష్టిగా పనిచేయాలని అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు అన్నారు. శనివారం వ్యవసాయ అధికారులు, పోలీస్ అధికారులందరితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు మాట్లాడుతూ....నకిలీ విత్తనాలు, నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేస్తే ఆర్థికంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయ్యే ప్రమాదం ఉంటుందని, నకిలీ విత్తనాల విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. వ్యవసాయ అధికారులు విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారని, కృత్రిమ కొరత సృష్టించి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకొవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా విత్తనాల కొరత లేదనే విషయాన్ని రైతులకు భరోసా కల్పిస్తూ..రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించేలా పకడ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి, తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసిరకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే అక్రమ రవాణా నియంత్రణకు జిల్లాలో ఏడు చెక్ పోస్ట్‌ల ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. డీలర్లు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు విక్రయించి, రైతులకు నష్టం కలిగేలా వ్యవహరించకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొవాలని సూచించారు. రైతులు సైతం విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత పాటిస్తూ..కొనుగోలు రశీదు తీసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. అలాగే తనిఖీల సమయంలో వీడియోగ్రాఫీ చేయడం ద్వారా ఎవిడెన్స్, ఆధారంగా ఉంటుందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయశాఖ అధికారికిగాని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, ఏడీఏలు శ్రీనివాస్, నరసింహారావు, విజయచందర్, కరుణశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, ఏవో కిషోర్, సిఐ స్వామి పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలి

- రీ-ఎగ్జామ్ నిర్వహించాలి
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం

నీట్ అవకతవకల పై సమగ్ర విచారణ జరిపించాలని, రీ-ఎగ్జామ్ నిర్వహించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎలాంటి హడావుడి లేకుండా దేశంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లవడుతున్న సమయంలో, నీట్ పరీక్ష ఫలితాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్.టి.ఎ) ప్రకటించిందని, ముందుగా ఈనెల 14న అని ప్రకటించి ముందుగానే ఎలాంటి సమాచారం లేకుండా ఫలితాలు వెల్లడించడంపై దేశ వ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రధానంగా ఎన్‌టీఏను తీసుకుని వచ్చిన నుండి దాని పారదర్శకతపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, గత పరీక్షలలో ఎన్‌టీఏ చేసిన ఘోర తప్పిదాలను, అవకతవకలు మళ్ళీ పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. ఎంబీబీఎస్-బీడీఎస్ గ్రాడ్యుయేట్ స్థాయి ప్రవేశ పరీక్షలో మొత్తం మార్కులు 720, ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు ఇవ్వబడతాయని, అయితే ప్రతి తప్పు సమాధానానికి మొత్తం నుండి 1 మార్కు తీసివేయబడుతుందిని, అయితే సమాధానం లేని ప్రశ్నలు గుర్తించబడవని, అలాంటప్పుడు, 719, 718 వంటి మార్కులు పొందడం గణితశాస్త్రంలో సాధ్యం కాదని, కానీ అలాంటి సందర్భాలు ఈ ఫలితాల్లో కనిపించాయని, ఈ ఏడాది ఫలితాలు గ్రేస్ మార్కింగ్ కోసం అని ఎన్‌టీఏ క్యాజువల్‌గా ఒక ప్రకటనలో తెలిపిందని పేర్కొన్నారు. కానీ ఈ ఏడాది పరీక్షకు ముందు ఎన్‌టీఏ ప్రచురించిన మార్గదర్శకాలలో ఎక్కడా ఈ గ్రేస్ మార్కింగ్ పథకం గురించి ప్రస్తావించలేదని, అంతేకాకుండా, ఒకే సెంటర్ నుండి వరుసగా రోల్ నంబర్లు ఉన్న విద్యార్థులు ఒకే మార్కులను పొందారని ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. యాధృచ్ఛికంగా 720 కి 720 వచ్చాయని, అంటే ఈ ఫలితాలును బట్టి అభ్యర్థులు ఇక నుండి ర్యాంకులు వచ్చిన ఆయా ప్రైవేట్ కాలేజీలలో అడ్మిషన్ తీసుకోవలసి వస్తుందని, ఇది సిలబస్‌లో గణనీయమైన తగ్గింపు వంటి ఎన్‌టీఏ విధానాల కారణంగా మోదీ ప్రభుత్వ హయాంలో ఎన్ఎంసీ, ఎన్‌టీఏ సంయుక్తంగా వైద్య విద్యను ప్రైవేటీకరించిన తీరు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని తెలిపారు. వైద్య రంగంలో రాష్ట్ర ఆధారిత ఉమ్మడి ప్రవేశ పరీక్ష విధానాన్ని మార్చడం వల్ల అంతులేని అవినీతి జరిగిందన్న వాదన ఇప్పుడు నీట్-యూజీకి సంబంధించి కూడా ముందుకు వస్తోందని ఆరోపించారు. ఈ ఘటనపై తక్షణమే పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. రీ - ఎగ్జామ్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ కోరుతుందని, నీట్ అవకతవకలపై జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు.





మహిళలకు చట్టపరంగా రక్షణ కల్పించాలి

నవతెలంగాణ-ఖమ్మం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు చట్టపరంగా రక్షణ కల్పించాలని వీరనారి సావిత్రిబాయి పూలే మహిళా సంఘం అధ్యక్షురాలు పీఆర్. దేవి అన్నారు. శనివారం ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం మహిళా సంఘం జిల్లా నాయకురాలు చిప్ప సత్యవతి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై ఎక్కువగా అత్యాచారాలు, అఘాయిత్యాలు, జరుగుతున్నాయని, ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని, ఇదే కాక తెలిసి తెలియని వయసులో వివాహాలు జరిగి పిల్లలయిన తర్వాత ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాలు వచ్చి భార్యాభర్తల మధ్యలో అవగాహన లేక జరిగే గొడవలలో పిల్లల పోషణ భారం మహిళలపై పడి మహిళలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మహిళలకు సమాజంలో రక్షణ లేదు, చట్టపరంగా కూడా మహిళలకు న్యాయం జరగడం లేదు అని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రక్షణ కల్పించాలని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్య, వైద్యం, ఉద్యోగాలలో అన్ని రంగాలలో యువతి, యువకులకు అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుపేదలకు అట్టడుగు వర్గాల ప్రజలకు అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, ఇల్లు, రేషన్ కార్డులు, వృద్ధులకు ఒంటరి మహిళలకు పింఛన్లు, వికలాంగులకు పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బీ.మణి, ఉపాధ్యక్షులు కే.అనంతలక్ష్మి, జిల్లా నాయకులు ఈశ్వరి, కే.లక్ష్మి, ఉపాధ్యక్షురాలు చాట్ల సునీత, వినోద, ఎం.ధనలక్ష్మి, ఎస్.మంగమ్మ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పురుషోత్తం

నవతెలంగాణ-ముదిగొండ

ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్ తొలగించినందున రాష్ట్ర ప్రభుత్వము పాలనపై దృష్టి పెట్టి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అన్నారు. శనివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇండ్ల మంజూరు చేయాలన్నారు. రైతు రుణమాఫీతోపాటు, మహిళలకు నెలకు రూ 2500, వ్యవసాయ కార్మికులకు రూ 12వేలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నూతనంగా రేషన్ కార్డులు మంజూరు చేసి, పెన్షన్లు రూ 4 వేలు ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని చెప్పారు.

నీట్ ఫలితాల్లో అవకతవకలపై విచారణ చేపట్టాలి

- యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రీపోతుల అంజని

నవతెలంగాణ-నేలకొండపల్లి



కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజని డిమాండ్ చేశారు. శనివారం మండలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ ప్రవేశ పరీక్షల్లో పేపర్ లీకేజీ జరిగిందన్న విమర్శలు ఉన్నాయని, వచ్చిన ఫలితాలలో సైతం ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఏడుగురు విద్యార్థులకు 720కి 720 టాప్ మార్కులు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న అసమర్థ విధానాల ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. యువత భవిష్యత్తు, జీవితాలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) 2024 ఫలితాల్లో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఫిర్యాదు చేసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నీట్ సహా అనేక ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పేపర్ లీకేజీలతో పెద్ద ఎత్తున స్కాములు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో జరిగిన అవకతవకలపై ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టాలని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని ఎడల పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సోమనబోయిన సాయినవీన్, రాయపూడి రోహిత్, పిట్టల రాజా, వడ్లమూడి శీను తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | జూన్ 09, 2024 | www.navatelangana.com

విత్తనవిక్రయ కేంద్రాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు



నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని కొమరారంలో విత్తనవిక్రయ కేంద్రాల్లో శనివారం పోలీసుల విస్తృత తనిఖీలు, విక్రయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై సోమేశ్వర్ మాట్లాడుతూ...నాసిరకం, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు పొందాలని రైతులకు సూచించారు. ధరల పట్టిక, అందుబాటులో ఉన్న విత్తనాల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని యజమానులకు చెప్పారు.

అక్షరయోధుడికి ఘన నివాళి

- సంతాపం తెలిపిన ప్రెస్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-చండ్రుగొండ

ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మెన్ రామోజీరావు అనారోగ్యంతో బాధపడుతూ తెల్లవారుజామున మృతి చెందడం పట్ల ప్రెస్ క్లబ్ చండ్రుగొండ సభ్యులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. రామోజీరావు మరణం పాత్రికేయ రంగానికి తీరనిలోటని, పత్రికా స్వేచ్ఛను కాపాడడానికి విశేషంగా కృషి చేసిన రామోజీ రావు మరణం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో ప్రెస్ క్లబ్ చైర్మెన్ యాకూబ్ పాషా, వెంకటేశ్వర్లు, రబ్బాని, సురేష్ రాందాస్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

- సంఘ సంస్కర్తలు షేక్ పాషా, రామకృష్ణ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండలంలో ఉన్న బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, బడి ఈడు పిల్లలతో పనులు చేయించడం బాల కార్మిక చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని స్థానిక సంఘసంస్కర్తలు జాకారం హెచ్ఎం షేక్ పాషా, రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీలో భాగంగా సంఘసంస్కర్తలైన వీరు మాట్లాడుతూ..మండలంలో బాల్య వివాహాలు జరుగరాదని, బాల కార్మికులు ఉండరాదనే సదుద్దేశంతో ఈ ప్రకటన చేస్తున్నట్లుగా వారు పేర్కొన్నారు. మండలంలో బాల్య వివాహాలు, బాల కార్మికులకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు జరిగినా చట్టపరంగా శిక్షించబడతారని తల్లిదండ్రులకు సమాజంలో ఉన్న పౌరులకు సమాచారం అందిస్తూ హెచ్చరిస్తున్నట్టుగా వారు తెలిపారు. బాల కార్మికులు మండలంలో ఎక్కడ ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వారిని సమీప పాఠశాలలో చేర్పించే ప్రయత్నం చేస్తామని, ఈ సందర్భంగా మండలంలోని ప్రజలకు తెలియజేశారు. ఇంకా మండలంలో సామాజికంగా అభివృద్ధిలో భాగంగా ఎలాంటి అసమానతలు లేకుండా ఉండడానికి తమ వంతు న్యాయ సహాయం చేస్తామని తెలిపారు.



శ్రీ కోటమ్మ అమ్మ వారి 18వ వార్షికోత్సవ గోడపత్రికను ఆవిష్కరించిన ఎస్సై

నవతెలంగాణ-ములకలపల్లి

నరసాపురం గ్రామంలో వేంచేసి ఉన్న కోటమ్మ అమ్మ జాతర 13 తారీకు నుండి 15 వరకు జాతరను పురస్కరించుకొని ఎస్సై ఎం.రాజమౌళి ప్రత్యేక పూజలు నిర్వహించి గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మెన్ బజ్జూరి కృష్ణ శాలువాతో ఎస్సైని సన్మానించారు. ఈ కార్యక్రమం కమిటీ సభ్యులు గుంట్రూ సాయి బజ్జూరి, ఈశ్వర్, బజ్జూరి వినయ్, సురేష్, గ్రామస్తులు వాడే శేషగిరి, పామర్తి వెంకటేశ్వరావు, మరీదు, నాగు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంటి పరీక్షలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలంలోని పాత ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్నటువంటి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయము నందు వరంగల్ శరత్ మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచితముగా పరీక్షలు నిర్వహించి, క్యాటరాక్టు కలిగిన వారిని అదే రోజు వారి వాహనములలో వరంగల్ తీసుకువెళ్లి ఆపరేషన్ చేసి తిరిగి తీసుకురానున్నట్టు అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి.ప్రసాద్, కోశాధికారి డి.కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. క్యాటరాక్ట్ కలిగిన వారికి ఉచిత మందులు ఉచితంగా రవాణా సౌకర్యము, ఉచిత సౌకర్యం కల్పించి ఆపరేషన్లు నిర్వహించి తిరిగి భద్రాచలంలోనే కార్యాలయం వద్ద దింపుతారని తెలిపారు. ఈ కార్యాలయమునకు వచ్చినప్పుడు హెల్త్ కార్డు తప్పనిసరిగా తీసుకురావలసిందిగా కోరారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన, ఆరోగ్యశ్రీ వారికి కూడా ఉచితముగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని, సమయం ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారికి కూడా ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు.



ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

- మోరంపల్లి బంజర గ్రామంలో బడిబాట

నవతెలంగాణ-బూర్గంపాడు

నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఆ కుటుంబంలో ఉన్న పిల్లలు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగితేనే ఆర్థికంగా బలపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ అన్నారు. శనివారం మోరంపల్లి బంజర గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గ్రామ పురవీధుల్లో గ్రామ పెద్దలు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ఉన్న ప్రతి పిల్లలు పాఠశాలకు వచ్చి చదువుకోవాలని అందుకు తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను పాఠశాలకి పంపించే విధంగా చొరవ చూపాలని ఆయన అన్నారు. మారుమూల పల్లె గ్రామాలలో విద్య కుసుమాలు ఉన్నత స్థాయికి వెళ్లి అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడు తన కుటుంబంతో పాటు తమ గ్రామాన్ని కూడా అభివృద్ధి చేసుకోవడానికి విద్య తోడ్పాటు అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు ప్రధానంగా తమ తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించగలరని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, ఉమా, సుజాత, రమ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిరోమణి, ఉపాధ్యాయులు శంకర్, పద్మ, కృష్ణ, అంగన్వాడీ టీచర్లు కృపారాణి, పద్మ, అమ్మ ఆదర్శ్ పాఠశాల చైర్మెన్ చేతులు నాగమణి, తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల



నవతెలంగాణ-బూర్గంపాడు

నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు అమ్మితే పురుగు మందుల వ్యాపారులు, దళారులపైన కఠినమైన చర్యలు అధికారులు తీసుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. అదేవిధంగా ప్రభుత్వం అలాంటి వారిపైన క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలో గల పలు విత్తనాల లూజు ప్యాకెట్లు వున్న ప్రతి విత్తనాలు రైతులు కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు నెంబరు నమోదు చేసుకొని విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని ఆయన తెలిపారు. వ్యాపారస్తులు రైతుల్ని మోసం చేసి విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అమ్మితే రైతుకి ఎంత నష్టం వస్తుందో అంత నష్టపరి హారం పురుగుమందుల వ్యాపారస్తులు, దళారులు దగ్గర నుంచి ఆ రైతులకు నష్టపరిహారం అధికారులు కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో హాజరుకానున్న 8875 మంది
- అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలి
- కలెక్టర్ ప్రియాంక అల



నవతెలంగాణ-పాల్వంచ

జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాలక అనుగుణంగా జిల్లాలో పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ప్రియాంక అల ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారిగా బయోమెట్రిక్ పద్ధతిన పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. జిల్లాలో మొత్తం 8875 మంది పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందుకుగాను జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జూన్ 9న ఉదయం10:30 మధ్యాహ్నం 1:00 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్టు, ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని, 10 గంటలకు పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లుమూసివేస్తారని తెలిపారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ సంబంధించిన వస్తువులు పరీక్ష కేంద్రాల్లోనికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడవు అని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒకరోజు ముందే తమ పరీక్ష కేంద్రాన్ని తెలుసుకోవాలని, అభ్యర్థులు హాల్ టికెట్స్ టీఎస్పీఎస్సీ సైట్ నుంచి డౌన్లోడ్ వేసుకోవచ్చు అని తెలిపారు.

జోరు వాన...ఇళ్లల్లోకి చేరిన వరద

- డ్రయినేజీ లేక గ్రామస్తుల అవస్థలు



నవతెలంగాణ-చండ్రుగొండ

మండలంలోని రవికంపాడులోని మృగశిర కార్తె తొలి రోజు వర్షం పడింది. దీంతో ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలో డ్రయినేజీ లేకపోవడం వల్ల వర్షం కురిస్తే నీరు నిలవ ఉండటంతో ఇళ్లలో నుంచి ప్రజలు బయటకి రావడానికి ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. తక్షణమే నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. నీరు నిలిచి ఉంటే ఈగలు, దోమలుతో వ్యాధులు, విష సర్పాలు కూడా సంచరిస్తాయని ప్రజలు భయపడుతున్నారు. డ్రయినేజీ నిర్మించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 480 కేసులు పరిష్కారం

- లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు
- న్యాయ చైతన్య సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి



నవతెలంగాణ-ఇల్లందు

రాజీ పడదగిన కేసులలో ఇరు వర్గాల కక్షిదారులు కోర్టుకు వచ్చి రాజీ కుదిర్చుకున్నట్లయితే సత్వర పరిష్కారం లభిస్తుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. శనివారం కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. వారి విలువైన సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చునని అదేవిధంగా ఎవ్వరూ నష్టపోకుండా ఇరు వర్గాలు గెలిచినట్లేనని, ఒకసారి లోక్ అదాలత్‌లో రాజీ పడినట్లయితే పైకోర్టుకు అప్పిలు వెళ్లే అవకాశం ఉండదని తెలిపారు. అదేవిధంగా కక్షిదారులు గ్రామస్థాయిలో పంచాయతీ నిర్వహించి రాయించుకున్న అగ్రిమెంట్లు కోర్టులో చెల్లుబాటు కావని వాటికి చట్టబద్ధత ఉండదు అని కోర్టుకు వచ్చి రాజీ పడ్డ కేసుల్లో చట్టబద్ధత ఉంటుందని, కాబట్టి కక్షిదారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య రవికుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి కే.ఉమేశ్వరరావు సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తిక్, లోక్ అదాలత్ మేంబర్ సిహెచ్ నవీన్ కుమార్, సీనియర్ న్యాయవాదులు ఎస్.చెన్నకేశవరావు తుమ్మలపల్లి ప్రభాకర్, దంతాల ఆనంద్, పి.బాలకృష్ణ, వప్పుల గోపీనాథ్, ఎండి కాసిం, ఫైల జయప్రకాష్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో 480 కేసులు పరిష్కారం కాగా ఇందులో పోలీస్ కేసులు-45, గృహింస కేసులు-2, సివిల్ కేసులు-1, పిటీ కేసులు-405, ప్రీ లిటిగేషన్ కేసులు-27, మొత్తం 480 కేసులు పరిష్కరించబడ్డాయి.

పత్రికా రంగంలో అస్తమించని సూర్యుడు 'రామోజీరావు'

- లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో రామోజీరావుకి నివాళి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పత్రికా ప్రపంచంలో ఎప్పటికీ అస్తమించని సూర్యుడు రామోజీరావు అని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్ బాబు, మాగంటి రమేష్ బాబులు అన్నారు. శనివారం లిటిల్ విద్యా సంస్థల ఆవరణంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు, రమేష్ బాబులు మాట్లాడుతూ... రైతు కుటుంబంలో జన్మించి జర్నలిజంకి నూతన ఒరవడిని సృష్టించి వాస్తవాలను ప్రజలకు తెలిసే విధంగా అక్షరాలను చెక్కిన రామోజీరావు మరణం పత్రిక రంగానికి తీరని లోటు అని అన్నారు. ఒక పత్రిక రంగానికే కాక ఎలక్ట్రాన్ మీడియా రంగంలో కూడా తెలుగు గొంతుని ప్రపంచవ్యాప్తంగా చాటారని గుర్తు చేశారు. అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించిన రామోజీరావు రాజకీయాలలో కూడా కింగ్ మేకర్‌గా నిలిచారని స్పష్టం చేశారు. నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న రోజులలో హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వానికి అనేక రకాల సూచనలు, సలహాలు రామోజీరావు అందించారని, ఆ ఫలితంగానే హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందిందని వారు అభిప్రాయపడ్డారు. అనేక రంగాలలో రాణించిన రామోజీరావు అంత్యక్రియలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో చేయటం అభినందించదగ్గ విషయమని రామోజీరావు లేని లోటుని ఎవరు తీర్చలేకపోయినా ఆయన ఆలోచ నలు, ఆశయాలతో ముందుకు సాగాలని కోరారు. అనంతరం రామోజీరావు చిత్రపటానికి లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల సిబ్బంది పూలు వేసి నివాళులర్పించా రు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్‌తో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



నవతెలంగాణ-పినపాక

మండలంలోని ఈ.బయ్యారం గ్రామంలో గుర్తుతెలియని దొంగలు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేశారు. పంట పొలాల్లో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లను శనివారం గ్రామ శివారులోని ధ్వంసం చేసి అందులోని కాఫర్ వైర్‌ను చోరీ చేశారు. సమీపంలోని పంట పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలను పడేసి వెళ్లారు. సంఘటన స్థలాన్ని విద్యుత్ ఏఈ కావ్య పరిశీలించి, స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని తెలిపారు.

మినీ గురుకులం బాలికల విద్యాలయంలో సీట్ల భర్తీకి దరఖాస్తు ఆహ్వానం

నవతెలంగాణ-పినపాక

తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకులం బాలికల విద్యాలయం ఐలాపురంలో 2024-25 సంవత్సరమునకు గాను 1, 2, 5వ తరగతిలో మిగిలిన బ్యాక్లాగ్ సీట్ల ప్రవేశమునకు అర్హత కలిగిన స్థానిక గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు లైజన్ ప్రిన్సిపాల్ పద్మావతి, ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మీదేవిలు తెలియజేశారు. శనివారం మినీ గురుకులంలో వారు మాట్లాడుతూ పినపాక మండలం స్థానికత కలిగిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు. స్థానిక విద్యార్థులు లేనియెడల సమీప మండలాల విద్యార్థుల ప్రవేశమునకు రెండో ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. కావున అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు మినీ గురుకులం పినపాక నందు 11-6-2024 నుండి 18-6-2024 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేయడానికి అభ్యర్థి రెండు పాస్ ఫోటోలు, అభ్యర్థి సంతకం, ఆధార్ కార్డ్, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్ పొందుపరచగలరన్నారు. దీనికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయుట జరుగుతుందని, పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన ఉంటుందని వారు తెలియజేశారు.



7న చలో వరంగల్ ఆత్మగౌరవ కావత్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఈ నెల 7న చలో వరంగల్ ఆత్మగౌరవ కావతును విజయవంతం చేయాలని మహాజన మహిళా సమైఖ్య ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మేకల లత అన్నారు. శనివారం స్థానిక అశోక్ నగర్ కాలనీ నందు మహాజన మహిళ సమైఖ్య ఎంఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎస్.కె సల్మా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె పాల్గొని మాట్లాడారు. 7న వరంగల్ పట్టణంలో జరిగే ఎమ్మార్పీఎస్ 30 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మగౌర కవాతును జయప్రదం చేయాలన్నారు. మహాజన నేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుని జయప్రదం చేసేందుకు మహాజన మహిళా లోకం సన్నద్ధం కావాలని, వరంగల్లో జరిగే ఆత్మగౌర కవాతుకు మహాజనులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఈ కార్యక్రమంలో మహాజన మహిళ సమైఖ్య ఎంఎంఎస్ జిల్లా అధికార ప్రతినిధి తెల్లం సమ్మక్క, జిల్లా ఉపాధ్యక్షురాలు కంచర్ల కుమారి, కొప్పుల నాగమణి, రహిమ, నిర్మలమ్మ, బుర్ర నాగలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపుతో విజయోత్సవ సంబురాలు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో నిలిచిన తీన్మార్ మల్లన్న భారీ విజయం సాధించిన నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ భద్రాచలం మండల అధ్యక్షులు పరిమి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతిర్యాల రవికుమార్ మాట్లాడుతూ... సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా, సమస్యలపై స్పందించే గుణం ఉన్న కాంగ్రెస్ నేతగా తెలంగాణలో అందరికీ సుపరిచితులుగా ఉన్న తీన్మార్ మల్లన్న ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టించి అఖండ మెజార్టీతో గెలుపొందటం సంతోషకరమన్నారు. ఓట్లేసి గెలిపించిన పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయానికి కష్టపడిన కాంగ్రెస్ శ్రేణుల శ్రమ మరువలేనిదని ప్రశంసించారు. తీన్మార్ గెలుపుతో పట్టభద్రుల ఆకాంక్షల నెరవేరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తమ్మళ్ల వెంకటేశ్వరావు, బంధం శ్రీనివాస్ గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చింతిర్యాల సుధీర్, మణి, రాంప్రసాద్, కాపుల శ్రీను, బసవరాజు, మహిళా కాంగ్రెస్ సరిత, హసీనా, వసీమ, మౌనిక, జయ, సేవాదళ్ అశోక్, శీలం రామ్మోహన్ రెడ్డి, ఇన్యూసీ సింగ్ నాగేశ్వరరావు, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండె నొప్పితో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మృతి

- నివాళి అర్పించిన పలువురు





నవతెలంగాణ-ములకలపల్లి

బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పాలకుర్తి ప్రసాద్ శనివారం ఉదయం గుండె నొప్పి రావడంతో స్వగృహం పొగళ్లపల్లిలో మృతి చెందాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో ములకలపల్లి మండలంలో ఉద్యమాన్ని నడిపిన వ్యక్తి పాలకుర్తి ప్రసాద్. తెలంగాణ సిద్ధించాక మండల అధ్యక్షుడిగా పని చేసిన ఘనత ఆయనకి చెందుతుంది. ఆయన పార్థివదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య సందర్శించి, ఆయన భౌతిక కాయాన్నికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కనకయ్య మాట్లాడారు. పార్టీలకతీతంగా ఆప్యాయంగా పలకరించే వ్యక్తి పాలకుర్తి ప్రసాద్ స్నేహ శీలి, మృదుస్వభావి అన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది అన్నారు. అలాగే పాలకుర్తి ప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. మండలంలో బీఆర్ఎస్ పార్టీని దృఢంగా చేసిన వ్యక్తి పాలకుర్తి ప్రసాద్ అని, ప్రతి ఇంటికీ బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలు చేర్చిన వ్యక్తి అని అన్నారు. ఆయన లేని లోటు పార్టీకి పూడ్చలేనిదన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేసి, కుటుంబానికి అండగా ఉంటామని అని అన్నారు. నివాళులు అర్పించిన వారిలో బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగల రాజేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మొరంపూడి అప్పారావు, తెలుగుదేశం తేళ్ల చెన్నయ్య, సీపీఐ నాయకులు నరాటి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, వివిధ పార్టీ నాయకులు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, వూకంటి రవికుమార్, పువ్వల మంగపతి శనగపాటి సీతారాములు, చంద్రరావు, శనగపాటి రవి, బెక్కుమల్ల సుధాకర్, పామర్తి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, తదితరులు నివాళులు అర్పించారు.

రామోజీ రావు లేని లోటు తీరనిది : టీడీపీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఈనాడు మీడియా సంస్థల చైర్మెన్ రామోజీ రావు లేని లోటు తీరనిది అని మహబూబాబాద్ పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎస్కె అజీమ్ అన్నారు. రామోజీరావు మృతికి టీడీపీ ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుతూ... మీడియా రంగంలో నిబద్ధతతో కూడిన పత్రికా విలువలను ఆయన తీసుకొచ్చారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికల పాత్రను పెంచేందుకు రామోజీరావు చూపిన చొరవ ఆదర్శం అన్నారు. జర్నలిజానికే ఆయన వన్నెతెచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొడాలి శ్రీనివాసన్, కంభంపాటి సురేష్ కుమార్, కుంచాల రాజా రామ్, తాళ్లూరి చిట్టిబాబు, అబ్బినేని శ్రీనివాసరావు, కోనేరు రాము తదితరులు పాల్గొన్నారు.

8

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | జూన్ 09, 2024 | www.navatelangana.com



ఎన్నికలు ఏవైనా గెలుపు కాంగ్రెస్‌దే

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

నవతెలంగాణ-దమ్మపేట

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీదే గెలుపని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాచారం గ్రామంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ నల్గొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ ఉపఎన్నికలో చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న గెలిపించినందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పట్టభద్రులు, ఉద్యోగులకు జారె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ గెలుపులో సీపీఐ(ఎం), సీపీఐ, టిజెఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎంతో ప్రతిష్టంగా భావించి మల్లన్న గెలుపుకు కీలకంగా వ్యవహరించడంతో మల్లన్న అద్భుత విజయం సాధించారని అన్నారు. మల్లన్న గెలుపుకు కృషి చేసిన ప్రతీ ఒక్కరూ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రానున్న అన్ని ఎన్నికల్లో వామపక్ష పార్టీలతో పాటు ఇతర పార్టీల సహకారంతో మరిన్ని విజయాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

నవతెలంగాణ-మణుగూరు



హిందుస్థాన్ ఓవర్సీస్ ప్రయివేటు కంపెనీ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని గుర్తింపు సంఘం నాయకులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. కార్మిక వేతన చట్ట ప్రకారం వేతనాలు అడిగితే వేధింపులు చెయ్యడం, పనిలో నుండి తొలగించడం కార్మికులను రెచ్చగొట్టమే అవుతుందని అన్నారు. అనేక మార్లు విన్నవించిన మణుగూరు హిందుస్థాన్ ఓవర్సీస్ ప్రయివేటు కంపెని యాజమాన్యం పట్టించుకోకపోవడం సహనాన్ని కోల్పోయే పరిస్థితికి కారణం కావద్దని అన్నారు. రోజుకి 12 గంటలు పని చేపించడం కార్మిక చట్టానికి విరుద్ధామని అన్నారు. అలాంటి యాజమాన్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనివార్యంగ ఆరుగురి కార్మికులను తీసివేయాంపై వారు మండి పడ్డారు. వెంటనే అట్టి కార్మికులను పనిలోకి తీసుకోవాలని, లేకుంటే జరిగే నష్టానికి హిందుస్థాన్ కంపినే బాధ్యత వహించాలని అన్నారు. రక్షణ పరికరాలు లేకుండా పని చేపిస్తే జరిగే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని హెచ్చరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని లేకుంటే సమ్మె తప్పదని అన్నారు. మణుగూరు ఏరియా ఎస్ఓటు జనరల్ మేనేజర్ శ్యాంసుందర్ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు అవినాష్ జావీద్ శివ కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ, ఉద్యోగ భద్రతపై అవగాహన

నవతెలంగాణ-టేకులపల్లి

కోయాగుడెం ఉపరితల గనిలో ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పించినట్టు సింగరేణి అధికారులు శనివారం తెలిపారు. ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ ఫాటల్ ఫ్రీ జూన్ అవగాహనలో భాగంగా కోయగూడెం ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో ప్రతీ సంవత్సరం జూన్ నెలలో ఒక ఫాటల్ ఏక్సిడెంట్ జరుగుతుండేదని, గత సంవత్సరం జూన్‌లో సింగరేణి వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలతో ఎటువంటి ప్రమాదాలు లేని, జూన్ నెలను సాధించామన్నారు. ఈ సంవత్సరం కూడా ఎటువంటి ప్రమాదాలు లేని జూన్ నెల సాధించాలని, ఈ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. నా రక్షణ నా బాధ్యత, నా కుటుంబ అని నినాదం చేస్తూ ప్రతి కార్మికుడు డిస్ట్రిబ్యూషన్ అయిన తర్వాత పది రక్షణ సూత్రాలను తప్పక గుర్తు చేసుకోవాలని, తాను చేసే పని పై పూర్తి అవగాహన ఉండాలని, ఎస్ఓపీలను చదివి అవగాహన చేసుకోవాలని, సరియైన రక్షణ పరికరములను, రక్షణతో కూడిన పని విధానములను పాటించాలని, ఉద్యోగులు అందరూ కూడా రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించి సంతోషంగా ఉండాలన్నారు. రక్షనే ప్రతి వ్యక్తికి జీవన విధానం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ రాజు, గుర్తింపు సంఘ బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రతినిధ్య సంఘ సూర్యనారాయణ రాజు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణపు పనులు త్వరితగతిన ప్రారంభించాలి

- ఏజీఎంకు టీబీజీకేఎస్ వినతి

నవతెలంగాణ-మణుగూరు

పీవీ కాలనీ కార్మిక నివాసాల్లో ఉన్న రోడ్లన్నీ అధ్వాన్నంగా తయారు అయ్యాయని, రోడ్లపై గుంతలు ఏర్పడడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని త్వరితగతిన అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏరియా ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లుకి వినతి పత్రాన్ని అందించారు. అంతర్గత రోడ్ల నిర్మాణంతో పాటు వర్షాకాలం నేపథ్యంలో క్వార్టర్స్ పై భాగం నుంచి నీరు కారుతుండడంతో కార్మిక వారి కుటుంబసభ్యుల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాని నివారణకు డాంబర్ షీట్స్ పనులను వేగవంతం చేయాలని రానున్న వర్షాకాలంలో బీభత్సమైనటువంటి గాలి వానలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే క్వార్టర్లలో పెద్దపెద్ద భారీ వృక్షాలు పెరిగి గాలివానల వల్ల ఆ భారీ వృక్షాలు నివాసాల పై పడి ప్రమాదాలు జరిగి అవకాశం ఉన్నందున వాటిని తొలగించే చర్యలను త్వరితగతిన చేపట్టాలని వారు వినతిపత్రం రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిబిజికెయస్ ఏరియా నాయకులు నాగెల్లి, నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వర రావు, ముకేష్, వినయ్ కుమార్, రేవన్, పద్దం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ర్యాంపు కందకాలను పూడ్చిన 'ఇసుకసురులు'


అధికారులకే సవాళ్లు విసిరుతున్న ఇసుక అక్రమార్కులు

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలోని చింతిర్యాల గోదావరి ఇసుక రేవు నుండి గత కొన్ని నెలలుగా చింతిర్యాల కాలనీకి చెందిన కొందరు వ్యక్తులతో పాటు మరికొన్ని గ్రామాల నుండి ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలన్న ఉద్దేశంతో చింతిర్యాల గోదావరి ర్యాంపుకు జేసీబీతో పెద్ద ఎత్తున కందకాలను తీయించారు. కందకాలు తీసిన మరుసటి రోజే అక్రమ ఇసుక రవాణా దారులు మరో జేసీబీని పెట్టి కందకాలని పూర్తిగా పూడ్చివేసి యథేచ్ఛగా ఇసుక రవాణాను చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాపై సంబంధిత శాఖ అధికారులు ఎవరు పెద్ద ఎత్తున నిఘా పెట్టకపోవడంతో ఆక్రమణదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోంది.

అధికారులకే సవాళ్లు విసురుతున్న అక్రమ ఇసుక రవాణా దారులు

మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాలైన అమ్మగారు పల్లి, అమీర్ద, చింతిర్యాల గోదావరి ర్యాంపుల నుండి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందన్న సమాచారంతో గత కొన్ని రోజుల క్రితం తహసీల్దార్ స్వర్ణ తోపాటు ఆర్ఐలు రాజేశ్వరరావు, నాగమణి ఇసుక ర్యాంపులకు జేసీబీలను పెట్టి కందకాలు తవ్వించారు. అనుమతులు లేకుండా గోదావరి నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు చేపడతామని ఆదేశాలు సైతం జారీ చేశారు. ఆదేశాలను బేఖాతరు చేసిన కొందరు ఇసుక ట్రాక్టర్ల యజమానులు చింతిర్యాల ర్యాంపుకు కొట్టిన ట్రాంచును పూడ్చివేశారు. నిరభ్యంతరంగా గోదావరి నుండి ఇసుకను రవాణా చేస్తూ అధికారులకే సవాళ్లు విసురుతున్నారు. అధికారుల ఆదేశాలను బేకాతరు చేయడంతో ఆ ప్రాంతంలోని ప్రజలు అక్రమార్కుల తీరుపట్ల ముక్కున వేలేసుకుంటున్నారు. కందకాలను పూడ్చిన విషయంపై ఆర్ఐ నాగమణి వివరణ కోరగా ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆమె తెలిపారు.



కందకాలను పూడ్చిన దృశ్యం

సింగరేణి లాభాల వాటా 35% ప్రకటించాలి

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి లాభాల వాటా 30 శాతం ప్రకటించాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌టియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు తెలిపారు. శనివారం ప్రకటన విడుదల చేశారు. సీఎండి బలరాం నాయక్‌ను కలిసి ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ 2023-2024 ఆర్థిక సంవత్సరం ముగిసి రెండు నెలలు కావస్తున్నా కోడ్ మూలన ఇప్పటి వరకూ ప్రకటించని లాభాల వాటా కోడ్ ముగిసిన నేపథ్యంలో వెంటనే ప్రకటించాలని శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కలసి కోరారని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 67.13 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తే 33 వేల కోట్ల బిజినెస్ జరిగి 2222 కోట్ల లాభాలు వచ్చాయని తెలిపారు. దానిలో 32 % అంటే 711.18 కోట్ల చెల్లించారని తెలిపారు. కొత్తగా బలరాం బాధ్యతలు చేపట్టాక ఈ ఆర్థిక సంవత్సరానికి గాను కార్మికులు కష్టపడి రికార్డ్ స్థాయిలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశారని, అందుకు గాను 37 వేల కోట్ల బిజినెస్ జరిగిందని, దీనికి కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారం కూడా ఉందని, గతంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి సాధించిన కార్మికుల కోసం ఈ సారి లాభాల వాటా 35% ప్రకటించాలని కోరారు. గతంలో ఇచ్చిన లాభాల వాటాలను వివరించాలని తెలిపారు.

జర్నలిజానికి నిజమైన మార్గదర్శి రామోజీరావు

- జర్నలిస్టులు ఘన నివాళి

నవతెలంగాణ-కొత్తగూడెం



జర్నలిజానికి నిజమైన మార్గదర్శి రామోజీరావు అని, ఎంతోమంది జర్నలిస్టులను తీర్చిదిద్దిన ఘనత ఈనాడుకే సొంతమని పలువురు జర్నలిస్టులు అన్నారు. ఇమంది ఉదయ్ కుమార్ అధ్యక్షతన శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన రామోజీరావు సంతాప సభలో జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు దుద్దుకూరు రామారావు, జనుమాల రమేష్, వాహబ్, రాజేందర్, రాజేష్, నాగ చారి తదితరులు మాట్లాడారు. ఈనాడు పత్రిక అధినేత రామోజీరావు అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తుందన్నారు. ఆయన మరణం పత్రిక రంగానికి తీరని లోటు అని జర్నలిస్టులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వెంకటేశ్వర్లు, ఈశ్వర్, దశరథ రజువ, భాస్కర్, పాపారావు, కుమార్, వాసు, విష్ణు, మహేష్, నాగేశ్వరరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

లాయర్స్ యూనియన్ నివాళి

ఈనాడు అధినేత రామోజీ రావు మృతికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ప్రగాఢ సంతపాన్ని వ్యక్తం చేసింది. ఏఐఎల్‌యూ తరపున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ యాభై సంవత్సరాల క్రితం విశాఖపట్నంలో ఒక స్థానిక చిన్న పత్రికగా ప్రారంభం అయిన ఈనాడు, నాలుగేళ్ల వ్యవధిలోనే హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం కేంద్రాల నుంచి వెలువడి, లక్ష సర్క్యులేషన్ గలిగిన పత్రికగా అభివృద్ధి చెందిందని ఆయన పేర్కొన్నారు. వాడుక భాషలో వార్తలు ముద్రించడం, తాజా వార్తలు తెల్లారేలోపు పాఠకులకు చేర్చడం, వ్యక్తుల పేర్ల ముందు వెనుక అనవసరమైన గౌరవాలను తొలగించడం ఈనాడు ప్రారంభిస్తే, ఆ తరువాత అది జర్నలిజం విధానంగా మారిపోయిందని మక్కడ్ అన్నారు. ఈనాడు తొలి రోజుల్లో వామపక్ష మేధావులను, రచయితలను రామోజీరావు ఈనాడులో రిక్రూట్ చేసుకున్నారని, అభ్యుదయ భావాలతో పాఠకులను ఆకట్టుకుని పత్రికను అనతికాలంలోనే శరవేగంతో అభివృద్ధి చేసే వ్యూహంలో రామోజీరావు సఫలీకృతులయ్యారని రమేష్ కుమార్ మక్కడ్ కొనియాడారు. జర్నలిజం స్కూలు స్థాపించి మేలు రకం జర్నలిస్టులను తయారు చేయటంలో, జర్నలిస్టుల్లో నైతిక ప్రమాణాలను అభివృద్ధి చేయటంలో రామోజీ రావు కృషి చేశారని ఆయన ప్రశంసించారు. కొన్ని మినహాయింపులున్నప్పటికీ తెలుగు జర్నలిజానికి రామోజీరావు సేవలు ప్రశంసనీయమని ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సంతాపం తెలిపిన వారిలో ఏ.ఐ.ఎల్.యూ.కేంద్ర కౌన్సిల్ సభ్యులు జలసూత్రం శివరాం ప్రసాద్, కొత్తగూడెం కోర్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కటికం పుల్లయ్య, కిలారు పురుషోత్తమ రావు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

రైతు లేకపోతే మనుగడే లేదు

- డా.కృష్ణ చైతన్య స్వామి
- ప్రతి రైతు బాగుండాలని 32 రోజులుగా కఠోర దీక్ష
- అనేక దివ్యక్షేత్రాల మట్టిని సేకరించి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఆయన ఓ సాధారణ పూజారి. కానీ సమాజం కోసం ప్రతి నిత్యం శ్రమించే మహర్షి. వారే డా.కృష్ణ చైతన్య స్వామి. రైతులు బాగుండాలని గత కొన్ని సంవత్సరాలనుండి మృగశిర కార్తె నాడు అనేక దివ్య క్షేత్రాల నుండి మట్టిని సేకరించి, ఆ మట్టికి ప్రత్యేక పూజలు చేసి రైతులకు ఏరువాక పౌర్ణమి నాడు అందించి, వారికి మంచి పంటలు పండాలని దీవిస్తున్నారు. ఈ సందర్భంగా చైతన్య స్వామి శనివారం మాట్లాడారు. రైతు బాగుంటే లోకంబాగుంటుందని, అందుకే ప్రతి సంవత్సరం రైతు శ్రేయస్సు కోసం మృగశిర కార్తె నుండి ఏరువాక పౌర్ణమి వరకు పుణ్యక్షేత్రాల నుండి తెచ్చిన మట్టికి ప్రతిరోజు భూవరాహ పూజ చేసి ఆ మట్టిని ఏరువాక పౌర్ణమి నాడు రైతులకు అందజేస్తున్నామని అన్నారు. ఈ సంవత్సరం లక్షల మంది రైతులకు ఈ దివ్య ప్రసాదాన్ని అందించాలని నృసింహ సేవా వాహిని ఆకాంక్ష, ఎందుకంటే ఈ మధ్య కాలంలో రైతన్నల ఘోస వర్ణనాతీతంగా ఉన్నదని, పంటలు పండక ఒకరు పండించిన ఆ కొద్ది పంటలకు సరైన గిట్టుబాటు ధరలు రాక ఆర్థిక ఇబ్బందులతో మరొకరు ఇలా ఎంతో మంది రైతన్నలు పంట పొలంలోనే ప్రాణాలు వదులుతున్నారన్నారు. ఇకమీదట రైతన్నల కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని, రైతుకు మంచి రోజులు రావాలని, రైతే రాజు అన్న నినాదం నిజం కావాలని నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం ఈ మహోత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డా.కృష్ణ చైతన్య స్వామి, శ్రీధర్ శర్మ అర్చకులు, నృసింహ సేవా వాహినిసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్


నవతెలంగాణ-కొత్తగూడెం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బీఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో హామీ ఇచ్చిందన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీ రిజర్వేషన్లను 29 శాతం నుంచి 50 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ నాయకులు వాగ్దానం చేశారన్నారు. కానీ, ప్రభుత్వం కులగణన అంశాన్ని, రిజర్వేషన్ పెంపును పరిగణనలోకి తీసుకోకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించాలని చూస్తోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు జనాభా ప్రాతపదికన పెంచే ప్రక్రియ చేపట్టాలని దానికనుగుణంగా నిధులు కేటాయించాలని కోరారు. బీసీ లంతా పార్టీలకు, కులాలకు అతీతంగా ఏకమై బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించాలనే ఆలోచన విరమించుకోవాలని, బీసీ కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంగా రవిశంకర్, సందేల సందీప్, తాటిపాముల హరికృష్ణ, సమీర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రుచిని, అభిరుచిని ప్రపంచానికి చాటిన రామోజీ

- పలువురు సంతాపం

నవతెలంగాణ-అశ్వారావుపేట



ప్రియా పచ్చళ్ళతో తెలుగు రుచిని, ఈనాడు పత్రిక ప్రచురణతో తెలుగు అభిరుచిని ప్రపంచానికి చాటిన రామోజీ తెలుగు మహనీయుల్లో చరితార్థుడు అని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు పుల్లయ్య అన్నారు. ఈనాడు గ్రూప్ అధినేత రామోజీ రావు మృతికి శనివారం పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. స్థానిక ఈనాడు విలేకరి పాశం రామారావు ఆధ్వర్యంలో మండల పరిషత్ పూర్వ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పుల్లయ్య మాట్లాడారు. తన సంస్థలో అనేక మందికి ఉపాధి కల్పించడమే కాకుండా సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సలీం, రామక్రిష్ణ, టీఆర్ఎస్ నాయకులు యుఎస్ ప్రకాశరావు, చిన్నంశెట్టి సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు తలసిల ప్రసాద్, సీనియర్ విలేకర్లు సీమకుర్తి శ్రీనివాసరావు, మడిపల్లి వెంకటేశ్వరరావు, వలీ పాషా, భాస్కర్, వెంకటేష్, నాగబాబు, అప్పారావులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

మండల నాయకులు మొగళ్ళపు చెన్నకేశవ రావు మాట్లాడుతూ ఈతరం అక్షర యోధుడిని కోల్పోయాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్కే పాషా, సత్యవరుపు బాలగంగాధర్, ప్రచార కార్యదర్శి జల్లిపల్లి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం రూరల్ ఈనాడు సంస్థల అధినేత మృతి పట్ల టీయూడబ్ల్యూజేజేయు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పత్రికా అక్షరానికి కొత్త పుంతలు నేర్పిన రామోజీరావు మన నుండి భౌతికంగా దూరం కావడం బాధాకరమన్నారు. ఈనాడు సంస్థల ద్వారా అక్షరాలు జులిపిస్తూ ప్రజలను చైతన్యపరిచారని ప్రజలకి ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ వ్యవస్థలో సానుకూల మార్పులు తెచ్చేందుకు కృషి చేశారని అభిప్రాయపడ్డారు. ఈనాడు పత్రికను స్థాపించి వేలాదిమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. జర్నలిజం వృత్తికి వన్నెతెస్తూ నిష్పక్షపాతంగా పత్రికాముఖంగా అన్యాయాలను ఎదిరిస్తూ ముందుకు సాగడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు.

చండ్రుగొండ ఈనాడు పత్రికాధిపతి, పద్మవిభూషణ్ రామోజీరావు అకాల మరణం పట్లకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దారం గోవింద రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా గోవింద్ రెడ్డి మాట్లాడుతూ ఆయన మృతి పత్రికా రంగానికి తీరని లోటన్నారు. పత్రికాధిపతిగా, ఈటీవీ వ్యవస్థాపకులుగా, సినీ నిర్మాతగా, ఫిల్మ్ సిటీ అధినేతగా ఆయా రంగాలలో నూతన ఒరవళ్లు తీసుకువచ్చి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నిరంతర శ్రమ, కార్యదీక్ష, నిబద్ధత, క్రమశిక్షణకు రామోజీరావు నిలువెత్తు నిదర్శనం అన్నారు. పత్రికా, టీవీ, సినిమా, వ్యాపార రంగాలలో ఆయన సాధించిన విజయాలు తెలుగు జాతికి గర్వకారణమని, రామోజీరావు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా అనేక పురస్కారాలు పొందారని, భారత ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో గౌరవించిందని తెలిపారు. ఆయన కుమారుడు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులు

- 3 ఆటోలు, ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం

నవతెలంగాణ-కొత్తగూడెం



వాహనాలను దొంగిలించే ముఠాను కొత్తగూడెం పోలీసులు పట్టుకున్నారు. వారి నుండి మూడు ఆటోలు, ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో వాహన తనిఖీల నిర్వహణలో భాగంగా అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తుండగా ఒక కారు అనుమానాస్పదంగా కనిపించడంతో అందులో ఉన్నవారిని అదుపులోకి తీసుకుని కొత్తగూడెం వన్ టౌన్ సీఐ కరుణాకర్ విచారించినట్లు తెలిపారు. కారులో ఉన్న ఏడుగురు వ్యక్తులను విచారించగా వీరు దొంగతనాలు చేస్తుంటారని తేలింది. ఈ ముఠాలో విఎం. బంజరు, పెనుబల్లికి చెందిన గోపి, శ్రీను అను వ్యక్తులు విద్యానగర్ కాలనీ, చుంచుపల్లిలో నివాసం ఉంటున్నారు. విఎం.బంజరకు చెందిన ముత్తారావు, శివరాం, కొటయ్య, గద్దల శివ, లక్ష్మణరావులతో ముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెంలో ఇళ్ల ముందు ఉన్న ఆటోలను, బైకులను, కార్లను దొంగిలించి అమ్ముకుని వచ్చిన సొమ్మును అందరూ పంచుకునేవారని తెలిపారు. ఇలా కొత్తగూడెంకు చెందిన ఒక ఆటోను అమ్మేందుకు వచ్చి పట్టుబడినట్లు వివరించారు. వీళ్ళు అందరూ కార్లలో తిరుగుతూ దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకున్నారని అన్నారు. వీరందరినీ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. పట్టుబడిన వీరివద్ద నుండి ఒక కారు, మూడు ఆటోలు, ఒక బైకును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మృగశిరతో చేపల దుకాణాల వద్ద సందడి

నవతెలంగాణ-అశ్వాపురం

మృగశిర కార్తె రావడంతో శనివారం మండలంలో చేపల దుకాణాలు సందడి చేశాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు దుకాణాల వద్ద చేపల ప్రియులు పెద్ద ఎత్తున బారులు తీశారు. మృగశిర కార్తెలో చేపలు తినాలని ఓ ప్రత్యేకత ఉండడంతో దుకాణదారులు డైలీ రూ.160 ఉన్న కిలో చేపల ధర ఒకసారి రూ.200కు చేరింది. అయినా సరే చేపలు కొనడంలో జనం వెనకాడ లేదు. మృగశిర రోజున చేపలు తింటే ఎన్నో ఔషధ గుణాలుంటాయన్న ఉద్దేశంతో ప్రజలు పెద్ద ఎత్తున చాపలను కొనుగోలు చేశారు.

చండ్రుగొండ వానకాలం ప్రారంభ కార్తె అయినటువంటి మృగశిరకార్తెను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా చేపల విక్రయాలు జోరుగా సాగాయి. శనివారం ఉదయం నుండే చేపలను వ్యాపారులు తీసుకొచ్చి, గ్రామాల్లోని ప్రధాన సెంటర్, కూడళ్లల్లో విక్రయాలు చేపట్టారు. కిలో చేపలు రూ.150లు నుండి రూ.180ల వరకు విక్రయాలు జరిపారు. మృగశిర కార్తెకు కచ్చితంగా చేపలను తినాలనే ఆచారంగా వస్తుండటంతో రైతులు, అన్ని వర్గాలు ప్రజలు కొనుగోలు చేశారు. మృగశిరకార్తె ప్రారంభ రోజున పండుగలా జరుపుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | జూన్ 09, 2024 | www.navatelangana.com

నిత్య కృషి వలుడు.. అక్షర యోధుడు రామోజీరావు

- టీయుడబ్ల్యూజే (ఐజేయు) ఘన నివాళులు
- ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సంతాప సభ

నవతెలంగాణ-ఖమ్మం

నిత్య కృషి వలుడు.. అక్షర యోధుడు రామోజీరావు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన వ్యక్తి కాదు ఒక శక్తి అని అన్నారు. సమాజంలో చైతన్యం, సామాజిక సేవ, ఆయన ఏ పని చేపట్టిన అందులో కొత్త వరవడి సృష్టించారన్నారు. ఈనాడు పత్రిక అధినేత రామోజీరావు అకాల మరణం పట్ల టీయుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఆయన మృతికి నివాళులర్పిస్తూ ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో సంతాప సభ ఏర్పాటు చేశారు. రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంతాప సభలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టేకొల రామనారాయణ మాట్లాడారు. నిత్య కృషి వలుడు.. అక్షర యోధుడు రామోజీరావు అని కొనియాడారు. రామోజీ అంటే ఒక నమ్మకం, ఒక విశ్వాసమన్నారు. ఖమ్మంలో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమ సభలో రామోజీరావు పాల్గొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన ఒక సంఘ సంస్కర్త అని కొనియాడారు. టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటేటి వేణు, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు నలజాల వెంకట్రావు, ఖమ్మం నగర అధ్యక్షులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మైస పాపారావు, , జిల్లా నాయకులు గోగిరెడ్డి శ్రీనివాస రెడ్డి ,యన్ శివ కె. గోపి, మొయినుద్దీన్, నామ పురుషోత్తం, కె వెంకటేశ్వర్లు, కళ్యాణ్ చక్రవర్తి, నాగేందర్ రెడ్డి, మధులత, ఈనాడు సీనియర్ పాత్రికేయులు అర్జున్ సింగ్ మాట్లాడారు. రామోజీరావు సేవలు, ఈనాడు అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శివ, భూపాల్, వేణు, ఈనాడు విలేకరులు లాల, శేష వర్ధన్ రెడ్డి, ఉపేందర్(ఈటీవీ), పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు ఘన నివాళి

కల్లూరు : రామోజీరావు మృతికి కల్లూరు కమ్మ సేవ సంఘం ఆధ్వర్యంలో పట్టణ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, కాకర్ల రంగారావు, జాస్తి శ్రీనివాసరావు, చిట్టిబాబు, కట్టా గోపాలరావు, కృష్ణమూర్తి, రమేష్ బాబు, శిరీష, చాలా శ్రీనివాసరావు, మద్దినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో పలు సమస్యలు పరిష్కరించాలి

కంపెనీ కమిటీ కార్యదర్శి ఎం.ప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం

విద్యుత్ శాఖలో పలు డిమాండ్లు పరిష్కరించాలని దశలవారీగా ఆందోళనలు చేయుచున్న తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధ కార్మిక సంఘం ఈనెల 10వ వరంగల్ గౌరవ సీఎండీని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశామని కంపెనీ కమిటీ కార్యదర్శి ఎం.ప్రసాద్, జిల్లా అధ్యక్షులు బి.పుష్ప రాణి, కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. డిస్కాం చైర్మెన్‌లకు, ట్రాన్స్కో సీఎండీకి 14 దరఖాస్తులు సమర్పిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కారం కానీ పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్పీడీసీఎల్ పరిధిలో ఆగిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలని, ఖాళీలు భర్తీ చేయాలని, డిఏ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని విద్యుత్ ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయాలని సబ్ స్టేషన్‌లలో తక్కువ సిబ్బంది పని చేయుచున్నారని, వారి స్థానంలో సిబ్బందిని నియమించాలని, గృహ జ్యోతి వల్ల ఉపాధి కోల్పోయిన ప్రయివేట్ విద్యుత్ బిల్లు కలెక్టర్లను ఆదుకోవాలని, మీటర్ రీడర్లు, ఎస్పీఎం, స్టోర్ హమాలీ కార్మికులకు కనీస వేతన చట్టం కింద జీతాలు చెల్లించాలని కోరుతూ డిమాండ్ల పత్రాన్ని అందజేశామని తెలిపారు.

అన్నదానానికి 5 వేలు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కల్లూరు

పట్టణ పరిధిలోని ఆర్.సి.యం చర్చి ప్రాంగణంలో జరిగే ఉపవాస ప్రార్థనలో పాల్గొనే భక్తులకు, ప్రార్థన అనంతరం జరిగే అన్నదాన కార్యక్రమానికి లక్కినేని రమేష్ 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. నిరుపేదలను ఆదుకునే విషయంలో ఎటువంటి అవసరం ఉన్నా ముందుంటానన్నారు.

నేడే జేసీజె మోడల్ టెస్ట్

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు)రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ సివిల్ జడ్జి రాసే న్యాయవాదుల కోసం ఈ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఐలు ఖమ్మం జిల్లా ఇన్‌చార్జీ సెక్రెటరి, జిల్లా అధ్యక్షులు మీసాల వెంకటేశ్వర్లు, నల్లమల నవీన్ చైతన్య ఒక ప్రకటన లో తెలిపారు. కావునా ఆదివారం ఉదయం 10గంటలకు ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్ ఈ టెస్ట్ జరుగుతుందని, జేసీజె ఎగ్జామ్స్ రాసే న్యాయవాదులు ఈ జేసీజె మోడల్ టెస్టలో పాల్గొని విజయ వంతం చేయాలని వారు కోరారు.

బదిలీ అయిన 9 నెలల తర్వాత రిలీవ్

నవతెలంగాణ-కల్లూరు

గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టగా స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. కానీ బదిలీ అయిన స్థానానికి టీచర్ రాకపోవడంతో రిలీవ్ కాలేకపోయారు. వరస ఎన్నికలు, ఎన్నికల కోడ్ రావటం, బదిలీల ప్రక్రియ నిలిచిపోవడంతో పాత స్కూల్లోనే కొనసాగాల్సి వచ్చింది. కోడ్ ముగిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిచిపోయిన బదిలీలు పదోన్నతులు వెంటనే చేపట్టాలని షెడ్యూల్ విడుదల చేయడంతో శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు టీచర్లు రిలీవ్ అయ్యారు. అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఐదుగురు, చంద్రుపట్లలో ఇద్దరు, ఎర్రబోయినపల్లి పాఠశాలలో నలుగురు, చిన్న కోరుకొండి పాఠశాలలో ఇద్దరు, పేరు వంచ, వెన్నవల్లి, చెన్నూరు ఉన్నత పాఠశాలలో ఒక్కొక్కరు రిలీవ్ అయ్యారు. దీంతో మొత్తం 21 మంది ఉపాధ్యాయులు మండలం నుండి రిలీవ్ అయి కొత్త పాఠశాలలకు వెళ్లారు. అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రిలీవింగ్ ఆర్డర్స్ అందజేశారు.

దుమ్ముగూడెం గ్రామంలో భారీ చోరీ

- రూ. 5 లక్షల రూపాయల విలువ చేసే బంగారం, 57 వేల నగదు చోరీ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. బైరెడ్డి భాను కిరణ్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించి ఆ ఇంట్లో చొరబడి సుమారు 5 లక్షల కు పైగా బంగారం, సుమారు 20 వేల రూపాయల విలువ చేసే వెండి, 57 వేల రూపాయల నగదు దొంగిలించుకు వెళ్లారు. బాధితులు భాను కిరణ్ అదే రోజు శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తన భార్యతో కలిసి హైదరాబాద్ వెళ్ళిన విషయాన్ని గుర్తించిన దుండగులు ఓ పథకం ప్రకారం బాధితులు ఇంటిని విడిచిపెట్టిన కొన్ని గంటల వ్యవధిలోనే భారీ చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత ఇంటి ప్రహరీ గోడ దూకి లోపలికి వెళ్లిన దుండగులు ఇంటి తాళాలను పగులుగొట్టి లోపలికి ప్రవేశించి, రెండు బీరువా లను గుణపాలతో తాళాలు పెకలించి అందులో ఉన్న బంగారు ఆభరణాలు 20 గ్రాముల బంగారు చైను., 9 గ్రాముల రెండు బంగారు ఉంగరాలు, నాలుగు గ్రాముల మరో బంగారపు ఉంగరం, ఐదు గ్రాముల బంగారపు నల్లపూసల గొలుసు, చైను ,లాకెట్టు 9 గ్రాములు బంగారపువి, చెవి జుంకాలు బంగారుపువి నాలుగు గ్రాములు , తొమ్మిది గ్రాముల బంగారపు మూడు ఉంగరాలు, వెండి లాకెట్ పట్టీలు, తాళాల గుత్తి సుమారు 20 గ్రాములవి దొంగిలించుకు వెళ్లారు. వెండి వస్తువులు ఎక్కువగానే ఉన్నప్పటికీ కొంత వెండి వస్తువులను మాత్రం తస్కరించి మిగిలిన వాటిని అక్కడే వదిలి వెళ్లారు. శనివారం ఉదయమే బాధితుడు భాను కిరణ్ స్నేహితుడు ఉదయమే అటుగా వెళ్లి చూడగా, తలుపులు పగలగొట్టి ఉండడానికి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. క్లూస్ టీం వచ్చి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు సిఐ బోర్డు అశోక్ సంఘటన వివరాలను తెలుసుకొని చేస్తున్నారు.

వృధాగా తాగునీరు

- ఏండ్లు గడుస్తున్నా కనిపించటం లేదా

నవతెలంగాణ-వేంసూరు



మిషన్ భగీరథ నీరు వృధాగా సంవత్సరాల నుండి ప్రధాన రహదారిపై వరద ప్రవహిస్తున్న సంబంధిత అధికారులకు కనిపించడం లేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలోని వెన్నచేడు వెంకటాపురం సెంటర్‌లో విజయవాడ ప్రధాన రహదారిపై పైపులు లీకై తాగునీరు వృధాగా కొన్ని ఏళ్లగా పోతున్నాయి. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డుకు గుంతలు పడుతున్నాయి. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తాగునీరు రోడ్డు పాలవుతుందని పలుమార్లు పంచాయతీ దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవటం లేదని స్థానికులు అంటున్నారు. లీకైన నీరు రోడ్డు మలుపు మీద ప్రవహించడంతో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వృధాగా పోతున్న తాగునీటిని, వాహనాల ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే విజేతలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



ప్రజాస్వామ్యంలో ప్రజలే విజేతలని మరోసారి రుజువైందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండలం కమిటీ సమావేశం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు పి.మోహన్ రావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నున్నా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికై నియంతల్లా, రాజ్యాధిపతుల్లా పాలిస్తే ఎన్నికల్లో ప్రజలు తగు రీతిలో గుణపాఠం చెబుతారన్నారు. తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రాలో జగన్, కేంద్రంలో నరేంద్ర మోదీ తమను తాము చక్రవర్తుల్లా, నియంతలుగా భావిస్తూ అప్రజాస్వామిక పద్ధతుల్లో పాలించబట్టే ప్రజలు ఎన్నికల్లో సరైన సమాధానం చెప్పారన్నారు. కేంద్రంలో మోడీ చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు అధికారంలోకి వచ్చాడని, తెలుగు రాష్ట్రాల వల్లనే మరోసారి మోదీ అధికారం చేపడుతున్నారని వివరించారు. ప్రజల ద్వారా ఎన్నుకున్న పాలకులు ప్రజలకు సేవలు చేయాలి కానీ, ప్రజల గొంతు నొక్కడం, ప్రతిపక్ష పార్టీలను అణచివేయాలని చూడడం చేస్తే ప్రజలు తిరగబడతారని అది ఎన్నోసార్లు ఆచరణలో రుజువైందని తెలిపారు. ఎమర్జెన్సీ విధించిన ఇందిరాకు, ధర్నా చౌక్ లు ఎత్తేసిన కేసిఆర్ కు, ప్రజలను, ప్రతిపక్ష పార్టీలను హింసించిన జగన్ కు, రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన మోడీకి ప్రజలు తగురీతిలో గుణపాఠం చెప్పారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన పాలకులైన ప్రజలను ఆదరించాలని, ప్రతిపక్ష పార్టీలను గౌరవించాలని, ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపిన ప్రతిపక్ష పార్టీల నాయకులపై తప్పుడు కేసులు పెట్టకుండా పాలన సాగించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలు తగురీతిలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. మోడీ సంస్కారవంతుడైతే ప్రధాని పదవిని చేపట్టకుండా ఇంకొకరికి కట్టబెట్టాలని తెలిపారు. బీజేపీ ఒంటరిగా అధికారంలో రాకపోవడంతో ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం తప్పిందని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు బుద్ధి తెచ్చుకొని జనరంజక రీతిలో పాలన అందించాలని కోరారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసే ఎర్రజెండాలపై అబద్ధాలు, దుష్ప్రచారాలు, ఎన్ని కుట్రలు పన్నిన ప్రజల నుంచి ఎర్రజెండాను దూరం చేయలేరన్నారు. రాబోయే రోజుల్లో ఎర్రజెండాకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, మండల ఇన్‌చార్జ్ ఉరడీ సుదర్శన్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నెకంటి సంగయ్య, నందిగామ కృష్ణ, రంజాన్ పాషా, మండల కమిటీ సభ్యులు ధనియాకుల రామయ్య, తాటి వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటరమణ, కారుమంచి గురవయ్య, వడ్లమూడి నాగేశ్వరరావు, భూక్య కృష్ణ, చిలువేరు బాబు, ఏటుకూరి ప్రసాదరావు, నంబూరి మంగ తదితరులు పాల్గొన్నారు.

గిరిజలకు విద్యా, వైద్యం ఉపాధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి

- 10న ఖమ్మం 3 టౌన్‌లో జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి
- తెలంగాణ గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మనాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం



నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలో అన్ని రకాలుగా వెనకబడ్డ గిరిజనుల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం.ధర్మానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆన్‌లైన్‌లో జిల్లా అధ్యక్షులు బాణోతు బాలాజీ అధ్యక్షతన జరిగినది. గిరిజన తండాలో ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించి తగిన స్థాయిలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులకు ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లీష్ విద్య అందించాలని కోరారు. గురుకులల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి గిరిజన విద్యార్థులకు సీట్లు ఇవ్వాలని, విద్యా సంస్థలో ఉన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలో గత సంవత్సరం గిరిజన సంఘం చేసిన సర్వేలో అనేక సమస్యలు వెలుగులో వచ్చాయని వాటిని గత ప్రభుత్వం పరిష్కరించలేదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్య అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని నకిలీ విత్తనాలు అరికట్టి గిరిజన రైతులకు పూర్తిస్థాయి సబ్సిడీలో విత్తనాలు సరఫరా చేయాలని, గిరిజన తండాలో అంటురోగాలు వ్యాప్తించకుండా వైద్యం ప్రతి గిరిజనుడికి అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈనెల 10న గిరిజన సంఘం జిల్లా విస్తృత సమావేశం ఖమ్మం 3 టౌన్ ప్రాంతంలో జరుగుతుందని సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస్ నాయక్, బానోతు బన్సిలాల్ భూక్యా కృష్ణ నాయక్, అజ్మీరా శోభన్ నాయక్, బాధావత్ శ్రీను, తేజావత్ కృష్ణ కాంత్, బానోతు హరిచంద్, మూడ్ గన్యా నాయక్, గుగులోత్ వీరు నాయక్, పాల్గొన్నారు.

'ఆస్పత్రిలో వైద్య సేవలన్నీ ప్రయివేట్ మయం'

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లా ఆసుపత్రి ప్రధాన ఆసుపత్రి వైద్య సేవలు అన్ని ప్రైవేట్ మయం అయ్యాయని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు, కెఎ స్.ప్రదీప్, పిఓడ బ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.శిరోమణి ఆరోపించారు. శనివారం ఖమ్మంలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో పివైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ఆస్పత్రి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సమస్యలు వెలుగులోకి బీకాంప్లెక్స్, పారాసెటమ్ల్, దగ్గు, జలుబు టాబ్లెట్స్ సెలెన్స్ బాటిల్స్, ఓఆర్ఎస్‌లు తప్ప మిగతా అన్ని రకాల యాంటీ బయాటిక్ టాబ్లెట్స్ ప్రవేట్ ఫార్మసీలతో కుమ్మక్కై దోపిడీ చేస్తున్న చూసి చూడనట్టు సూపరింటెండెంట్, డిఎంహెచ్ఓ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్కానింగ్ రేడియాలజిస్ట్ లేడని పేరుతొ రోజుకి 50 మందిని మాత్రమే స్కానింగ్ తీసి, అత్యవసరమైతే బయట తీయించుకొని రండి అంటూ ప్రైవేట్ ల్యాబ్ లకు సిబ్బంది పంపిస్తున్నారని ఆరోపించారు. రోడ్డు ప్రమాదాలు జరిగి హాస్పటల్‌కి వస్తే తలకి దెబ్బలు తగిలితే ఒక్కరోజు గడిస్తే గాని స్కానింగ్ తీసే పరిస్థితి లేదని, రేడియాలజిస్ట్ లేడనే కారణంతో రోజుకి 50 నుండి 100 కేసులకు మాత్రమే స్కానింగ్ తీసి మిగతా వాళ్ళని రేపు రండి లేదంటే బయట ప్రైవేట్ ల్యాబ్‌లలో తీయించుకోండి. హాస్పటల్ నుండి ప్రైవేటు హాస్పిటల్‌కి పొమ్మను లేకపొగ పెట్టినట్టు బలవంతంగా వెళ్లగొడుతున్నారని, పరిశుభ్రత, శానిటేషన్, తుతూ మంత్రంగా నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు గోకినపల్లి లలిత, రాష్ట్ర నాయకులు ఝాన్సీ, శోభా, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకేష్, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐటీలో ముగిసిన పైథాన్ శిక్షణ

నవతెలంగాణ-ఖమ్మం

ఈ దశాబ్దంలో పైతాన్‌పై అవగాహన ఉన్నవారు రాణించగలరని ఎస్బీఐటీ కళాశాల చైర్మెన్ గుండాల కృష్ణ అభిప్రాయపడ్డారు. శనివారం ఖమ్మంలోని కళాశాలలో గత 5 రోజులుగా జరుగుతున్న పైథాన్ శిక్షణా కార్యక్రమాలు ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ కృష్ణ మాట్లాడుతూ కంప్యూటర్ విద్య శాసిస్తున్న ఈ తరుణంలో పైతాన్ ప్రోగ్రామింగ్ అత్యంత కీలకమని, పైతాన్‌పై అవగాహన ఉన్నవారు అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరన్నారు. ట్రైనింగ్స్, ప్రాంగణ నియామకాలకు ఎక్కువగా పైతాన్, జావా వంటి కోర్సులపై అవగాహన తప్పనిసరి అని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బి.ధాత్రి తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు గత 5 రోజులుగా పైతాన్‌పై శిక్షణ నిస్తున్నట్లు, తద్వారా రానున్న ప్రాంగణ నియామకాలకు వారిని సిద్ధం చేస్తునట్లు తెలిపారు. ఈ వార్షిక సంవత్సరంలో ఇప్పటికే 430 పై చిలుకు నియామకాలను తమ విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీ. రాజుకుమార్ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అత్యంత ఆదరణ కలిగిన కోర్సులకు పైతాన్ ప్రోగ్రామింగ్ మూలమని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణను అందించిన కే. శేషసైన్ ని వారు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.అమిత్ బింధాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎవీవీ. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, డాక్టర్ జె. రవీంద్రబాబు, డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, విభాగ అదిపతి టి. గంగాధర్, టిపిఒ ఎస్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఆశలకు అనుగుణంగా నోటిఫికేషన్లు

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్

నవతెలంగాణ-కారేపల్లి



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై యువత పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం కారేపల్లిలోని కాంగ్రెస్ నాయకులు ఎండీ.యాకూబ్ అలీ ఇంట్లో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ పాలన, ఆపార్టీ నాయకుల ఆగడాలపై తీన్మార్ మల్లన్న నిలదీసి,ప్రశ్నించారన్నారు. మల్లన్న విజయం ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు మిత్రపక్షాలైన సీపీఐ, సీపీఐ(ఎం), టీజేఎస్, టీడీపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పని చేసిన ఫలితంగా సునాయస విజయం సాధ్యమైందన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కారేపల్లి, తులిశ్యాతండాలలో ఇటీవల మృతి చెందిన జవ్వాజి కౌసల్య, పాల్తియా ద్వాళి సంస్మరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈకార్యక్రమంలో పీసీసీ మహిళ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి వీరప్రతాప్, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సురేందర్‌మనియార్, జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, బానోత్ రామ్మూర్తి, సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ ఎండీ.హనీఫ్, నాయకులు దారావత్ భద్రునాయక్, గుగులోత్ భీముడు, గుగులోత్ శ్రీను, వాంకుడోతో గోపాల్, మల్లెల నాగేశ్వరరావు, దారావత్ వినోద్, సపావట్ నాగులు, పొలగాని శ్రీనివాస్, గడ్డం వెంకటేశ్వర్లు, వాంకుడోత్ నరేష్, గుగులోత్ మంగ్యా, గుగులోత్ హర్షనాయక్, షేక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ప్రజ్ఞావంతున్ని కోల్పోయింది

- రామోజీకి నివాళులర్పించిన పువ్వాడ

నవతెలంగాణ-ఖమ్మం



విభిన్న రంగాలలో అసమాన్య ప్రతిభ చూపిన ప్రజ్ఞావంతుడు రామోజీరావు మరణంతో తెలుగుజాతి ఒక ప్రజ్ఞావంతున్ని, మార్గదర్శిని కోల్పోయిందని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. రామోజీ లేనిలోటు పూడ్చలేనిదని, ఆయన ఓ తరం గుర్తుంచుకోతగిన వ్యక్తి అన్నారు. శనివారం రామోజీరావు మృతదేహాన్ని సందర్శించి సతీమణి పువ్వాడ విజయలక్ష్మితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలతో అంచెలంచులుగా ఎదిగి ఒకవ్యవస్థను నిర్మించారని పువ్వాడ తెలిపారు. ముఖ్యంగా మీడియా రంగంలో ఈనాడు ద్వారా అనేక సమస్యల పరిష్కారానికి రామోజీరావు కారకుడయ్యారన్నారు. సమాజం పట్ల అవగాహన కలిగి ఒక సంస్కర్తగా ఆయన వ్యవహరించారని తెలిపారు. మీడియా ద్వారా అత్యంత గుర్తింపు పొందిన వ్యవక్తులలో రామోజీ ప్రథముడని, అదే రీతిలో సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం అత్యుత్తమ సినిమాలు నిర్మాంచారని, ఆసియాఖండంలోనే ప్రసిద్ధి చెందిన రామోజీఫిల్మ్ సిటీని నిర్మించారన్నారు. రామోజీరావు తెలుగుజాతి ఉన్నంత కాలం గుర్తుండి పోతారాన్నారు. పువ్వాడ వెంట మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, భార్య వసంతలక్ష్మి ఉన్నారు.

రామోజీ వ్యక్తికాదు ఓ వ్యవస్థ

సీపీఐ నేత బాగం హేమంతరావు

రామోజీరావు అంటే ఒక వ్యక్తి కాదని ఒక వ్యవస్థ అని, తన అపారత్మమైన ప్రతిభతో అత్యున్న శిఖరాలకు చేరుకున్నారని సిపిఐ జాతీయ సమితిసభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శనివారం చెరుకూరి రామోజీ రావు సంతాపసభ స్థానిక గిరిప్రసాద్భవన్లో నిర్వహించారు. రామోజీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జింతేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్. పీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, జిల్లా నాయకులు గాదె లక్ష్మినారాయణ, చెరుకుపల్లి భాస్కర్, పీ.మోహన్‌రావు, మేకల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతికి జిల్లా కాంగ్రెస్ కమిటీ సంతాపం

తెలుగు పత్రికా దిగ్గజం, ఈనాడు గ్రూప్స్ అధినేత, పద్మవిభూషణ్ గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 11,298 కేసులు పరిష్కారం

- రూ.1.47 కోట్ల పరిహారం

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ఆధ్వరంలో శనివారం జిల్లా వ్యాప్తంగానిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో11,298 కేసులు పరిష్కారమయ్యాయు. ఈ లోక్ అదాలత్ నిమ్మిత్తం 7 లోక్ అదాలత్ బెంచ్‌లను న్యాయసేవా సంస్థ కార్యదర్శి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జీ కెవి. చంద్రశేఖర్‌రావు ఏర్పాటు చేశారు. మొదట అదనపు జిల్లా జడ్జి కె.ఉమాదేవి 67 రోడ్డ్ ప్రమాద నష్ట పరిహార కేసులను పరిష్కరించారు. 244 విద్యుత్ శౌర్యం కేసులను పరిష్కరించారు. బాధితులకు 1.47 కోట్ల పరిహారం అందించారు.ప్రధాన జూనియర్ సివిల్ జడ్జీ కె.దీప 76 కేసులను పరిష్కరించారు. మొదటిఅదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రజని 235 క్రిమినల్ కేసుల తో పాటు71 సైబర్ క్రైం కేసులను పరిష్కరించారు. రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జీ వై. బిందుప్రియ 1948 కేసులను పరిష్కరించారు. మూడవ అధనపు జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి 216 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. మొబైల్ కోర్టుకి సంబంధించన 418 కేసులను ఎక్సైజ్ కోర్టు 66 కేసులను న్యాయ మూర్తి బి.రజని పరిష్కరించారు. ఇతర ప్రిలిటిగేషన్ కేసుల 4738 కేసులను పరిష్కరించారు. రెండవ శ్రేణి మేజిస్ట్రేట్ సలీం 1,621 పెట్టి కేసులను పరిష్కరించారు. ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో కక్షి దారులకు పులిహోర, మంచినీరు అందించగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ళ శ్రీనివాసరావు మజ్జిగ అందజేశారు. జిల్లాలో సత్తుపల్లిలో 585 కేసులు, మధిరలో 934 కేసులు పరిష్కారమయ్యాయు. న్యాయవాదులు తెల్లాకుల రమేష్‌బాబు, ముప్వా నాగేశ్వర్‌రావు, పి.రంగారావు, మల్సూరూ, టి.వెంకటనారాయణ, వి. వాసవి కుమారి, లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరించారు.

చేపలును పట్టారు.. చెరువులు ఖాళీ చేశారు..

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మృగశిర కార్తె సందర్భంగా శనివారం అన్ని గ్రామాల్లో చెరువులు దగ్గర చేపల కోసం ప్రజలు బారులు తీరునారు.కొందరు యువకులు,మహిళలు చేప ప్రసాదం కోసం కందుకూరు గ్రామానికి తెల్లవారుజామున నుండే ప్రయాణం ప్రారంభించారు.మృగశిర నాడు కచ్చితంగా చేప మాంసం తినాలి అనే సిద్ధాంతాన్ని నమ్మిన పలువురు చేప ప్రియులు గ్రామంలో గల చెరువులు,కుంటలు దగ్గర ఉదయం 5 గంటల నుండే లైన్ కట్టినారు.ఇదే అదునుగా భావించిన పలువురు చేపలు పెంపకం దారులు కేజీ చేపలు 150 రూపాయలు నుండి 200 వరకు అమ్ముకొని సొమ్ములు చేసుకున్నారు.ఎది ఏమైనా చెరువుల్లో చేపలు మొత్తం ఖాళీ చేశారు.



గిరిజన గురుకులంలో ఇంటర్‌లో ప్రవేశాలు

నవతెలంగాణ-కారేపల్లి

మండలంలోని గాంధీనగర్‌లో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో ఇంటర్ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కనకపూడి సత్యానందం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో గిరిజన బాలుర విద్యార్థులకు ప్రవేశం పొందవచ్చన్నారు. ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు ప్రిన్సిపాల్ 83339 25403 సంప్రదించాలని కోరారు.

బిజినెస్

తరలిపోయిన రూ.14,794 కోట్ల ఎఫ్‌పీఐలు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారీగా ఈక్విటీలను తరలించుకుపోయారు. గడిచిన ఒక్కవారంలోనే రూ.14,794 కోట్ల విలువ చేసే ఈక్విటీలను విక్రయించారు. 2024లో ఇప్పటివరకు రూ.38,158 కోట్ల షేర్లను కొనుగోళ్లు చేశారు. గడిచిన ఏప్రిల్, మే, జూన్‌లో ఇప్పటి వరకు రూ.34,257 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు మొగ్గు చూపుతున్న తరుణంలోనూ విదేశీ ఇన్వెస్టర్లకు భారత మార్కెట్లపై విశ్వాసం సన్నగిల్లడం గమనార్హం. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు రూ.23,363 కోట్ల ఎఫ్‌పీఐలు తరలిపోయాయని జియోజిట్ ఫైనాన్సియల్ సర్వీసెస్ స్ట్రాటజీ చీఫ్ ఇన్వెస్ట్ మెంట్ వీకే విజయ్ కుమార్ తెలిపారు. చైనాలోని స్టాక్స్ చౌకగా ఉండటంతో చైనా ఎక్స్ఛేంజీలోని సూచీలపై విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారని అన్నారు.

ఆర్గానిక్ ఎరువుల్లో రెండంకెల వృద్ధి

- రైతుల్లో మరింత అవగాహన పెరగాలి
- జియోలైఫ్ అగ్రిటెక్ ఉత్పత్తులతో మెరుగైన దిగుబడి: కంపెనీ సిఎండీ వినోద్ లహోటి వెల్లడి

నవతెలంగాణ - బిజినెస్ బ్యూరో



దేశంలో ఆర్గానిక్ ఎరువుల వాడకంలో రెండంకెల పెరుగుదల ఉందని జియోలైఫ్ అగ్రిటెక్ ఇండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) వినోద్ లహోటి అన్నారు. ఈ రంగం ప్రతీ ఏడాది 10.6 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. అదే రసాయన ఎరువుల రంగం 6 శాతం చొప్పున పెరుగుతోందన్నారు. రైతులు, ప్రజల్లో ఆర్గానిక్ ఉత్పత్తులపై మరింత అవగాహన పెంచడానికి ప్రత్యేకంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదే విధంగా పలు ఆర్గానిక్ ఎరువుల పోర్టుపోలియోను పెంచుతున్నామన్నారు. ఇందుకోసం పూణెలోని వారి ఐదున్నర ఎకరాల్లోని పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) సెంటర్ కృషి చేస్తుందన్నారు. వారి పోర్టుపోలియోలో 50కి పైగా ఉత్పత్తులు ఉన్నాయన్నారు. గత ఏడాదిలోనే 12 ఉత్పత్తులను ఆవిష్కరించినట్టు తెలిపారు.

గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో రూ.182 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. ఈ ఏడాది రూ.250 కోట్ల రెవెన్యూ లక్ష్యంగా పెట్టుకుని, 40 దేశాలకు ఎగుమతులు చేస్తున్నామన్నారు. దేశంలో తమకు 3వేల పైగా విక్రయ భాగస్వాములు ఉన్నారని తెలిపారు.

అహార నాణ్యత ప్రమాణాలను పెంచడానికి స్పెషాలిటీ న్యూట్రియంట్ టెక్నాలజీని తీసుకొచ్చామన్నారు. ఇప్పుడు ప్రజలు తీసుకునే ఆహారంలో రసాయనాలు ఎక్కువగా, పోషకాలు తక్కువగా ఉంటున్నాయన్నారు. దీన్ని వారి టెక్నాలజీ ఉత్పత్తులతో మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం బాక్టోగ్యాంగ్, కార్బన్ స్టోన్ సహా పలు ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటి ధరలను వరుసగా రూ.600, రూ.900గా నిర్ణయించామన్నారు. ఇవి భూమిలో సారవంతాన్ని పెంచడంతో పాటుగా.. ధాన్యంలో నాణ్యతను పెంచుతాయన్నారు. జియోలైఫ్ అగ్రిలో 600 పైగా ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. తమ అమ్మకాలను మరింత విస్తృతం చేయడానికి ఇటీవల నేషనల్ సేల్స్ మేనేజర్‌గా విశేష అనుభవం కలిగిన చక్రపు కిరణ్ కుమార్‌ను, నేషనల్ మార్కెటింగ్ మేనేజర్‌గా అరుణ్ కుమార్ రాయ్‌ను నియమించుకున్నామని తెలిపారు.

ఐపీఓకు బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్

- రూ.7వేల కోట్ల ఇష్యూకు దరఖాస్తు

న్యూఢిల్లీ : బజాజ్ ఫైనాన్స్‌కు చెందిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రావడానికి సెబీకి దరఖాస్తు చేసుకున్నట్టు శనివారం ప్రకటించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.7,000 కోట్లు సమీకరించాలని నిర్దేశించుకుంది. ఇందులో రూ.4 వేల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. అదే విధంగా మాతృసంస్థ బజాజ్ ఫైనాన్స్‌కు చెందిన రూ.3 వేల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనుంది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. అప్పర్ లేయర్ కలిగిన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు 2025 నాటికి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కావాలి. ఇప్పటికే ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్, ఇండియా షెల్టర్ ఫైనాన్స్ సంస్థలు ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ అయ్యాయి. ఈ క్రమంలోనే బజాజ్ హౌసింగ్ ఐపీఓకు రెడీ అవుతోంది. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను భవిష్యత్తు మూలధన అవసరాలకు ఉపయోగించనుంది. బజాజ్ ఫైనాన్స్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,731 కోట్ల నికర లాభాలను సాధించింది.

ఓమెగా సరికొత్త బొటీక్ ఏర్పాటు



హైదరాబాద్ : స్విస్‌కు చెందిన ప్రముఖ గడియారాల కంపెనీ ఓమెగా హైదరాబాద్‌లో కొత్తగా పునర్ డిజైన్ చేసిన బొటిక్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెంబర్ 36లో ఏర్పాటు చేసిన ఈ అవుట్‌లెట్‌ను లాంచనంగా తెరిచింది. 703 చదరపు అడుగుల విస్తీర్ణంలోని కొత్త బొటీక్ వినియోగదారుల అనుభవాన్ని మరింత పెంచనుందని నిర్వాహకులు తెలిపారు.

నగరంలో నేషనల్ మార్ట్ ఏడో స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : రిటైల్ ఉత్పత్తుల విక్రయ చెయిన్ నేషనల్ మార్ట్ హైదరాబాద్‌లో తన 7వ స్టోర్‌ను తెరిచింది. మెహదీపట్నంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను శనివారం ఏఐఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ లాంచనంగా ప్రారంభించారు. ఈ స్టోర్‌లో కిరాణా, స్టేషనరీ, గృహ అండ్ కిచెన్ అప్లయెన్సెస్, కుక్ వేర్, పాదరక్షలు, పురుషులు, మహిళలు, పిల్లల కోసం దుస్తులు ఇంకా మరెన్నో ఉత్పత్తులను సరసమైన ధరలకే లభిస్తాయని నేషనల్ మార్ట్ వ్యవస్థాపకుడు యశ్ అగర్వాల్ తెలిపారు. నాణ్యత, చౌకగా ఉండే బ్రాండ్ మిశ్రమాన్ని మెహిదీపట్నానికి తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ వినూత్న ప్రచారం

హైదరాబాద్ : మెరుగైన ఆర్థిక పొదుపు ఎంపికలపై వ్యక్తులలో అవగాహన కల్పించడానికి వినూత్న ప్రచారాన్ని చేపట్టామని ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ లక్ష్మణ్ వేలాయుతం పేర్కొన్నారు. ఫుట్‌ఫాల్ స్మోకింగ్ జోన్‌లలో సృజనాత్మకంగా రూపొందించిన సిగరెట్ బాక్సులను పంపిణీ చేస్తోన్నట్లు తెలిపారు. 'ప్రతి సిగరెట్ ప్యాక్‌ను తగ్గించుకోవడం ద్వారా మరింత పొదుపు చేయడం ఆరోగ్యకరమైన అలవాటు' అనే సందేశంతో ఈ బాక్స్‌లను తయారు చేసినట్లు తెలిపారు. ప్రపంచ రహిత పొగాకు దినోత్సవం నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

అన్నదాతపై అప్పుల భారం

(మొదటిపేజీ తరువాయి)

కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 30 వేల రూపాయలపైగా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మత్తనగౌరెల్లిలో రైతు పంతు నాయక్‌కు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఇందులో మూడు ఎకరాలు వరి సాగు. ఒక ఎకరం పాడి పశువుల మేత కోసం ఉపయోగిస్తున్నారు. ఇందుకు పెట్టుబడి ఎకరాకు రూ. 25వేల చొప్పున మూడు ఎకరాలకు గాను రూ.75 వేలు ఖర్చు వచ్చింది. మూడు ఎకరాల్లో వచ్చిన దిగుబడి 60 క్వింటాలు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 2203లకు విక్రయించగా 60క్వింటాల ధాన్యానికి రూ.1,32,180లు వచ్చాయి. పెట్టుబడి రూ. 75 వేలు పోనూ రైతుకు మిగిలినవి రూ.57,180. ఇది ఆ కుటుంబం ఆరు నెలల కష్టం. రూ. 57,180 రోజువారీగా చూసుకుంటే ఆ కుటుంబం వేతనం రూ.317గా ఉంది. చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతు చంద్రయ్య మూడు ఎకరాలు పత్తి సాగు చేశాడు. ఒక ఎకరం సాగుకు పెట్టుబడి సుమారు రూ.40 వేలు అయింది. అయితే ఎకరంలో వచ్చిన దిగుబడి మాత్రం 6 నుంచి 7 క్వింటాలు మాత్రమే. అంటే ఆ రైతుకు ఎకరాకు రూ.38 వేల ఆదాయం వచ్చింది. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. మూడు ఎకరాల పత్తి సాగుకు రూ. లక్షా 20 వేలు ఖర్చు అయితే రైతులకు వచ్చిన ఆదాయం మాత్రం రూ. లక్షా 11వేలు మాత్రమే. దాదాపు రూ.9వేల నష్టం వచ్చింది. గతేడాది వర్షాలు కురవక పోవడం.. చేను పూతకు వచ్చే దశలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటకు చీడపీడలు సోకినా, ప్రకృతి ప్రకోపం చూపినా.. కొనుగోళ్లల్లో కొర్రీలు పెట్టిన.. ఆ ఏడు రైతులు తీవ్రంగా నష్టపోవడమే. సొంత పొలం సాగు చేసిన రైతులు పరిస్థితి ఇలా ఉంటే. ఇక కౌలు రైతుల పరిస్థితి వర్ణానాతీతం. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పెట్టబడి తగ్గే మార్గాలు అన్వేషించాలని రైతులు కోరుతున్నారు.

ఏమీ పాయిదా లేదు.

మా ఇంటిల్లి పాది వ్యవసాయ మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. యాసంగిలో మూడు ఎకరాలు వరి వేస్తే.. రెండు ఎకరాలు ఎండిపోయింది. ఒక ఎకరంలో 20 బస్తాలు కూడా రాలేదు. యాసంగిలో రూ.లక్ష పెట్టుబడి మీద పడింది. గత వానాకాలం మూడు ఎకరాలు సాగు చేస్తే పెట్టుబడిపోగా రూ. 50 వేలు చేతికి వచ్చినా అందులో పెట్టుబడికి తెచ్చిన మిత్తిలు పోనూ మిగిలిందేమీ లేదు. వ్యవసాయం చేసే దాని కంటే కూలికెళ్లడమే నయంగా ఉంది. ఏమీ గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని పెట్టుబడి తగ్గేలా చర్యలు తీసుకోవాలి.

పెరిగిన ధరలు ఇలా..

ఎరువు	2022-23	2024
డీఏపీ	రూ.1200	రూ.1350
20-20-013	రూ.950	రూ.1200
20-20-08	రూ.1500	రూ.1700
యూరియ	రూ.266	రూ.300
వరి	రూ.750	రూ.1000
పత్తి	రూ.930	రూ.864
కంది కిలో	రూ.180	రూ.300
పెసర	రూ.150	రూ.170

మహబూబ్‌నగర్‌లో 20 కేజీల వరి బస్తా వెయ్యి రూపాయలు

మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి : జిల్లాలో పత్తి తర్వాత అధికంగా వరి పంటను సాగు చేస్తారు. వరదలు వస్తే... ఇప్పటికే నారుమళ్లు వేసేవారు. మృగశిరలో నారుమల్లు వేస్తే... లాబదాయకమైన దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం. వారం రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే పత్తి విత్తనాలు సాగు చేశారు. వరి సాగుపై రైతులు దృష్టి సారించారు. ఎకరాకు వరి విత్తనాలు 20 కేజీలు అవసరం ఉంటుంది. గతంలో 20 కేజీల బస్తా విత్తనాలకు రూ. 900లకు అమ్మేవారు. ఈసారి ఒక బస్తా రూ. వెయ్యికి పెరిగింది. క్వింటాల్‌కు నాలుగు వందలకు పెంచి అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వ నియంత్రణ కొరవడటంతో వ్యాపారులు విత్తనాలను ఇష్టానుసారంగా అమ్ముతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో సహకార సంఘాల ద్వారా రాయితీ విత్తనాలు అమ్మేవారు. గత మూడేండ్లుగా సహకార సంఘాల నుండి పూర్తి స్థాయిలో విత్తనాలు సరఫరా చేయడం లేదు.

ఎకరం వరి పంట సాగుకు పెట్టుబడి ఇలా.. (రూ..లో)

దుక్కి	6000
విత్తనాలు	1000
డీఏపీ	2800
యూరియ, నత్రజని	1800
ఇతర మందులు	3000
నాటు కూలి	6000
కలుపుతీయడం	1000
వరి కోత	3000
మార్కెటింగ్	2000
మొత్తం	26,500

దీంతో డీలర్ల దగ్గర నుండి కొనుగోలు చేయడం తప్పని సరి అయ్యింది. పెరిగిన విత్తనాల ధరల వల్ల వరి సాగు కష్టంగా మారింది. ఒక్కోవిత్తన సంచికి రూ. 100 పెంచితే... సాగుకు భారం పెరిగి రైతులు అప్పుల్లో కూరుకపోయే అవకాశాలు ఉన్నాయి.

– తావునాయక్, రైతు మత్తన గౌరెల్లి

(మధ్యలో రెండు సార్లు యూరియా, నత్రజని, పొటాషియం చల్లుతుంటారు. దీనితో పాటు ఇతర ప్రకృతి వైపరీత్యాలు, మరికొన్నిటికి కలుపుకుని 30 వేల రూపాయలు పైగా ఖర్చు కానున్నాయి. భూములను బట్టి కూడా ఖర్చు పెరిగే అవకాశం ఉంది.)

బ్యాలెట్‌పై పిచ్చి గీతలు..!

- మారిన ఎమ్మెల్సీ అభ్యర్థుల భవిత్యం
- గెలుపు అవకాశాలను దూరం చేసిన చెల్లని ఓట్లు ?
- పట్టభద్రుల అవగాహనా రాహిత్యం

నవతెలంగాణ-నల్లగొండటౌన్

వాళ్లంతా విద్యావంతులే.. డిగ్రీ, పీజీ చదివిన వారే. వారందరికీ అన్ని విషయాల పట్ల అవగాహన ఉంటుందని భావిస్తుంటారు. కానీ ఓటు వేసే విషయంలో కొంతమంది ఫెయిలయ్యారు. అవగాహన లేక ఓటు వేయలేదా?.. కావాలని నిర్లక్ష్యంతో బ్యాలెట్‌పై పిచ్చిగీతలు గీశారా? అన్నది తెలియదు. కాని గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికల్లో తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించ కపోవడంతో వారు వేసిన ఓట్లు చెల్లని ఓట్లుగా మిగిలిపోయాయి. ప్రజాస్వామ్యానికి పునాదిగా భావించే ఓటు హక్కును వినియోగించుకునే విషయంలో ఎన్నికల సంఘం, ఎన్నికల అధికారులు, ఎంతోమంది అనేక రకాలుగా అవగాహన కల్పించారు. గ్రాడ్యుయేట్లు ఓటు ఎలా వేయాలనే అంశంపై ఎన్నికల కమిషన్ అనేక అవగాహనా కార్యక్రమాలనూ చేపట్టింది. ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. పోటీచేసిన అభ్యర్థులు కూడా తమ వంతు ప్రయత్నం చేశారు. ఇంత పెద్దఎత్తున ప్రచారం చేసినా నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఏకంగా 25,877 ఓట్లు చెల్లకుండా పోయాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధాన అభ్యర్థులతో సమానంగా చెల్లని ఓట్లే ఐదో స్థానంలో ఉన్నాయి. పట్టభద్రులకు ఓటు వేయడంలో ఫెయిల్ కావడంతో మొదటి ప్రాధాన్యత ఓట్లతో అభ్యర్థులు గెలుపు అవకాశాలకు దూరమయ్యారు.

గెలుపు అవకాశాలను దూరం చేసిన చెల్లని ఓట్లు

నియోజకవర్గంలో 4 లక్షలా 6 వేలా 300 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా 3,36,013 ఓట్లు పోలయ్యాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి 25,877 ఓట్లు చెల్లకుండా పోయాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్) 1,22,813 ఓట్లు, రాకేశ్ రెడ్డి(బీఆర్ఎస్) 1,04,248 ఓట్లు, ప్రేమేందర్ రెడ్డి(బీజేపీ) 43,313 ఓట్లు, అశోక్ కుమార్ (స్వతంత్ర) 29,697 ఓట్లు రాగా ఐదో స్థానంలో 25,877 చెల్లని ఓట్లు ఉన్నాయి. ప్రధాన అభ్యర్థులైన ప్రేమేందర్ రెడ్డి, అశోక్ కుమార్‌కు వచ్చిన ఓట్లతో సమానంగా చెల్లని ఓట్లు బయట పడటం ఎన్నికల అధికారులను విస్మయానికి గురిచేసింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు వచ్చిన మెజారిటీ 18,565 ఓట్లు ఉండగా, అంతకంటే ఎక్కువ సంఖ్యలో చెల్లని ఓట్లు ఉండడంతో ప్రధాన అభ్యర్థులకు మొదటి ప్రయారిటీ ఓట్ల ద్వారా విజయావకాశాలు దూరమయ్యాయి.

పట్టభద్రుల అవగాహనా రాహిత్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల బ్యాలెట్ పేపర్లపై పిచ్చి రాతలు ఉన్నాయి. చాలామంది పట్టభద్రులు బ్యాలెట్ పేపర్‌పై అంకెలు వేయాల్సింది పోయి.. ఐ గుర్తు పెట్టడం, క్రాస్ గుర్తులు, టిక్ మార్కులు పెట్టడం, జై కాంగ్రెస్, జై కేసీఆర్, ఎమ్మెల్సీలుగా ఈ అభ్యర్థులు పనికిరారంటూ రాయడం వంటివి ఉన్నాయి. కొందరైతే లవ్ గుర్తులు, బ్యాలెట్ పేపర్ వెనకాల ఫోన్ నంబర్లు వేయడంతో చెల్లుబాటు కాకుండా పోయాయి. మరికొందరైతే తమ సంతకాలు పెట్టారు. ఇలా చేయడం పట్ల అధికారులు, రాజకీయ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓటు ప్రాధాన్యతను గుర్తించి సరిగా ఓటు వేస్తే సమయం కూడా కలిసి వచ్చేదని పలువురు ఎన్నికల సిబ్బంది అభిప్రాయపడ్డారు.

మొదటి విడతలో ఇండ్లు..!

- రెండో విడతలో ఇండ్ల స్థలాలు ఇస్తాం.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-కూసుమంచి

అర్హులైన పేదలందరికీ మొదటి విడతలో ఇండ్లు.... రెండో విడతలో ఇండ్ల స్థలాలు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండల పర్యటనలో భాగంగా నాయకన్‌గూడెం, భగత్ వీడు తండా, మంగళి తండా, ఈశ్వర మదారం, రాజుపేట బజార్, రాజు పేట, గోరిలపాడు తండా, హిరామాన్ తండా, పెరిక సింగారం, జక్కేపల్లి, జక్కేపల్లి ఎస్సీ కాలనీ, మల్లేపల్లి, గట్టు సింగారం, గంగబండ తండా, లింగారం తండా, కోక్యా తండా, లోక్యా తండా, నేలపట్ల, అగ్రహారం, మునిగేపల్లి గ్రామాలను పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.... ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలు జరిగిన ఇన్ని సంవత్సరాల్లో ఏ సభ్యుడికి రాని మెజారిటీ రఘురాం రెడ్డికి వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గడిచిన పది సంవత్సరాల్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డు, ఇండ్లు ఇవ్వలేదని విమర్శించారు.

రాబోయే మూడు సంవత్సరాల్లోపే పాలేరులోని అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇప్పిస్తానని అన్నారు. అతి కొద్ది రోజుల్లోనే అర్హులైన వారందరికీ తీపి కబురు అందుతుందని తెలిపారు. ఉచిత కరెంటు కోసం అర్హులైన వారం దరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను వెలికి తీసి వాటిలో పేదలకు ఇండ్ల నిర్మాణం చేస్తామని తెలిపారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రయినేజీల నిర్మాణం చేయిసా_మన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మ ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు శుభాకాంక్షలు

- సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా శాసన మండలికి ఎన్నికైన చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న)కు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు అభినందనలు తెలిపారు.

అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా బుద్ధవనం

- సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తీర్చిదిద్దుతాం : మంత్రి జూపల్లి కృష్ణారావు



పతెలంగాణ-నల్లగొండ

అంతర్జాతీయ బౌద్ధ టూరిజం సర్క్యూట్‌లో తెలంగాణలోని బుద్ధవనం క్షేత్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. టూరిజం ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఆయన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని హిల్ కాలనీలోని బుద్ధవనాన్ని స్థానిక ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ తప్పక సందర్శించాల్సిన టూరిజం ప్రాంతం బుద్ధవనం అని అన్నారు. అంతకుముందు మంత్రి జూపల్లి కృష్ణారావుకు బుద్ధవనం ఓఎస్డీ సూదన్‌రెడ్డి, బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం బుద్ధుని పాదాల వద్ద వారు పుష్పాంజలి ఘటించారు. మహాస్తూపం, స్తూపవనం, జాతకవనం, ధ్యానవనాలను తిలకించారు. బుద్ధవనం విశేషాలను ప్రముఖ బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు కల్పిస్తున్న వసతుల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. విజయ్ విహార్‌లో బుద్ధవనం అభివృద్ధి పనుల పురోగతి, మెరుగైన వసతుల కల్పనపై బుద్ధవనం, పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్, జడ్పీ మాజీ వైస్ చైర్మెన్ కర్నాటి లింగారెడ్డి, అబ్బిడి కృష్ణారెడ్డి,నందికొండ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ,వైస్ చైర్మన్ ప్రత్యేక సలహాదారుడు ఆదాసు విక్రమ్, పర్యాటక అభివద్ధి సంస్థ జీఎం (ప్రాజెక్ట్) ఉపేందర్ రెడ్డి,జిల్లా పర్యటక సమాచార అధికారి శివాజీ ,తదితరులు పాల్గొన్నారు.

రేపు వ్యకాస రాష్ట్ర సదస్సు

- కరపత్రాన్ని ఆవిష్కరించిన బి వెంకట్, నాగయ్య, వెంకట్రాములు, ప్రసాద్
- ఉపాధి పని దినాల సంఖ్యను 200 రోజులకు పెంచాలని డిమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉపాధి పని దినాల సంఖ్యను 200 రోజులకు పెంచాలనీ, పట్టణ ప్రాంతాలకు పనిని విస్తరించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. నాగయ్య, ఆర్ వెంకట్‌రాములు, ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. భూమిలేని పేదలకు రూ. 12వేల ఆర్థిక సాయం చేస్తామన్న వాగ్దానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ గత పదేండ్లుగా మోడీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, ఉదయం, సాయంత్రం కూలీలు తమ ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తేనే వేతనాలు ఇస్తామనడం, పనిని డోన్ యంత్రాలతో ఫోటోలు తీయడం, ఆధార్, జాబ్ కార్డు నెంబరు బ్యాంక్ అకౌంట్లు ఆన్‌లైన్ చేస్తేనే వేతనాలు చెల్లిస్తామంటూ కూలీలను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు. సకాలంలో వేతనాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వాలను వేధించిందని తెలిపారు. కాంట్రాక్టర్లకు ఇచ్చే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పెంచి కేటాయించిన నిధులను పక్కదారి పట్టించిందని చెప్పారు.

ఈ నేపథ్యంలో పని రక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రాజ్యసభ సభ్యులు శివదాసన్ తదితరులు ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

సరిహద్దులు దాటుతున్న సబ్సిడీ విత్తనాలు...

- బ్లాకులో పచ్చి రొట్ట విత్తనాల అమ్మకాలు
- నలుగురు అధికారుల సస్పెన్షన్

నవతెలంగాణ తొర్రూరు

రైతులకు సబ్సిడీపై అందించాల్సిన విత్తనాలు రాష్ట్ర సరిహద్దులు దాటి పక్క రాష్ట్రాలకు చేరుతున్నాయి. ఆ రాష్ట్రంలో జీలుగు విత్తనాలపై సబ్సిడీ లేకపోవడం, అక్కడ ఈ విత్తనాల కొరత ఉండడం దళారులకు వరంగా మారింది. వారితో కొంతమంది అధికారులు కుమ్మక్కై సబ్సిడీ విత్తనాలను తరలిస్తున్న వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో జీలుగా విత్తనాల అక్రమ వ్యాపారం శుక్రవారం వెలుగు చూసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి ఇందుకు బాధ్యులైన నలుగురు అధికారులను సస్పెండ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలానికి 2024-25 సంవత్సరానికి గాను 500 క్వింటాల జీలుగు విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేయాల్సి ఉంది. కానీ కొంతమంది వ్యవసాయ అధికారులు దళారులతో చేతులు కలిపి సబ్సిడీ విత్తనాలను అసలు రేట్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలించారు. దీంతో ఈ ప్రాంత రైతులకు విత్తనాల కొరత ఏర్పడింది. విత్తనాల కోసం రైతులు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, పిఎసిఎస్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. జీలుగా విత్తనాలు 30 కేజీల సంచి అసలు ధర రూ.2790 ఉంది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీ ఇస్తూ రూ.1116కే రైతులకు అందజేస్తోంది. ఆంధ్రాలో ఈ విత్తనాలు అందుబా టులో లేకపోవడం, సబ్సిడీ లేకపోవడంతో సదరు అధికారులు దళారులతో కుమ్మక్కై ఇక్కడి రైతుల పేరా తప్పుడు రికార్డులు రాసి విత్తనాలను అమ్మినట్టు విచారణలో తేలింది. మండలంలోని పలు గ్రామాల రైతులకు తెలియకుండానే వారి పేరా జిలుగ విత్తనాలు పంపిణీ చేసినట్టు రికార్డులు సృష్టించారు. అలాగే గ్రానైట్ భూములు మామిడి తోటలకు సైతం జీలుగ విత్తనాలు ఇచ్చినట్టు రికార్డుల్లో నమోదు చేసినట్టు ఉంది. అన్ని గ్రామాలలో విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉందని సమాచారం.

నలుగురు అధికారుల సస్పెన్షన్

తొర్రూరు మండలంలో జీలుగు విత్తనాల అక్రమ రవాణాపై సంబంధిత శాఖ అధికారులు విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సంఘటనతో సంబంధం ఉన్న తొర్రూరు మండల వ్యవసాయ అధికారి కెఎస్ కుమార్ యాదవ్, తొర్రూరు క్లస్టర్ ఏఈఓ ఎం.జమున, అమ్మాపురం క్లస్టర్ ఏఈఓ దీపిక, హరిపిరాల ఏఈవో సిహెచ్.అరవింద్‌లను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

విజిలెన్స్ విచారణ జరిపించాలి...

తొర్రూరు మండలంలో వెలుగు చూసిన జీలుగ విత్తనాల అక్రమ వ్యాపారంపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని మహబూబాబాద్ జిల్లా జెడ్పీ ఫ్లోర్ లీడర్, స్థానిక జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరపటం సమంజసం కాదని, పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. పిఎసిఎస్, వ్యవసాయ శాఖ, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం భాగస్వాములై ఈ దందా నడిపిస్తున్నారని ఆరోపించారు.

పిడుగుపడి యువకుడి మృతి



నవతెలంగాణ-నిజాంసాగర్

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామానికి చెందిన కురుమ కృష్ణమూర్తి (23) అనే యువకుడు పిడుగు పడి శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణమూర్తి రోజు పనిలో భాగంగానే గొర్లను మేపడానికి వడ్డేపల్లి గ్రామ శివారులోని నల్లగుట్ట తండా అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో పిడుగు పడి ప్రాణాలు కోల్పోయాడు. జీవాలను మేపేందుకు వెళ్లిన యువకుతు తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు నల్లగుట్ట తండా అటవీ ప్రాంతంలో వెతకడానికి వెళ్లగా కృష్ణమూర్తి విగతాజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేపట్టారు.

షూ లేకున్నా పరిగెత్తా...

దీప్తి జీవాంజీ.. ఓ మారు మూల గ్రామంలో పేదరైతు కుటుంబంలో పుట్టింది. తన గ్రామం తప్ప మరో ప్రపంచం తెలియని ఓ సాధారణ అమ్మాయి. పాఠశాల గురువుల సహకారంతో పరుగు మొదలెట్టింది. కోచ్ ప్రోత్సాహంతో రాటుదేలింది. పుట్టుకతో వచ్చిన అనారోగ్యాన్ని సైతం అధిగమించింది. ఒకప్పుడు కాళ్ళకు బూట్లు లేకున్నా చిరుతలా పరుగులు తీసింది. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. దేశానికి పతకాల వర్షం కురిపిస్తోంది. ఇటీవలె జపాన్‌లోని కోబ్ వేదికగా జరిగిన ప్రతిష్టాత్మక పారా అథ్లెటిక్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి, రాబోయే పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్న ఓరుగల్లు బిడ్డతో మానవి సంభాషణ...




మా సొంతూరు వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలం, కల్లెడ గ్రామం. అమ్మ ధనలక్ష్మి, నాన్న యాదగిరి. ఇద్దరూ కూలి పనులు చేస్తే తప్ప మా కుటుంబం గడవదు. నాకు ఓ చెల్లి కూడా ఉంది. నేను కల్లెడలోని ఆర్‌డీఎఫ్ స్కూల్లో చదువుకునేదాన్ని. అప్పట్లో ఆగస్టు 15, జనవరి 26 సందర్భంగా స్కూల్లో గేమ్స్ పెడుతుండేవారు. అందులో పరుగుపందెం పడితే ఎప్పుడూ ఫస్ట్ వస్తుండేదాన్ని. బాగా పరిగెత్తుతున్నాని మా పీటీ సార్ బాగా ప్రోత్సహించేవారు. స్కూల్లో నాతో ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయించేవారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ఎక్కడ జరిగినా తీసుకెళ్ళేవారు. అలా వెళ్ళిన ప్రతి సారీ ఫస్ట్ వచ్చేదాన్ని. ఒకసారి ఖమ్మంలో పోటీలు జరిగితే అక్కడికి ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్ సార్ వచ్చారు. ఆ పోటీలప్పుడు నాకు షూ కూడా లేవు. అయినా పరిగెత్తాను. అలాంటి పరిస్థితుల్లో కూడా నేను గెలవడంతో ఆయన నా గురించి మా పీటీ సార్‌ను అడిగారు.



ముందు ఇంట్లో ఒప్పుకోలేదు

'గ్రామంలో ఉండటం కంటే హైదరాబాద్‌లో ఉంటే మంచి అవకాశాలు ఉంటాయి, మంచి గుర్తింపు ఉంటుంది, ప్రాక్టీస్ చేయడానికి అన్నీ అనుకూలంగా ఉంటాయి' అని రమేష్ సార్ నన్ను సాయి హాస్టల్‌కి రమ్మని అడిగారు. అప్పుడు నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. అయితే మా అమ్మానాన్న ముందు ఒప్పుకోలేదు. ఎందుకంటే నాకు చిన్నప్పటి నుండి ఫిట్స్ ఉన్నాయి. ఎప్పుడు పడిపోతానో తెలీదు, పైగా ఆడపిల్లను. దాంతో అమ్మ వాళ్ళు అంత దూరం పంపించడానికి భయపడ్డారు. కానీ రమేష్ సార్, మా పీటీ సార్ నచ్చజెప్పి 'తన బాధ్యతలన్నీ మేమే చూసుకుంటాం, మీరేం కంగారు పడొద్దు. తన ఆరోగ్యం గురించి కూడా జాగ్రత్తలు తీసుకుంటాం' అని ధైర్యం చెబితే ఒప్పుకున్నారు.



ప్రపంచ రికార్డ్

2016లో హైదరాబాద్ వచ్చి సాయి హాస్టల్లో ఉండి ప్రాక్టీస్ మొదలుపెట్టాను. కోచ్ రమేష్ సార్ ఎంతో ప్రోత్సహించేవారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకునేవారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్ళాలంటే మా స్కూల్‌లోని రామ్మోహన్ సార్ నా ఖర్చులన్నీ చూసుకునేవారు. ఇప్పటికీ ఏదైనా అవసరం ఉంటే ఆయనే హెల్ప్ చేస్తుంటారు. నా పెర్ఫార్మెన్స్ బాగుందని పారాలో ఆడించడం మొదలుపెట్టారు. మొదటిసారి 2022లో మొరాకోలో జరిగిన పోటీల్లో పాల్గొంటే అక్కడ గోల్డ్ మెడల్ వచ్చింది. తర్వాత 2023లో ఆస్ట్రేలియా వెళితే అక్కడ కూడా గోల్డ్ వచ్చింది. అదే ఏడాది చైనా ఏషిన్ గేమ్స్‌కు వెళ్ళి 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ వచ్చింది. అలాగే ఏషియన్ గేమ్స్‌లో రికార్డ్ సాధించాను. ఈ ఏడాది మేనెలలో జపాన్‌లో జరిగిన పారా అథ్లెట్స్‌లో కూడా గోల్డ్ మెడల్‌తో పాటు ప్రపంచ రికార్డ్ బ్రేక్ చేశాను.

ఆర్థిక సమస్యలతో...

అమ్మానాన్న కొంత వరకు చదువుకున్నారు. అయితే క్రీడల గురించి పెద్దగా అవగాహన లేదు. చిన్నతనంలో మాత్రం కొంత భయపడ్డారు. తర్వాతర్వాత మెడల్స్ రావడంతో ఏదో సాధిస్తున్నాను అనే నమ్మకంతో ధైర్యంగా ఉన్నారు. అయితే మా బంధువుల్లో కొందరు మాత్రం అప్పట్లో 'ఈ పిల్ల ఏం ఆడుతుంది, ఏం గెలుస్తుంది' అని ఎగతాళి చేసేవారు. నేను మాత్రం వాళ్ళ మాటలు పెద్దగా పట్టించుకునే దాన్ని కాదు. కాకపోతే మా అమ్మానాన్న ఇంట్లో ఆర్థిక సమస్యల వల్ల బాగా ఇబ్బంది పడుతుండేవాళ్ళు. అందుకే ఇవన్నీ మనకు అవసరమా అనుకునే వారు. ఇప్పుడు మాత్రం అందరూ నా గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. అమ్మానాన్న కూడా చాలా సంతోషంగా ఉన్నారు.

ప్రభుత్వం సహకరిస్తే...

అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న నన్ను రమేష్ సార్ 2022లో గోపిచంద్ ఆకాడమీలో చేర్పించారు. ప్రస్తుతం అక్కడే ఉంటూ ప్రాక్టీస్ చేస్తున్నాను. ఊర్లో కాలేజీలో డిగ్రీ చేస్తున్నాను. దేశం తరపున ఆడుతున్నాను. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం అందలేదు. జాబ్ లేదు, ఉండటానికి ఇల్లు లేదు. స్పోర్ట్స్ కోటా నుండి ఉద్యోగం ఇస్తే బాగుంటుంది. ప్రస్తుతం గోపీ చంద్ ఆకాడమీలో ఉన్నాను కాబట్టి అన్నీ వాళ్ళే చూసుకుంటున్నారు. ఇప్పటికీ కొంత ఆరోగ్య సమస్య ఉంది. అయినా ఎలాగైనా క్రీడల్లో ఎదగాలని సార్ల సహకారంతో పరిగెడుతున్నాను. దీనికి తోడు ప్రభుత్వం కూడా సహకరిస్తే దేశానికి ఇంకా ఎన్నో పతకాలు తీసుకువస్తాను.

అమ్మాయిలను ప్రోత్సహిస్తే...

మరో రెండు మూడు నెలల్లో పారిస్‌లో పారా ఒలింపిక్స్ ఉన్నాయి. ప్రస్తుతం వాటికి ట్రైనింగ్ తీసుకుంటున్నాను. అమ్మాయిలందరూ స్పోర్ట్స్‌లోకి వచ్చి దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి. అయితే అమ్మాయిలు ఈ రంగంలోకి రావడానికి కొంత ఇబ్బంది పడుతున్నారు. ఆడపిల్లలు కావడంతో తల్లిదండ్రులు పంపడానికి కొంత భయపడుతున్నారు. అలాంటి భయాలు లేకుండా ప్రోత్సహిస్తే అమ్మాయిలు సాధించగలుగుతారు. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తే మరింత ఆసక్తి చూపిస్తారు.

- సలీమ





మంచి నిద్ర ఎందుకు అవసరం?

ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి మంచి నిద్ర చాలా అవసరం. పెద్దలకు, సగటున ప్రతి రోజూ రాత్రి 7, 8 గంటల నిద్ర అవసరం. ఆదమరచి నిద్ర పోవడంవల్ల రోజంతా చేసిన శ్రమ, కలిగిన ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతాం. నిద్ర మెదడుకు విశ్రాంతి, రికవరీ కాలాన్ని అందిస్తుంది.



మానసిక స్థితి నియంత్రణకు, మొత్తం మానసిక ఆరోగ్యానికి అవసరమైన సెరోటోనిన్, డోపమైన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి మెదడులోని న్యూరోట్రాన్స్‌మిటర్‌ల సమతుల్యతను కాపాడుకోవడానికి నిద్ర చాలా కీలకం.

మెదడును డిటాక్స్ చేస్తుంది..

నిద్రలో, గ్లింఫాటిక్ వ్యవస్థ మరింత చురుకుగా మారుతుంది. రోజంతా మెదడులో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు, టాక్సిన్‌లను తొలగిస్తుంది.

హార్మోన్ల నియంత్రణ..

గ్రోత్ హార్మోన్, కార్టిసాల్, మెలటోనిన్ వంటి హార్మోన్ల విడుదలను నిద్ర ప్రభావితం చేస్తుంది. ఇవి పెరుగుదల, ఒత్తిడి ప్రతిస్పందన, నిద్ర మేల్కొనే చక్రం సహా వివిధ శారీరక విధులలో కీలక పాత్ర పోషిస్తాయి.

రోగనిరోధక పనితీరు..

తగినంత నిద్ర ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. శరీరాన్ని అనారోగ్యాలు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. నిద్రలేమి రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది.

న్యూరోజెనిసిస్..

మెదడులోని కొన్ని ప్రాంతాలలో కొత్త న్యూరాన్‌ల ఏర్పాటును ప్రోత్సహించడంలో నిద్ర ఒక పాత్ర పోషిస్తుందని, మెదడు ప్లాస్టిసిటీకి దోహదపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

నరాల సంబంధిత రుగ్మతల ప్రమాదం తగ్గుదల

దీర్ఘకాలిక నిద్ర లేమి వల్ల అల్జీమర్స్ వ్యాధి, పార్కిన్సన్స్ వంటి న్యూరోడెజెనరేటివ్ డిజార్డర్స్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. మంచి నిద్ర ఈ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

పత్రికారంగంలో చెరగని ముద్ర

(మొదటిపేజి తరువాయి)

ఆయన అద్భుతంగా రాణించారు' అని అన్నారు. శనివారం ఆయన రామోజీ ఫిలిమ్ సిటీలో రామోజీ భౌతికగాయం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆయన పాత్రికేయ వృత్తిని ఎంచుకున్నా...ప్రవృత్తిగా చిత్రసీమకు సైతం సేవలందించారని గుర్తు చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయడం ద్వారా తెలుగు రాష్ట్రాల ఖ్యాతిని ప్రపంప నలుమూలలకు విస్తరించిన వ్యక్తి రామోజీరావు అని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడే మోడీ ప్రమాణ స్వీకారోత్సవం

(మొదటిపేజి తరువాయి)

భద్రతా చర్యలలో ప్రముఖులు వారి హెూటళ్ల నుంచి వేదిక వరకు నిర్దేశించబడిన మార్గాలు ఉన్నాయి. లీలా, తాజ్, ఐటిసి మౌర్య, క్లారిడ్జ్‌లు, ఒబెరాయ్ వంటి ప్రముఖ హెూటల్‌లు ప్రత్యేక భద్రతా మయంలో ఉన్నాయి. దీంతో ఇక్కడ సరిహద్దు తనిఖీలను పెంచడంతో రోడ్ల మూసివేత, ట్రాఫిక్ మళ్లింపులు చేశారు.ఆదివారం జరగనున్న మోడీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా వచ్చిన ఆహ్వానాన్ని మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజు అంగీకరించారు. మాల్దీవులతో పాటు, ఈ కార్యక్రమానికి బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్, సీషెల్స్ నుండి ఇండియా 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానంలో భాగంగా నాయకులు హాజరు కానున్నారు.ఎన్డీఏ నేతగా ఎన్నికైన నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో బీజేపీ ఎంపీలతో పాటు , దాదాపు మూడోవంతు మంది నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) మిత్రపక్షాల ఎంపీలు కూడా ఉంటారు. మిత్రపక్షాలకు ఎంపిక చేసిన ఫార్ములా ప్రకారం ప్రతి నలుగురు, ఐదుగురు ఎంపీలకు ఒక క్యాబినెట్ మంత్రి పదవిని, ప్రతి ఇద్దరికీ ఒక సహాయ మంత్రి పదవులు ఇస్తారని తెలుస్తోంది. ఆ మేరకు బీజేపీ నేతలు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా మిత్రపక్షాలతో చర్చలు జరుపుతున్నారు.

జూన్ 15 నుంచి లోక్‌సభ తొలి సెషన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జూన్ 15 నుంచి 18వ లోక్‌సభ తొలి సెషన్ ప్రారంభం కానుంది. కొత్తగా ఎన్నికైన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేస్తారు. రెండ్రోజుల పాటు ప్రమాణ స్వీకారం, ఆ తరువాత కొత్త స్పీకర్‌ను ఎన్నుకుంటారు. మరుసటిరోజు రాష్ట్రపతి లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. తద్వారా సెషన్‌ను అధికారికంగా ప్రారంభిస్తారు. సెషన్ తేదీలపై కొత్త కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది. ఈ సమావేశంలో ప్రధాని మోడీ తన మంత్రి మండలి సభ్యులను ఉభయ సభలకు పరిచయం చేస్తారు. జూన్ 22న సెషన్ ముగిసే అవకాశం ఉంది.

రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం ప్రమాణస్వీకార కార్యక్రమం ముగిసిన వెంటనే కేబినెట్ భేటీ అయ్యే అవకాశం ఉంది. కేంద్ర మంత్రివర్గం సలహా మేరకు 17వ లోక్‌సభను జూన్ 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రద్దు చేశారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా మోడీ ఎన్నికపై బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ఆమెకు లేఖ ఇవ్వడం, ఎన్‌డిఎ నాయకులు మద్దతు లేఖలు సమర్పించడంతో ముర్ము శుక్రవారం మోడీని ప్రధానిగా నియమించారు.

నీట్ అవకతవకలపై విచారణ జరిపించాలి : కేటీఆర్

(మొదటిపేజి తరువాయి)

విధంగా ఈ ఏడాది నీట్ పరీక్షలో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించటం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. నీట్‌లో ఉన్న మార్కింగ్ విధానం ప్రకారం 718, 719 మార్కులు రావటమన్నది సాధ్యమయ్యే పనికాదని పేర్కొన్నారు. దీని గురించి ప్రశ్నిస్తే 'గ్రేస్ మార్కులు' ఇచ్చామని చెబుతున్నారనీ, కొంతమంది విద్యార్థులకు ఏకంగా 100 వరకు గ్రేస్ మార్కులు ఇచ్చినట్టు తెలుస్తోందని పేర్కొన్నారు. ఆయా మార్కుల కోసం ఏ విధానాన్ని అవలంబించారన్నది చెప్పకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోందని తెలిపారు. నీట్ ఫలితాలను ప్రిపోన్ చేసి ఎన్నికల ఫలితాల రోజే హడావుడిగా విడుదల చేయటం ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తోందని పేర్కొన్నారు.

చేప ప్రసాదం పంపిణీలో విషాదం

(మొదటిపేజి తరువాయి)

చెందాడు. అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన గొల్ల రాజన్న (60) చేప ప్రసాదం వేయించుకోవడానికి మనవడితో కలిసి శుక్రవారం రాత్రి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు వచ్చాడు. శనివారం ఉదయం 6:30 గంటల సమయంలో క్యూ లైన్‌లో స్పృహ కోల్పోయాడు. అతన్ని అంబులెన్స్‌లో పక్కనే ఉన్న కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు గుండెపోటుతో చనిపోయాడని, అతనికి ఆస్తమా ఉందని వైద్యులు తెలిపారు.

చేప ప్రసాదం పంపిణీకి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం : మంత్రి పొన్నం ప్రభాకర్

చేప ప్రసాదం పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి చేప ప్రసాదాన్ని బత్తిని హరినాథ్ గౌడ్ వేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మృగశిర కార్తె సందర్భంగా ప్రతి యేడు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బత్తిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చేప ప్రసాదం పంపిణీ జరుగుతోందన్నారు. వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి ఈ చేప ప్రసాదం కోసం వస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేప ప్రసాదం కోసం చేప పిల్లలను అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, బత్తిని సోదరులు అమర్నాథ్ గౌడ్, దుర్గా శంకర్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్, విశ్వనాథ్ గౌడ్ ,సంతోష్ గౌడ్, అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్,నాంపల్లి మండల తహసీల్దార్ ప్రేమ్ కుమార్, నాయబ్ తహసీల్దార్ హారిక, అధికారులు, జీహెచ్ఎంసీ ఏఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, అధికారులు వైద్య అధికారులు, పాల్గొన్నారు.

ఉక్కిరిబిక్కిరి !

(మొదటిపేజి తరువాయి)

తీసుకోవచ్చని రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రజల ఆకాంక్షలు, సర్కారు హామీల మధ్య భారీ ఆర్థిక అంతరం ఏర్పడటంతో ఇప్పుడు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికలు ముగియగానే పురపాలక సంఘాలు, ఎమ్‌పీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఇప్పుడు పునరాలోచన చేస్తున్నట్టు సమాచారం. బీసీ జనగణన జరిపి, రిజర్వేషన్లు ఖరారు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్లూ ఊపందుకున్నాయి. పరిస్థితి పాలకపక్షానికి అనుకూలంగా లేదని భావించిన రేవంత్ సర్కార్ ఈ ఎన్నికలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. దీనితో ముందస్తుగా అనుకున్న ప్రణాళిక ప్రకారం ఆదాయవనరులు సమకూరలేదని సమాచారం. పలు ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ బిల్లులు అధికారుల్ని మహా చిరాకు పెడుతున్నాయి. ప్రోటోకాల్ విభాగంలోని కాంట్రాక్టర్లకు ఏడాదికాలంగా బిల్లులు చెల్లించకపోవడంతో, వారు తామిక ఎదురు పెట్టుబడి పెట్టలేమని చేతులెత్తేసినట్టు సమాచారం. దీనితో అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. పౌరసరఫరాల శాఖలోనూ పెండింగ్ బిల్లులు చెల్లిస్తే తప్ప, లారీలు తిప్పలేమని యజమానులు ఖరాఖండిగా చెప్తున్నారు. సెక్రటేరియల్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు వాడుతున్న కార్లకు ఏడాదిగా బిల్లులు చెల్లించలేదు. ఇదే పరిస్థితి ఇతర కార్పొరేషన్లలోనూ ఉంది. కార్లకు ఈఎమ్‌ఐలు చెల్లించేందుకు అప్పుల పాలవుతున్నామని సదరు యజమానులు మొత్తుకుంటున్నారు.

ఆదాయాన్వేషణ

(మొదటిపేజి తరువాయి)

ఉంది. హెచ్ఎండీఏ ద్వారా భూముల అమ్మకంపై కసరత్తు జరుగుతుంది. రేవంత్ సర్కార్ ప్రాధాన్యతా క్రమంలో ఒక్కో సమస్యను పరిష్కరించాలని అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు కోరుతున్నారు. నిధులు లేకుండా పరిపాలన ఎలా సాగుతుందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ ఆ దిశగా దృష్టి పెట్టాలని ప్రజలు, పెండింగ్ బిల్లుల బకాయిదార్లు కోరుతున్నారు.

రామోజీరావు మరణం పట్ల టీఎస్‌యూటీఎఫ్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనాడు వ్యవస్థాపక సంపాదకులు రామోజీరావు మరణం విచారకరమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1974లో ప్రారంభమైన ఈనాడు దినపత్రిక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పత్రికా రంగంలో నూతన ఒరవడిని సృష్టించిందని పేర్కొన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆ పత్రిక నిలబడిందని తెలిపారు. స్వల్ప కాలంలోనే అత్యధిక సర్క్యులేషన్ కలిగిన పత్రికగా ఎదిగి తనకంటూ ప్రత్యేకతను ఏర్పాటు చేయడంలో రామోజీరావు కృషి ఉందని వివరించారు. యాదృచ్ఛికమే అయినా ఈనాడు, యూటీఎఫ్ ఒకే రోజు (1974, ఆగస్టు 10) ఆవిర్భవించడం విశేషమని తెలిపారు. రామోజీరావు మరణం పట్ల సంతాపం, కుటుంబ సభ్యులు, ఈనాడు సిబ్బందికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

రామోజీరావు మృతికి టీఎస్‌జీహెచ్ఎంఏ నివాళి

పద్మవిభూషణ్ రామోజీరావు మరణం పట్ల టీఎస్‌జీహెచ్ఎంఏ అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం సంతాపం తెలిపారు. ఈనాడు, సితార, చతుర, విపుల, అన్నదాత పత్రికా రంగంలో మహోజ్వలంగా వెలుగు వెలిగాయని పేర్కొన్నారు. ఈనాడు దినపత్రిక జర్నలిజానికి కొత్త ఒరవడిని సృష్టించిందని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

రామోజీరావు మరణం పట్ల తపస్ సంతాపం

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణం పట్ల తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ సంతాపం తెలిపారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరనిలోటని పేర్కొన్నారు. జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావుకు దక్కుతుందని తెలిపారు.

తీన్మార్ మల్లన్నకు శుభాకాంక్షలు : సీపీఎస్‌టీఈఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించడం పట్ల సీపీఎస్‌టీఈఏ అధ్యక్షులు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే లక్ష్యాన్ని చేరుకుంటామని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ రేట్లు పెంపు

కొత్తగా 65 చికిత్సలు

నిధులు విడుదల చేసిన ఆర్థికమంత్రి భట్టి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో ప్యాకేజీ రేట్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుముక వంటి మరో 65 రకాల వ్యాధుల్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం దీనికి సంబంధించిన రూ.497.29 కోట్ల నిధుల్ని విడుదల చేశారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 2.84 కోట్ల మంది లబ్ధిపొందారనీ, 1402 ఆస్పత్రుల ద్వారా సేవలు అందించబడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఈ పథకంలో 1672 చికిత్సా విధానాలు అందుబాటులో వున్నాయి. ఇందులో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లోని 98 చికిత్సా విధానాలను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చడంతో ప్రభుత్వంపై దాదాపు 189.83 కోట్ల ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. 65 కొత్త చికిత్సా విధానాలు అంగీకారం వల్ల అదనంగా రూ. 158.20 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేశారు.

నేడే గ్రూప్-1 ప్రిలిమ్స్

(మొదటిపేజి తరువాయి)

హాజరు ఉన్నందున అభ్యర్థుల చేతి వేళ్లపై మెహందీ (గోరింటాకు), టాటూలు వేసుకుని రావొద్దు. పరీక్షకు హాజరయ్యేటపుడు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డు (ఒరిజినల్)ను వెంట తెచ్చుకోవాలని అభ్యర్థులకు అధికారులు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్, మూడు నుంచి ఐదు కేంద్రాలకు ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. గ్రూప్-1 పరీక్షకు సకాలంలో అభ్యర్థులు హాజరయ్యేందు కు టీజీఎస్ఆర్టీసీ ఆదివారం ప్రత్యేక బస్సులను నడపనుంది. పరీక్షా కేంద్రా ల్లోకి కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, పెన్‌డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, మ్యాథమెటికల్ టేబుల్స్, బ్యాగ్‌లు, ప్యాడ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తేవడాన్ని నిషేధించారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే.


ఆర్టీసీ బస్సెక్కండి

(మొదటిపేజి తరువాయి)

వీసీ సజ్జనార్ సంతాపం తెలిపారు. శనివారంనాడాయన రామోజీ నివాసంలో పార్థివ దేహాన్ని దర్శించి, పుష్పగుచ్ఛాలు ఉంచి, శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రామోజీరావు వ్యక్తిత్వం, వృత్తి వికాసాన్ని కొనియాడారు.

ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ

(మొదటిపేజి తరువాయి)



తీసుకుంటారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ చెప్పారు. తమ నాయకుడు, కార్యకర్తలను ఉత్సాహపరచడంతో కాంగ్రెస్ పునరుజ్జీవనం ప్రారంభమైందని వేణుగోపాల్ తెలిపారు. సీడబ్ల్యూసీలో నాలుగు నెలల క్రితంతో పోలిస్తే వాతావరణం పూర్తిగా భిన్నంగా, ఉత్సాహంగా ఉందని ఆయన అన్నారు. 'రాహుల్ గాంధీ కచ్చితంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత కావాలి. ఇది మా కార్యవర్గ అభ్యర్థన. ఆయన నిర్భయుడు, ధైర్యవంతుడు' అని సీడబ్ల్యూసీ సమావేశం అనంతరం కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ప్రమోద్ తివారీ అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహా, కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య, మంత్రులు డీకే శివకుమార్, హిమాచల్ సీఎం సుక్విందర్ సింగ్ సుకు, ఏపీ నుంచి రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, జెడి శీలం, పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాత్రి ఎంపీలతో రాహుల్ గాంధీ విందు సమావేశం ఏర్పాటు చేశారు.

పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు (పీఎస్‌హెచ్‌ఎం) పోస్టులను మంజూరు చేయాలని టీపీటీఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. పారదర్శకంగా, మెరిట్ జాబితాలో ఎలాంటి అక్రమాలు జరగకుండా నిర్వహించాలని సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలని పేర్కొన్నారు. రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తెలిపారు. బడుల్లో జరుగుతున్న పనులకు పూర్తి బాధ్యత అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకే అప్పగించాలని సూచించారు. పనుల ఆలస్యంలో ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయడం సరైంది కాదని పేర్కొన్నారు.



అన్షు, అంతిమ్ సిల్వర్ షో

బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్



బుడాపెస్ట్ (హంగేరీ) : భారత మహిళా రెజ్లర్లు అన్షు మాలిక్, అంతిమ్ పంఘాల్ పతక ప్రదర్శన చేశారు. బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్ 2024 టోర్నమెంట్ మహిళల 53 కేజీల విభాగంలో అన్షు మాలిక్ సిల్వర్ మెడల్ సాధించింది. పసిడి పోరులో అన్షు మాలిక్ 1-12తో చైనా రెజ్లర్ హాంగ్ చేతిలో ఓటమి చెందింది. మహిళల 57 కేజీల విభాగం ఫైనల్లో అంతిమ్ పంఘాల్ 0-4తో స్వీడన్ రెజ్లర్ జోన్నా చేతిలో ఓటమి పాలైంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అన్షు మాలిక్, అంతిమ్.. బుడాపెస్ట్‌లో రజత పతకాలు సాధించి ఆత్మవిశ్వాసం రెట్టింపు చేసుకున్నారు. మహిళల 50 కేజీల విభాగంలో వినేశ్ ఫోగట్‌కు నిరాశే ఎదురైంది. అమన్ షెరావత్ ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరి సిల్వర్ మెడల్‌తో సరిపెట్టుకుంది.



టీ20 ప్రపంచకప్ టైటిల్ ఫేవరేట్ న్యూజిలాండ్‌కు దిమ్మతిరిగే షాక్ తగిలింది. గ్రూప్-సి తొలి మ్యాచ్‌లో అఫ్గనిస్థాన్ చేతిలో న్యూజిలాండ్ 84 పరుగుల తేడాతో దారుణ పరాజయం చవిచూసింది. రెహ్మనుల్లా గుర్బాజ్ (80) మెరుపులతో తొలుత అఫ్గాన్ 159 పరుగులు చేయగా.. ఛేదనలో కివీస్ కుప్పకూలింది. 15.2 ఓవర్లలో 75 పరుగులకే చేతులెత్తేసింది. టీ20 ఫార్మాట్‌లో న్యూజిలాండ్‌పై అఫ్గనిస్థాన్‌కు ఇదే తొలి విజయం.

కివీస్‌కు షాక్

అఫ్గాన్ చేతిలో అనూహ్య ఓటమి

అఫ్గనిస్థాన్ 159/6, న్యూజిలాండ్ 75/10

నవతెలంగాణ-ప్రొవిడెన్స్

పసికూన కాదు. ఫేవరేట్లను సైతం పరాజితులను చేయగల సత్తా ఉన్న జట్టుగా అఫ్గనిస్థాన్ మరో మెరుపు విజయం సాధించింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ గ్రూప్-సిలో శనివారం జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 84 పరుగుల తేడాతో అఫ్గనిస్థాన్ ఘన విజయం సాధించింది. రెహ్మనుల్లా గుర్బాజ్ (80, 56 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సులు), ఇబ్రహీం జద్రాన్ (44, 41 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) మెరుపులతో తొలుత అఫ్గనిస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులు చేసింది. ఛేదనలో న్యూజిలాండ్ అనూహ్యంగా కుప్పకూలింది. పేసర్ ఫరూకీ (4/17), స్పిన్నర్ రషీద్ ఖాన్ (4/17) నాలుగు వికెట్ల మ్యాజిక్‌తో న్యూజిలాండ్ 15.2 ఓవర్లలో 75 పరుగులకు ఆలౌటైంది. గ్లెన్ ఫిలిప్స్ (18, 18 బంతుల్లో 2 ఫోర్లు), మాట్ హెన్రీ (12, 17 బంతుల్లో 1 సిక్స్) మాత్రమే కివీస్ తరఫున రెండెంకల స్కోరు సాధించారు. అఫ్గాన్ బ్యాటర్ రెహ్మనుల్లా గుర్బాజ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. గ్రూప్-సిలో వరుసగా రెండో విజయం సాధించిన అఫ్గనిస్థాన్ అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఇదే గ్రూప్‌లో వెస్టిండీస్ సైతం ఉండటంతో.. గ్రూప్ దశలోనే ఓ అగ్ర జట్టు నిష్క్రమించనుంది.


దాయాదుల ధనాధన్

దాయాదుల ధనాధన్ ప్రపంచ కమర్షియల్ మార్కెట్ రాజధాని అమెరికా రంగం సిద్ధం చేసింది. నేడు న్యూయార్క్ నాసా కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో భారత్, పాకిస్థాన్ గ్రూప్-ఏ మ్యాచ్‌లో సమరానికి సై అంటున్నాయి. ఆతిథ్య అమెరికా చేతిలో అవమానకర ఓటమితో పాకిస్థాన్ క్రికెటర్లు నైరాశ్యంలో ఉండగా.. తొలిమ్యాచ్‌లో అలవోక విజయంతో టీమ్ ఇండియా క్రికెటర్లు ఉత్సాహంగా కనిపిస్తున్నారు. అమెరికా వేదికగా భారత్, పాకిస్థాన్ టీ20 థ్రిల్లర్ నేడే.

నేడు భారత్, పాకిస్థాన్ ఢీ
విజయమే లక్ష్యంగా టీమ్ ఇండియా
ఓటమి నైరాశ్యంలో పాక్ శిబిరం
నేడు రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-న్యూయార్క్





జోరుమీదున్న భారత్ : పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు టీమ్ ఇండియా ఉత్సాహంగా సిద్ధమవుతుంది. వార్మప్ మ్యాచ్‌లో బ్యాట్‌తో, బంతితో మెరిసిన రోహిత్‌సేన.. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై అలవోక విజయం సాధించింది. టాప్ ఆర్డర్‌లో విరాట్ కోహ్లి మినహా అందరూ మంచి ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ కఠిన పరిస్థితుల్లో స్ఫూర్తిదాయక అర్థ సెంచరీ సాధించాడు. నం.3 స్థానంలో రిషబ్ పంత్ అదరగొడుతున్నాడు. వార్మప్‌లో, ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో పంత్ అజేయ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. యశస్వి జైస్వాల్ బెంచ్‌కు పరిమితం కానుండగా.. విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్ మరింత బాధ్యత తీసుకోవాలి. రోహిత్ మరోసారి నలుగురు ఆల్‌రౌండర్లతో ఆడనున్నాడు. హార్దిక్ పాండ్య, శివం దూబె, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లు భారత విజయంలో ఎక్స్ ఫ్యాక్టర్‌గా నిలువనున్నారు. ఇటు బంతితో, అటు బ్యాట్‌తో ఈ నలుగురు మెరిస్తే భారత్‌కు తిరుగుండదు. జశ్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్‌లు స్పెషలిస్ట్ పేసర్లుగా తుది జట్టులో ఉండనున్నారు.

పుంజుకుంటారా? : కీలక మ్యాచ్ ముంగిట పాకిస్థాన్ క్రికెటర్లు ఆత్మవిశ్వాసం కోల్పోయారు. పసికూన అమెరికా చేతిలో ఓటమితో ఇంటా, బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. కెప్టెన్ బాబర్ ఆజామ్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడు. నేడు భారత్‌తో మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేయగలిగితే డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణంలో మార్పులు రావచ్చు. పేసర్లు షహీన్ అఫ్రిది, మహ్మద్ ఆమీర్, నసీం షాలపై పాకిస్థాన్ ఎక్కువ ఆశలు పెట్టుకుంది. పేస్ త్రయం భారత బ్యాటర్లను ఇరకాటంలో పడేస్తే.. పాక్ బ్యాటర్ల పని సులభతరం కానుంది. మరి జోరుమీదున్న భారత బ్యాటర్లను పాక్ ఏ మేరకు అడ్డుకుంటుందో చూడాలి. బాబర్ ఆజామ్, మహ్మద్ రిజ్వాన్, ఇఫ్తికార్ అహ్మద్ సహా ఫకర్ జమాన్‌లకు భారత్‌పై మంచి రికార్డుంది. సీనియర్ బ్యాటర్లు న్యూయార్క్ పిచ్‌పై సహనంతో నిలబడితేనే పాకిస్థాన్ కనీస పోటీ ఇవ్వగలిగే పరిస్థితులు ఉన్నాయి.

అజాగ్రత్త వద్దు! : భారత బ్యాటర్లు ఎంతటి ఫామ్‌లో ఉన్న లెఫ్టార్మ్ సీమర్లకు వికెట్లు పారేసుకోవటం అతిపెద్ద బలహీనత. పాకిస్థాన్ శిబిరంలో షహీన్ షా అఫ్రిదికి ఇప్పుడు మహ్మద్ ఆమీర్ తోడయ్యాడు. ఇమద్ వసీంతో పాటు నషీం షా సైతం అత్యంత ప్రమాదకారి. పవర్‌ప్లే సహా మిడిల్ ఓవర్లలోనూ కుడి చేతి పేసర్ల ప్రమాదం పొంచి ఉంది. గతంలో కీలక మ్యాచుల్లో అఫ్రిది, ఆమీర్ భారత్‌ను దారుణంగా దెబ్బతీశారు. న్యూయార్క్‌లో రోహిత్‌సేన ఆ ట్రాప్‌లో పడకుండా చూసుకోవాలి.

పిచ్, వాతావరణం : భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవని తెలుస్తోంది. ఉదయం వేళల్లో ఆటకు ఇప్పటికే ఇరు జట్ల క్రికెటర్లు అలవాటు పడ్డారు. నాసా కౌంటీ స్టేడియం పిచ్ ఇరు జట్ల శిబిరాల్లో గుబులు రేపుతోంది. నేడు మ్యాచ్‌కు కొత్త పిచ్‌ను వాడనున్నారు. ఫలితంగా అదనపు బౌన్స్, పదునైన పేస్ అనివార్యం. పాకిస్థాన్ పేసర్లకు ఇది పండుగే కానీ.. భారత పేస్ దళం సైతం ఇక్కడ అదరగొట్టగలదు. పరుగుల వేట గగనం కానున్న పిచ్‌పై ఇరు జట్ల బ్యాటర్లపై ప్రధానంగా ఫోకస్ ఉండనుంది. ఇక్కడ 160-180 పరుగులు చేయగలిగితే విజయంపై ధీమాగా ఉండవచ్చు!. టాస్ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు.

స్వైటెక్ హ్యాట్రిక్

వరుసగా మూడోసారి
ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ వశం
ఫైనల్లో పావొలినిపై గెలుపు



పారిస్ (ఫ్రాన్స్) : పొలాండ్ స్టార్ ఇగా స్వైటెక్ హ్యాట్రిక్ కొట్టింది. ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా మూడో ఏడాది సొంతం చేసుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో జాస్మిన్ పావొలిని (ఇటలీ)పై స్వైటెక్ వరుస సెట్లలో విజయం సాధించింది. 6-2, 6-1తో జాస్మిన్‌ను చిత్తు చేసిన స్వైటెక్ ఓవరాల్‌గా ఫ్రెంచ్ ఓపెన్‌లో నాల్గో టైటిల్ సొంతం చేసుకుంది. 2020లో తొలిసారి ఇక్కడ చాంపియన్‌గా నిలిచిన స్వైటెక్.. 2022, 2023, 2024లలో వరుసగా విజయం సాధించింది. ఓవరాల్‌గా స్వైటెక్‌కు ఇది ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్ (2020లో యుఎస్ ఓపెన్ నెగ్గింది). టైటిల్ పోరులో స్వైటెక్ ఏకపక్ష విజయం సాధించింది. ఐదు బ్రేక్ పాయింట్లతో అలవోక విజయం సాధించింది. పాయింట్ల పరంగా 57-31తో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించింది. ఇటలీ అమ్మాయి ఓ బ్రేక్ పాయింట్‌తో సరిపెట్టుకుంది. ఓవరాల్‌గా స్వైటెక్ 12 గేమ్ పాయింట్లు సాధించగా.. జాస్మిన్ 3 గేమ్ పాయింట్లు మాత్రమే గెల్చుకుంది. ఇక నేడు జరిగే మెన్స్ సింగిల్స్ ఫైనల్లో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) అమీతుమీ తేల్చుకోనున్నాడు.

బంగ్లా బ్యాంగ్

- శ్రీలంకపై ఉత్కంఠ విజయం
- శ్రీలంక 124/9, బంగ్లాదేశ్ 125/8



నవతెలంగాణ-డల్లాస్ : అమెరికా పిచ్‌లపై స్వల్ప స్కోర్ల పరంపర కొనసాగుతుంది. శ్రీలంక, బంగ్లాదేశ్‌లో స్కోర్ల థ్రిల్లర్‌లో బంగ్లాదేశ్ 2 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గ్రూప్-డిలో శ్రీలంకకు ఇది వరుసగా రెండో పరాజయం కాగా.. బంగ్లాదేశ్ తొలి విజయం నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 9 వికెట్లకు 124 పరుగులు చేసింది. ఓపెనర్ నిశాంక (47, 28 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వ (21), అసలంక (19), మాథ్యూస్ (16) మినహా శ్రీలంక బ్యాటర్లలో ఎవరూ రాణించలేదు. మెండిస్ (4), కుశాల్ (10), హసరంగ (0), శనక (3) విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లలో ముస్తాఫిజుర్, రిషద్ మూడేసి వికెట్లు పడగొట్టారు. ఊరించే ఛేదనలో తౌహిద్ హృదయ్ (40, 20 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సులు), లిటన్ దాస్ (36, 38 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఓపెనర్లు హసన్ (3), సర్కార్ (0), నజ్ముల్ (7) విఫలమైనా.. విలువైన భాగస్వామ్యంతో బంగ్లాదేశ్‌కు విజయాన్ని అందించారు. ఆఖర్లో మహ్మదుల్లా (16 నాటౌట్) ఆకట్టుకున్నాడు. బంగ్లా స్పిన్నర్ రిషద్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

పీఈటీలకు పదోన్నతులపై పెటాటీఎస్



హైదరాబాద్ : వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఏండ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతుల ఫైల్‌కు మోక్షం కలిగింది. 2017, 2019 నుంచి ఎదురైన న్యాయపరమైన అడ్డంకులను తొలగిస్తూ రాష్ట్ర విద్యా శాఖ పదోన్నతులు, బదిలీలు షెడ్యూల్‌లో పీఈటీలను సైతం చేర్చారు. గతంలో అప్‌గ్రేడ్ చేసిన 1849 స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను ఈ షెడ్యూల్‌లోనే చేర్చటంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేవసేనలకు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం తెలంగాణ (పెటాటీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు బి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి గౌడ్‌లు కతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘ సమస్యను పరిష్కరించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పీఈటీలు అందరూ రుణపడి ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు.

విన్నర్ కార్ల్‌సన్

ప్రజ్ఞానందకు మూడో స్థానం



స్టావెంజర్ (నార్వే) : మాగ్నస్ కార్ల్‌సన్ నార్వే చెస్ 2024 చాంపియన్‌గా నిలిచాడు. మెన్స్ విభాగంలో 19 పాయింట్లు సాధించిన లోకల్ స్టార్ తిరుగులేని విజయం సాధించాడు. ఫైనల్ రౌండ్లో ఫాబియానో (అమెరికా)పై కార్ల్‌సన్ గెలుపొందాడు. రెండో స్థానంలో నిలిచిన హికారు నకముర (అమెరికా)ను ఆర్. ప్రజ్ఞానంద ఓడించాడు. 15.5 పాయింట్లతో నకముర రెండో స్థానంలో నిలువగా..14.5 పాయింట్లతో చెన్నై చిన్నోడు మూడో స్థానం సాధించాడు. అలిరెజా నాల్గో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో జు వెంజున్ (చైనా) 19 పాయింట్లతో విజేతగా నిలిచింది. వైశాలి, కోనేరు హంపి వరుసగా 4, 5 స్థానాలు సాధించారు.


వరుసగా ఏడో ఓటమి

2-4తో భారత్‌పై జర్మనీ గెలుపు



లండన్ (ఇంగ్లాండ్) : ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్‌లో టీమ్ ఇండియా అమ్మాయిలు జర్మనీ చేతిలో వరుసగా ఏడో ఓటమి చవిచూశారు. శనివారం లండన్‌లో జరిగిన మ్యాచ్‌లో జర్మనీ 4-2తో భారత్‌పై గెలుపొందింది. తొలి క్వార్టర్‌లో సునెలిట (9వ నిమిషం), దీపిక (15వ నిమిషం) గోల్స్ కొట్టి భారత్‌ను 2-0తో ముందంజలో నిలిపారు. కానీ జర్మనీ ఎంతో సేపు ఆగలేదు. విక్టోరియా వరుసగా పెనాల్టీ కార్నర్‌లను (23, 32వ నిమిషం) గోల్స్‌గా మలిచి స్కోరు సమం చేసింది. స్టినె, జులె సైతం గోల్స్ కొట్టగా జర్మనీ 4-2తో తిరుగులేని ఆధిక్యం సాధించింది. ప్రొ లీగ్ చివరి మ్యాచ్‌లో గ్రేట్ బ్రిటన్‌తో భారత అమ్మాయిలు ఆడనున్నారు.

వినోద రంగంలోనూ సంచలనమే..



నవచిత్రం



రామోజీరావు..

పత్రికాధిపతిగా, వ్యాపారవేత్తగానే కాకుండా ఉత్తమాభిరుచిగల నిర్మాతగా, స్టూడియో నిర్వాహకులుగా బహుముఖంగా విజయాలు సాధించారు. మిగిలిన రంగాలతోపాటు వినోద రంగంలోనూ సంచలనాలు సృష్టించారు. సినిమాలంటే కదిలే బొమ్మలు మాత్రమే కాదు మనసుల్ని కదలించే బొమ్మలనే విశ్వాసాన్ని ఆచరణలో పెడుతూ ఆయన నిర్మించిన పలు చిత్రాలు ప్రేక్షకుల ఆదరణతో సంచలన విజయాలను సాధించాయి. వినోదంతోపాటు మహిళా శక్తి, మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తూ నిజ జీవిత కథలను, వాస్తవ ఘటనలను వెండితెరపై ఆవిష్కరించి అఖండ విజయాలను సొంతం చేసుకున్నారు. అటు వెండితెరపై, ఇటు బుల్లితెరపై తనదైన చెరగనిముద్ర వేయడంతోపాటు ప్రపంచంలోనే అత్యంత పెద్ద స్టూడియోగా రామోజీ ఫిల్మ్ సిటీని స్థాపించి వినోద ప్రపంచంలోనూ రారాజే అనిపించుకున్న రామోజీరావు సినీ జీవిత ప్రయాణంలోని కొన్ని విశేషాలు..

- పాత్రికేయంతో తెలుగు ప్రజలపై చెరగని ముద్ర వేసిన ఈనాడుకు అనుబంధంగా 'సితార' సినిమా వారపత్రికను 1976లో ఆరంభించారు. విలువలు ఉన్న చిత్రాల్ని ప్రోత్సహించే దిశగానూ రామోజీరావు ఆలోచన చేశారు. ఆరోగ్యకరమైన వినోదాన్ని ప్రేక్షకులకు అందించాలనే సదుద్దేశంతో 1983లో ఉషాకిరణ్ మూవీస్ నిర్మాణ సంస్థను ప్రారంభించారు.
- 'ప్రేమలేఖ' నవలను జంధ్యాల దర్శకత్వంలో 'శ్రీవారికి ప్రేమలేఖ' పేరుతో సినిమాని తొలి సినిమాగా నిర్మించారు. విశేష ప్రేక్షకాదరణతో ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుని, ఉషాకిరణ్ సంస్థకు తొలి విజయాన్ని అందించింది.
- నిజ జీవితం ఆధారంగా తెరకెక్కించిన 'మయూరి' సంచలన విజయం సాధించడం విశేషం. ప్రమాదంలో కాలును పోగొట్టుకుని, కృత్రిమ పాదంతో నాట్యంలో రాణించిన సుధా చంద్రన్ జీవితాన్ని మయూరిగా తెరపై ఆవిష్కరించడం ఓ విశేషమైతే, ఆ పాత్రలో సుధా చంద్రనే నటించడం మరో విశేషం.
- ఒడిశాలో జరిగిన సంఘటన ఆధారంగా 'మౌనపోరాటం' చిత్రాన్ని నిర్మించారు. మగాడి చేతిలో మోసపోయిన ఓ వనిత పోరాటాన్ని అత్యంత ప్రభావ శీలంగా తెరకెక్కించారు. ఈ సినిమా సైతం అఖండ విజయాన్ని సాధించింది. దీని తర్వాత అదే స్థాయి విజయాన్ని సాధించిన చిత్రం 'ప్రతిఘటన'.
- సంఘ విద్రోహులతో పోరాడే తెగువ ఉన్న ఓ వనిత గాథను ఆవిష్కరించిన చిత్రమిది. అలాగే ఈ చిత్రంలోని పాటల్లోని సాహిత్యం సైతం మహిళ శక్తిని, ఆమె ఔచిత్యాన్ని తెలుపేలా ఉంటూ అందర్ని మెప్పించాయి. ఈ సినిమాలకు భిన్నంగా క్రీడాకారిణి అశ్విని నాచప్ప జీవితాన్ని 'అశ్విని' సినిమాగా మలిచి మరో విజయాన్ని సొంతం చేసుకుంది.
- ఈ సంస్థపై నిర్మితమైన తేజ, మనసు మమత, అమ్మ, జడ్జిమెంట్, పీపుల్స్ ఎన్‌కౌంటర్ వంటి తదితర చిత్రాలు నాటి సమాజిక పరిస్థితులకు దర్పణం పట్టాయి. వీటికి పూర్తి భిన్నంగా 'చిత్రం', 'నువ్వేకావాలి', 'ఆనందం' వంటి తదితర యువతరం చిత్రాలు ఘన విజయాల్ని నమోదు చేసుకున్నాయి. కేవలం తెలుగు చిత్రాలకే పరిమితం కాకుండా ఇతర భాషల్లోనూ తీసి సత్తా చాటారు.
- 'నాచే మయూరి', 'ప్రతిఘాత్' చిత్రాలు బాలీవుడ్‌లోనూ విజయకేతనాన్ని ఎగురవేశాయి. కన్నడ, తమిళం, మరాఠి, ఇంగ్లీష్ వంటి తదితర భాషల్లో దాదాపు 87 చిత్రాలను నిర్మించారు.
- 'నిన్ను చూడాలని' సినిమాతో ఎన్టీఆర్‌ని హీరోగా పరిచయం చేశారు. శ్రీకాంత్, వినోద్‌కుమార్, చరణ్‌రాజ్, యమున, వరుణ్ రాజ్, ఉదయ్‌కిరణ్, తరుణ్, రీమాసేన్, జెనీలియా, రితేష్ దేశ్‌ముఖ్, రిచా పల్లోడ్, మాధవీలతని నటీనటులుగా, గాయనిగా ఉన్న ఎస్. జానకిని 'మౌనపోరాటం' చిత్రంతో సంగీత దర్శకురాలిగా ప్రేక్షకులకు పరిచయం చేశారు.
- 1995వ సంవత్సరంలో ఈటీవీ ఛానల్‌ని ప్రారంభించారు. వినోద రంగాల్లోనూ తెలుగువారికి ఈటీవీ ప్లస్, ఈటీవీ సినిమా, ఈటీవీ అభిరుచి, ఈటీవీ లైఫ్, ఈటీవీ బాలభారత్ ఛానళ్ళను అందుబాటులోకి తీసుకొచ్చి ట్రెండ్ సెట్ చేశారు. ఇక రామోజీ ఆలోచనల నుంచి పుట్టిందే 'పాడుతా తీయగా..'. ఈ కార్యక్రమం ద్వారా ప్రేక్షకులపై సుమధుర సంగీత జల్లు కురిపించారు. మల్లికార్జున్, ఉష, గోపికా పూర్ణిమ వంటి వందలమంది గాయనీగాయకులను సంగీత ప్రపంచానికి పరిచయం చేశారు. మయూరి అనే ఫిలిం డిస్ట్రిబ్యూషన్ ఆఫీసును కూడా మొదలుపెట్టి అనేక చిత్రాలను పంపిణీ చేశారు.
- తొలి చిత్రం 'శ్రీవారికి ప్రేమలేఖ' నుంచే ప్రేక్షకుల మెప్పుతోపాటు ప్రభుత్వ పురస్కారాలూ వరించాయి. 'కాంచనగంగ', 'మయూరి', 'ప్రతి ఘటన', 'తేజ', 'మౌన పోరాటం' వంటి చిత్రాలకు నంది అవార్డులు దక్కగా, 'మయూరి'లో నటించిన సుధాచంద్రన్‌కు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. 'నువ్వే కావాలి' చిత్రం జాతీయ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా పురస్కారాన్ని సొంతం చేసుకుంది.
- రామోజీ ఫిలిం సిటీని ప్రపంచంలోనే అతి పెద్ద సినిమా స్టూడియోగా నిర్మించారు. ఈ స్టూడియో గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కింది. అంతేకాదు ఇదొక పర్యాటక ప్రాంతంగా విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది.
- యు.విశ్వేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన 'మార్పు' అనే సినిమాలో రామోజీరావు న్యాయమూర్తి పాత్ర పోషించారు.



కన్నీటి పర్యంతమైన దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు




రామోజీరావు పార్థివ దేహానికి నివాళి అర్పిస్తున్న పవన్‌కళ్యాణ్



ఆదివారం షూటింగ్‌లు బంద్

రామోజీరావు మృతికి సంతాప సూచకంగా ఆదివారం చిత్ర పరిశ్రమ బంద్‌కు చలన చిత్ర నిర్మాతల మండలి పిలుపునిచ్చింది. షూటింగ్‌లతోపాటు సినిమాకి సంబంధించి అని కార్యకలాపాలను నిలిపివేయనున్నారు.











తల వంచని మేరు పర్వతం



ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు నివాళులు అర్పించారు. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ ఆయనతో తమకి ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియా వేదికగా గుర్తు చేసుకున్నారు.

నా గురువు, శ్రేయోభిలాషి రామోజీరావు మరణవార్త నన్ను ఎంతగానో బాధించింది. జర్నలిజం, సినిమా రంగాల్లో చరిత్ర సృష్టించారు.
- రజనీకాంత్

రామోజీ ఫిల్మ్ సిటీ ఓ అద్భుతం. అది షూటింగ్ లొకేషన్ మాత్రమే కాదు, ప్రముఖ పర్యాటక కేంద్రంగా కూడా ఆదరణ పొందుతోంది. అంత దూరదృష్టి, వినూత్న ఆలోచనాపరుడు మరణించడం సినీ పరిశ్రమకు తీరని లోటు.
- కమల్‌హాసన్

ఎవరికీ తలవంచని మేరు పర్వతం దివికేగింది.
- చిరంజీవి

రామోజీరావు మహోన్నత వ్యక్తి. పత్రికా రంగంలో రారాజు. ఆయన విజన్, ఆలోచనా విధానం చాలా గొప్పది.
- మోహన్‌బాబు

తెలుగు నుడికారానికి ఒక కొత్త కళను తెచ్చారు. జర్నలిజానికి కొత్త సొబగును దిద్దారు. చిత్రసీమలో అదే తీరున సాగి ఉషోదయ కిరణాలను ప్రసరింపజేశారు.
- బాలకృష్ణ

రామోజీరావు నిజమైన దార్శనికుడు, భారతీయ మీడియాలో ఆయన విప్లవాత్మక కృషి చేశారు. జర్నలిజం, సినీ రంగంలో ఆయన చేసిన కృషి ఎంతోమందికి స్ఫూర్తి.
- వెంకటేష్

రామోజీరావు గొప్ప దార్శనికుడు. ఎంచుకున్న ప్రతి రంగంలోనూ విజయాలను అందుకున్నారు.
- నాగార్జున

సినీ నిర్మాతగా, స్టూడియో నిర్వాహకులుగా, వ్యాపారవేత్తగా, మీడియా మొఘల్‌గా అలుపెరగని పోరాటం చేశారు.
- పవన్‌కళ్యాణ్

ఎంతో ముందు చూపు ఉన్న గొప్ప వ్యక్తి రామోజీరావు. సినిమాపై ఆయనకి ఉన్న అభిరుచికి రామోజీ ఫిల్మ్ సిటీ ఓ నిదర్శనం.
- మహేష్‌బాబు

'నిన్ను చూడాలని'తో నన్ను తెలుగు సినిమా పరిశ్రమకు పరిచయం చేసినప్పటి జ్ఞాపకాలు ఎప్పటికీ మరువలేను.
- ఎన్టీఆర్

నేను గౌరవించే స్ఫూర్తిదాయక వ్యక్తుల్లో రామోజీరావు ఒకరు. మీడియా, సినిమా, ఇతర రంగాలకు ఆయన చేసిన సేవలు మరువలేనివి.
- అల్లు అర్జున్

ఒక మనిషి అనేక రంగాల్లో వివిధ సంస్థలు స్థాపించి వాటిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు. భారతరత్నతో ఆయనను సత్కరించడమే మనమిచ్చే ఘనమైన నివాళి.
- దర్శకుడు రాజమౌళి



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

సరోగసీ - రెడీమేడ్ బేబీస్



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



అమృతనం అమృతమంత కమ్మదనం. అదో అనిర్వచనీయ అద్వితీయ వరం. అమ్మ అవడమే ఆమె జీవితానికి పరిపూర్ణం. పిల్లలు లేని మహిళ జీవితం నరక సమానంగా భావించే సమాజం. అనారోగ్యాలు, జన్యుపరమైన లోపాలు లాంటి పలు కారణాలతో తల్లితండ్రులు కాలేని కొందరు దంపతులకు అపూర్వ అవకాశంగా ఆధునిక నైపుణ్య వైద్యరంగం "అద్దె గర్భం లేదా సరోగసీ" ప్రక్రియను ప్రవేశపెట్టింది. నవమాసాలు మోయడమే భారంగా, భౌతిక అందం మెరుపులు తరుగుతుందనే నెపం, వెండి తెర అవకాశాలు తగ్గుతాయనే భయం లాంటి కారణాలతో సినీపరిశ్రమకు చెందిన పలువురు నటీనటులు సంతానం కోసం 'సరోగసీ' పద్ధతిని రహస్యంగా ఆశ్రయించి తల్లితండ్రులు కావడం సర్వసాధారణం అయ్యింది. 21 జనవరి 2022న ప్రముఖ బాలీవుడ్/హాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా-నిక్ జోనాస్ దంపతులు సరోగసీ పద్ధతిలో బిడ్డను కన్నామని సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. 2018 డిసెంబర్‌లో తన కన్న 10 ఏండ్లు చిన్నవాడైన హాలీవుడ్ పాటగాడు నిక్ జోనాస్‌తో బాలీవుడ్ గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా వివాహం జరగడం మనకు తెలుసు. ప్రస్తుతం అమెరికా లాస్ ఏంజెలిస్‌లో నివాసముంటున్న ప్రియాంక ఇప్పుడు కూడా బాలీవుడ్ సినిమాల్లో నటిస్తూనే ఉన్నారు. ప్రియాంక చోప్రా సరోగసీ ద్వారా తల్లి కావడంతో ఆమెకు శుభాకాంక్షలు తెలిపిన పెద్దలు కూడా ఉండడం విచిత్రకరం. ప్రియాంకకు ఆడ బిడ్డ లేదా మగ బిడ్డ అనే విషయంలో మాత్రం స్పష్టంగా ప్రకటించలేదు.

తల్లి అండాన్ని తండ్రి వీర్యాన్ని కృత్రిమంగా ఫలదీకరించి మూడో మహిళ గర్భంలో ప్రవేశ పెట్టడాన్ని సరోగసీ (ఐవియఫ్) అంటాం. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ లాంటి సినిమా పరిశ్రమలో అగ్ర నటీమణులు ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం, అనంతరం అద్దె గర్భం ద్వారా పిల్లల్ని కనడం ఓ ఘనకార్యమని ఘనంగా ప్రకటించడం విచారకరం. తెలుగు చిత్రసీమ మంచు లక్ష్మి నుంచి బాలీవుడ్ నటీనటులు షారుక్ ఖాన్-గౌరి, సన్నీలియోన్, అమీర్ ఖాన్-కిరణ్ రావు, ఫరా ఖాన్, తుషార్ కపూర్, ఏక్తా కపూర్, శిల్పా శెట్టి, ప్రీతి జింటా, కరణ్ జోహార్ వరకు అనేకులు అద్దె గర్భంతో పిల్లల్ని కనడం చూశాం. శారీరకంగా, మానసికంగా తల్లి కాదగిన అర్హతలున్న మహిళలు సహజ పద్ధతిలో పిల్లల్ని కనకుండా పలు విపరీత ఆక్షేపణీయ కారణాలతో సరోగసీని ఆశ్రయించడం ఆహ్వానించదగిన పరిణామం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పేదరికంలో మగ్గుతున్న భారత మహిళలు మరో మార్గం కనబడక డబ్బుల ఆశకు అద్దె గర్భం మోసేందుకు సిద్ధం అవుతున్నారు. గర్భం దాల్చిన రోజు నుండి అద్దె గర్భం మోస్తున్న గర్భవతి డాక్టర్ల పర్యవేక్షణతో నవ మాసాలు మోసి, ప్రసవానంతరం పసిగుడ్డును తల్లితండ్రులకు వదిలేసి నిష్క్రమిస్తారు. అద్దె గర్భం మోస్తున్న మహిళకు, సరోగసీని ఆశ్రయించిన తల్లితండ్రులకు మధ్య ఎలాంటి సంబంధం, పరిచయం ఉండదు. నవమాసాలు మోసి, పిల్లల్ని కని ఇతరులకు అప్పగించి, అద్దె గర్భ దాతలు డబ్బులు తీసుకొని వెళ్లిపోతారు. రహస్యంగా జరుగుతున్న సరోగసీ ప్రక్రియను ఆరోగ్యంగా ఉండి పిల్లల్ని కనగలిగిన అర్హతలున్న ధనవంతులు, సినిమా నటీమణులు ఆశ్రయించడం సరికాదనే అభిప్రాయం నెటిజన్ల నుంచి వ్యక్తమవుతున్నది.

పేదరికంలో మగ్గుతున్న భారత మహిళలు మరో మార్గం కనబడక డబ్బుల ఆశకు అద్దె గర్భం మోసేందుకు సిద్ధం అవుతున్నారు. గర్భం దాల్చిన రోజు నుండి అద్దె గర్భం మోస్తున్న గర్భవతి డాక్టర్ల పర్యవేక్షణతో నవ మాసాలు మోసి, ప్రసవానంతరం పసిగుడ్డును తల్లితండ్రులకు వదిలేసి నిష్క్రమిస్తారు. అద్దె గర్భం మోస్తున్న మహిళకు, సరోగసీని ఆశ్రయించిన తల్లితండ్రులకు మధ్య ఎలాంటి సంబంధం, పరిచయం ఉండదు. నవమాసాలు మోసి, పిల్లల్ని కని ఇతరులకు అప్పగించి, అద్దె గర్భ దాతలు డబ్బులు తీసుకొని వెళ్లిపోతారు. రహస్యంగా జరుగుతున్న సరోగసీ ప్రక్రియను ఆరోగ్యంగా ఉండి పిల్లల్ని కనగలిగిన అర్హతలున్న ధనవంతులు, సినిమా నటీమణులు ఆశ్రయించడం సరికాదనే అభిప్రాయం నెటిజన్ల నుంచి వ్యక్తమవుతున్నది. అగ్గువకే అద్దె గర్భాలు దొరుకుతున్న భారతదేశానికి విదేశీయులు కూడా సరోగసీ ద్వారా పిల్లల్ని కనడానికి అద్దె గర్భాలను వెతుక్కుంటూ ఇండియాకు క్యూ కడుతున్నారు. పలు కారణాలతో పిల్లల్ని కనలేని దంపతులకు వరంగా నిలుస్తున్న సరోగసీని సినీపరిశ్రమకు చెందిన వారు దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసే వారు కూడా ఉన్నారు.

"మాతృత్వానికి మరో దారి"గా సరోగసీ అవకాశం రావడం ఓ వైపు వరంగా, మరో వైపు శాపంగా మారింది. సరోగసీ ప్రక్రియను క్రమబద్ధం చేస్తూ, అర్హతలున్న దంపతులకే పరిమితం చేస్తూ, వ్యాపార ధోరణిని కట్టడి చేయడానికి భారత ప్రభుత్వం "సరోగసీ రెగ్యులేషన్ బిల్ - 2019"ను తీసుకురావడం ముదావహం. చట్టం ప్రకారం అద్దె గర్భం ఇస్తున్న మహిళకు వైద్య/పోషకాహార ఖర్చులు మాత్రమే ఇవ్వాలని, ఇతర ధనసహాయం చేయరాదని సూచించబడింది. "రెడీమేడ్ బేబీస్"ను కనడానికి చిత్రపరిశ్రమ దంపతులు సరోగసీని ఆశ్రయించడం సహేతుకంగా లేదని, ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తించవద్దని గమనించాలి. పేగుబంధమే అమ్మతనానికి పరిపూర్ణతని నేటి అందాల తారలు "అమ్మ" పాఠం నేర్చుకోవాలని ఆశిద్దాం.

ప్రాణాంతకంగా...ఆహార నాణ్యత!

ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతీ ఏడాది వివిధ రాష్ట్రాల్లో పాటిస్తున్న ఆహార ప్రమాణాలను పరిశీలిస్తుంది. పెద్ద, చిన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేటగిరీలుగా విభజించి.. 2018 నుంచి ఫుడ్ సేఫ్టీలో రాష్ట్రాల వారీగా ర్యాంకింగ్ ను కేటాయిస్తున్నది. 2020-21లో విడుదల చేసిన జాబితాలో తెలంగాణ రాష్ట్రం 36 పాయింట్లతో పదో స్థానంలో నిలిచింది. 2021-22లో 20 పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ 15వ స్థానంలో నిలిచింది. మొత్తం ఐదు కొలమానాల్లో వంద పాయింట్స్‌కు గాను రాష్ట్రానికి కేవలం 34.5 పాయింట్సే వచ్చాయి. 2022-23లో తెలంగాణ 12వ స్థానంలో నిలిచింది.



మహమ్మద్ ఆరిఫ్
7013147990

ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు హైదరాబాద్‌లోని రెస్టారెంట్లు, ఫైవ్ స్టార్ హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించి అక్కడ ఫుడ్ సేఫ్టీ రూల్స్ పాటించడం లేదని గుర్తించారు. స్ట్రీట్ ఫుడ్ అమ్మే ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి వారికి కనిపించింది. పురుగులు పట్టిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, కల్తీ మసాలాలు, మళ్లీ మళ్లీ కాచి వాడుతున్న నూనెలు, అపరిశుభ్రమైన వంటశాలలు ఉన్నట్లు నిర్ధారించారు. 40కి పైగా హోటళ్లపై కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ లోనే కాదు.. తెలంగాణలోని అన్ని పట్టణాల్లో ఇలాంటి పరిస్థితే ఉన్నది. ఇది ప్రజలకు ప్రాణాంతకంగా మారుతున్నది.



ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రకారం హోటళ్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. వంటశాల పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా పక్కాగా డ్రెయినేజీ వ్యవస్థ ఉండాలి. వంటపాత్రల నుంచి వంట చేసే వ్యక్తి, వడ్డించే వారు పరిశుభ్రత పాటించాలి. అంటువ్యాధులు లేవని వారు వైద్యుల నుంచి ధ్రువీకరణ పొందాలి. ప్రతిహోటల్‌కు లైసెన్సు తప్పనిసరి. కానీ చాలా హోటళ్లు నిబంధనలు పాటించడం లేదు. ఒక రిజిస్ట్రేషన్‌తోనే ఆ చుట్టు పక్కల రెండుమూడు హోటళ్లు నడుపుతున్నారు. దీంతో హోటళ్లలో కలుషిత ఆహారం వల్ల ప్రజలు అనేక అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. దీర్ఘకాలం పాటు కలుషిత ఆహారం తింటే జీర్ణకోశం పాడైపోవడం, చూపు మందగించడం, కీళ్ల నొప్పులు, క్యాన్సర్, గుండెపోటు, పక్షపాతం వంటి రోగాలు వచ్చే ప్రమాదమున్నదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.. కలుషిత ఆహారం తినడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా 60 కోట్ల మంది అనారోగ్యం పాలవుతున్నారు. 4.2 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అందులో 40 శాతం ఐదేళ్ల లోపు చిన్నారులే ఉంటున్నారు. ఇంటి భోజనాన్ని కాదని బయట ఫుడ్ తినే ప్రతి 10 మందిలో కచ్చితంగా ఒక్కరైనా తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారని డబ్ల్యూహెచ్‌వో పలు దేశాల్లో నిర్వహించిన సర్వే ద్వారా స్పష్టం చేసింది. భారత దేశ సగటు ఆయుర్దాయం 69 సంవత్సరాలు కాగా, చైనాలో అది 76 గా, అమెరికాలో 79 గా ఉంది. కల్తీ ఆహారం వల్లే దేశ ప్రజల ఆయు ప్రమాణం పెరగడం లేదనే చర్చ జరుగుతున్నది.ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతీ ఏడాది వివిధ రాష్ట్రాల్లో పాటిస్తున్న ఆహార ప్రమాణాలను పరిశీలిస్తుంది. పెద్ద, చిన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేటగిరీలుగా విభజించి.. 2018 నుంచి ఫుడ్ సేఫ్టీలో రాష్ట్రాల వారీగా ర్యాంకింగ్ ను కేటాయిస్తున్నది. 2020-21లో విడుదల చేసిన జాబితాలో తెలంగాణ రాష్ట్రం 36 పాయింట్లతో పదో స్థానంలో నిలిచింది. 2021-22లో 20 పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ 15వ స్థానంలో నిలిచింది. మొత్తం ఐదు కొలమానాల్లో వంద పాయింట్స్‌కు గాను రాష్ట్రానికి కేవలం 34.5 పాయింట్సే వచ్చాయి. 2022-23లో తెలంగాణ 12వ స్థానంలో నిలిచింది.

2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్‌ను తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదనిపిస్తే వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చు. స్థానిక మున్సిపల్ కార్పొ రేషన్, జీహెచ్ఎంసీ లోని ఫుడ్ సేఫ్టీ అధికారులను నేరుగా కలిసి కంప్లయింట్ ఇవ్వవచ్చు. diripmtg@ gmail.com, fssmutg@gmail.com కి మెయిల్ ద్వారా కూడా కంప్లయింట్ చేయొచ్చు. 91001 05795 నంబర్‌కి కాల్ చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చు. ట్విట్టర్ (ఎక్స్) ద్వారా @cfs_telangana‌కు ఫిర్యాదు చేయవచ్చు.- జీహెచ్ఎంసీ పరిధిలో అయితే 040-21111111 నంబర్‌కు లేదా foodsafetywing.ghmc@ gmail.com‌కు మెయిల్ ద్వారా, ట్విట్టర్ అయితే @afcghmc కి ఫిర్యాదు చేయవచ్చు. ఆన్‌లైన్ ఆర్డర్లు తీసుకున్నప్పుడు కూడా వినియోగదారులకు ఏమైనా ఫిర్యాదులు ఉంటే ఆ ఫుడ్ బిల్, ఆర్డర్ చేసిన ఫుడ్ వివరాలతో ఫిర్యాదు నమోదు చేయవచ్చు.ఫిర్యాదు వచ్చిన వెంటనే, ఆ ప్రాంత పరిధిలో ఉన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సదరు హోటల్‌కు వెళ్లి తనిఖీ నిర్వ హిస్తారు. సేకరించిన వంటకాలను ల్యాబ్‌లకు పంపించి నివేదికను సదరు హోటల్ యజమానులకు పంపిస్తారు. ఆ నివేదికను సవాలు చేసుకునేందుకు హోటల్ యాజమాన్యానికి 30 రోజుల సమయం ఉంటుంది. నెల రోజుల్లో యజమానులు స్పందించని పక్షంలో సంబంధిత అడ్జ్యుడికేషన్ ఆఫీసర్ దగ్గర కేసు నమోదు చేస్తారు. అన్‌సేఫ్ (సురక్షితం కానివి) అని వస్తే క్రిమినల్ కోర్టులోనూ, సబ్ స్టాండర్డ్ అని వస్తే కేసు ఫైల్ చేస్తారు. సబ్ స్టాండర్డ్ (నిర్దేశిత ప్రమాణాల కంటే తక్కువ స్థాయి) వస్తే హోటల్ స్థాయి, ఆదాయం, సిబ్బందిని బట్టీ రూ. 5 లక్షల వరకు జరిమానా విధిస్తారు. అన్‌సేఫ్ అని నివేదిక వస్తే ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు జరిమానా లేదా కోర్టు ద్వారా శిక్ష ఉంటుంది. ఒకే హోటల్ మీద పదే పదే ఫిర్యాదులు వస్తే.. వాటిని పరిశీలించి సదరు రెస్టారెంట్లు తగిన నివారణా చర్యలు తీసుకోకపోతే వాటి లైసెన్స్ కూడా రద్దు చేస్తారు.

కరెంట్ అఫైర్స్

భారత్, ఫ్రాన్స్ ఆధ్వర్యంలో 'త్రిష్ణా'



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), సెంటర్ నేషనల్ ఎట్యుడస్ స్పాటిలెస్ (సిఎన్ఇఎస్) అనే అంతరిక్ష సంస్థలు సంయుక్తంగా థర్మల్ ఇన్‌ఫ్రారెడ్ ఇమేజింగ్ శాటిలైట్ ఫర్ హైరిజల్యూషన్ నేచురల్ రిసోర్స్ అసెస్‌మెంట్ (త్రిష్ణా) అనే భూ పరిశీలన ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు 'ఇండియా, ఫ్రాన్స్' ఒప్పందం చేసుకున్నాయి. భూమి ఉపరితలంపై ఉష్ణోగ్రతలు, ఉద్గారాలు, బయోఫిజికల్, రేడియేషన్, అధిక టెంపోరల్ రిజల్యూషన్ పర్యవేక్షణ కోసం ఈ ఉపగ్రహానికి రూపకల్పన చేయాలని నిర్ణయించుకున్నాయి. త్రిష్ణా ఉపగ్రహం రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ రంగంలో గణనీయమైప పురోగతిని సూచిస్తుందని వారు ప్రకటించాయి. క్లిష్టమైన నీరు, ఆహార భద్రత సమస్యల పరిష్కారానికి ఈ శాటిలైట్ మార్గం సుగమమం చేస్తుందని, ఇప్పటి వరకు ప్రయోగించిన రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలతో పోలిస్తే త్రిష్ణా శాటిలైట్ అనేక విశిష్టతల్ని కలిగి ఉంటుందని ఇస్రో పేర్కొంది. ఈ శాటిలైట్‌ను సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి ప్రయోగించనున్నారు.


పాలస్తీనాకు స్లొవేనియా గుర్తింపు : పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తున్నట్టు స్లొవేనియా తాజాగా ప్రకటించింది. ఇప్పటికే 140 దేశాలు పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తున్నామని ప్రకటించాయి. ఆ జాబితాలో తాజాగా స్లొవేనియా చేరింది. ఇటీవలే స్పెయిన్, నార్వే, ఐర్లాండ్ దేశాలు కూడా పాలస్తీనాను స్వతంత్రదేశంగా గుర్తిస్తున్నట్టు ప్రకటించాయి. పాలస్తీనాని సార్వభౌమ దేశంగా గుర్తించాలని చేసిన తీర్మానాన్ని ఆమోదిస్తూ 90 మంది సభ్యులు గల స్లొవేనియా పార్లమెంట్‌లో 52 మంది అనుకూలంగా ఓటు వేయగా, ఒక్కరు కూడా వ్యతిరేకించకపోవటం గమనార్హం.

అంతరిక్షవాసంలో ప్రపంచ రికార్డు : అంతరిక్షంలో అత్యధిక రోజులు గడిపిన వ్యక్తిగా రష్యా వ్యోమగామి ఒవేగ్ కొనొనెంకో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు.



గతంలో 878 రోజులు అంతరిక్షంలో గడిపి హెన్నాడీ పడల్కా నెలకొల్పిన రికార్డును ఒవేగ్ అధిగమించాడని రష్యా అంతరిక్ష సంస్థ తెలిపింది. కొనొనెంకో ఈ సంవత్సరం జూన్ 5వ తేది నాటికి అంతరిక్షంలో 1000 రోజులు గడిపారని ఆ సంస్థ ప్రకటించింది. అతను భూమి నుండి 283 మైళ్ల (423 కిలోమీర్లు) దూరంలో అంతరిక్షంలో ఉన్నారు.

విశాఖ పోర్టుకి అరుదైన ఘనత : ప్రపంచ బ్యాంకు ప్రకటించిన కంటైనర్ పోర్టుల పనితీరు సూచీ (సిపిపిఐ)లో అద్భుతమైన పనితీరును కనబరిచి టాప్ 20లో 18వ స్థానం సంపాదించుకుంది.



ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలోని కంటైనర్ పోర్టులు అందిస్తున్న సేవలతో పాటు వివిధ అంశాలను పరిగణనలోనికి తీసుకుని రూపొందిన జాబితాలో భారతదేశానికి చెందిన విశాఖ పోర్టు ఈ ఘనతను సాధించింది. అదేవిధంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సరుకు రవాణాలో మెరుగైన సేవలందించిన మేజర్ పోర్టుల జాబితాలో విశాఖ పోర్టు 4వ స్థానంలో నిలిచింది.

తెలంగాణాలో గ్లోబల్ రైస్ సమ్మిట్ : అంతర్జాతీయ సరుకుల సంస్థ (కమాడిటీస్), తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 7, 8వ తేదిలలో ప్రపంచ వరి శిఖరాగ్ర సదస్సు (గ్లోబల్ రైస్ సమ్మిట్ - 2024) ముగిసింది. అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థల కన్సార్షియం, భారతదేశ వరి పరిశోధనా సంస్థ, ఉత్తరప్రదేశ్‌లోని చంద్రశేఖర్ అజాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఒడిశా వ్యవసాయ విశ్వవిద్యాలయం,



భారతదేశ వరి ఎగుమతిదారుల సమాఖ్య, ఫిక్కీ వంటి సంస్థలతో పాటు, దాదాపు 30 దేశాల నుండి వరి ఎగుమతి, దిగుమతిదారులు, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గ్లోబల్ రైస్ సమ్మిట్‌కి భారతదేశం ఆతిథ్యం ఇవ్వటం ఇదే ప్రథమం.

మరోసారి అంతరిక్షంలోకి 'సునీతా విలియమ్స్' : భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ ముచ్చటగా మూడోసారి అంతరిక్ష యాత్రకి సిద్ధమయ్యింది. బోయింగ్ సంస్థ నిర్మించిన వ్యోమనౌకలో బుచ్ విల్ మోర్‌తో కలిసి రోదసీలో ప్రయాణం చేయనున్నారు. ఈ స్పేస్ మిషన్‌కి సునీతా విలియమ్స్ పైలెట్‌గా వ్యవహరించనున్నారు.



అంతరిక్షంలో వారం పాటు గడిపిన తరవాత జూన్ 14న అదే వ్యోమనౌకలో భూమిని చేరుకుంటారు. ఈ యాత్ర విజయవంతం అయితే ఐఎస్ఎస్‌కి వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపడానికి అమెరికా అమ్ములపొదిలో మరొక వ్యోమనౌక చేరినట్లవుతుంది.

చెక్కతో శాటిలైట్ : ప్రపంచంలోనే మొట్టమొదటి సారి జపాన్‌కి చెందిన శాస్త్రవేత్తలు 'లిగ్నోశాట్' అనే చిన్న చెక్క ఉపగ్రహాన్ని తయారు చేశారు. దీని పనితీరున పరిశీలించడానికి కెన్నెడీ స్పేస్ సెంటర్ నుండి సెప్టెంబర్ నెలలో అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ లిగ్నోశాట్‌ని క్యోటో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు లాగింగ్ కంపెనీ సుమిటోమో ఫారెస్ట్రీ సహకారంతో రూపొందించారు. మాగ్నోలియో కలపతో తయారు చేసిన ఈ చెక్క ఉపగ్రహ నిర్మాణానికి 2020లోనే శ్రీకారం చుట్టారు. లోహాలతో తయారు చేసిన ఉపగ్రహాల వల్ల అంతరిక్షంలో వ్యర్థాలు పెద్దయెత్తున్న పేరుకు పోతున్నాయని, ఈ సమస్యను అధిగమించడానికే చెక్కతో ఉపగ్రహాలు తయారు చేయటం ప్రారంభించామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ ఉపగ్రహ విజయవంతమైతే అంతరిక్ష వ్యర్థాలను తగ్గించటంతో పాటు, పర్యావరణ అనుకూల ఉపగ్రహాల నిర్మాణానికి మార్గం సుగమం అవుతుందని సుమిటోమో ఫారెస్ట్రీ ప్రకటించింది.

వాయు కాలుష్య నివారణకు 10వేల కోట్లతో ప్రాజెక్టు : హర్యానా రాష్ట్రంలో వాయు కాలుష్య నివారణకు



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

త్వరలో 10వేల కోట్ల రూపాయలతో ఒక ప్రత్యేకమైన ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టివిఎస్ఎన్ ప్రసాద్ ప్రకటించారు. హర్యానాలో వాయు నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి అధునాతన మౌళిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయటం, అత్యాధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేయటం, వాయు నాణ్యత నిర్వాహణలో పాల్గొనే వారికి తగిన శిక్షణను ఇవ్వటం వంటి అనేక కీలకాంశాలు ఈ ప్రాజెక్టులో అంతర్భాగాలుగా ఉంటాయని ఆయన తెలిపారు. ప్రపంచ బ్యాంక్ నిధులతో ప్రారంభమయ్యే హర్యానా క్లీన్ ఎయిర్ ప్రాజెక్ట్ ఫర్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ ఈ ప్రాజెక్టు మొదటి దశలో జాతీయ రాజధాని ప్రాంతాలలో విస్తరించి ఉన్న జిల్లాలోని వాయు నాణ్యత, తదితర అంశాలపై పరిశోధన ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

రుద్ర ఎమ్ - 2 పరీక్ష విజయవంతం : భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన యాంటీ రేడియేషన్ మిస్సైల్ రుద్ర ఎమ్-2 ని విజయవంతంగా పరీక్షించింది. భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డిఆర్‌డిఒ) ఈ సూపర్ సోనిక్ మిస్సైల్‌ని మే 29వ తేదిన ఒడిశాలోని చందీపూర్‌లోని టెస్ట్ రేంజ్ నుంచి ప్రయోగించారు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయబడిన మొట్టమొదటి దేశీయ యాంటీ రేడియేషన్ మిస్సైల్. ఈ మిస్సైల్ భారతదేశ రక్షణ వ్యవస్థ సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుంది. రుద్ర ఎమ్-2 విజయవంతం కావటంతో భారత్ ఇటువంటి మిస్సైల్ల కోసం ఇతర దేశాల మీద ఆధారపడే అవసరం లేకుండా పోతుంది. దీని నిర్మాణంలో భాగస్వాములు అయిన డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలని భారత రక్షణ శాఖా మంత్రి రాజనాథ్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.

పుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛైత్రి రిటైర్మెంట్ : భారత దేశానికి చెందిన పుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛైత్రీ ఆట నుండి రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్, కువైట్ జట్ల ఫిఫా ప్రపంచ కప్ క్వాలిఫైయిర్ ఆఖరి లీగ్ మ్యాచ్ ముగిసిన అనంతరం సునీల్ ఛైత్రీ తన రిటైర్మెంట్‌ని ప్రకటించాడు. సునీల్ ఛైత్రీ తన కెరీర్‌లో మొత్తం 151 మ్యాచ్‌లు ఆడి, 94 గోల్స్ చేశాడు.



భారతదేశం తరుపున ఆడి అత్యధిక గోల్స్ చేసిన క్రీడాకారుడిగా సునీల్ ఛైత్రీ రికార్డు సృష్టించాడు. దేశం తరుపున అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాళ్ల జాబితాలో ఛైత్రీ 4వ స్థానంలో ఉన్నాడు. దాదాపు రెండు దశాబ్దాల పాటు భారత పుట్‌బాల్ జట్టుకి ప్రాతినిధ్యం వహించిన ఛైత్రీ శకం ముగిసినట్లయ్యింది.

భద్రతా మండలిలో పాక్‌కు చోటు : ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి శాశ్వతేతర దేశాల జాబితాలో పొరుగు దేశమైన పాకిస్థాన్ చోటు సంపాదించుకుంది. పాక్‌తో పాటు పనామా, సోమాలియా, గ్రీస్, డెన్మార్క్ దేశాలకు కూడా ఈ జాబితాలో చోటు సాధించాయి. ఇటీవల ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో జరిగిన రహస్య ఓటింగ్‌లో ఈ దేశాలు అత్యధిక ఓట్లు సాధించాయి. 2025 జనవరి నుండి రెండేండ్ల పాటు 2026 డిసెంబర్ 31వ తేది వరకు ఇవి శాశ్వతేతర సభ్య దేశాల హోదాలో కొనసాగుతాయి.

ఇతిహాస-పురాణాలు



నానాపురం నర్సింహులు
9030057994

భారతీయ సంస్కృతిలో ధర్మ, అర్థ, కామ, మోక్షములనే నాలుగు పురుషార్థాలకు విశేష ప్రాధాన్యముంది. ప్రపంచంలలో అతి ప్రాచీన సాహిత్యం ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వవేదం. వేదానికి చెందిన మొదటి గ్రంథాలు 'సంహిత'లు. ఋక్సంహిత, యజు:సంహిత, సామసంహిత, అధర్వసంహిత అని నాలుగు సంహితలున్నాయి. తర్వాతవి బ్రాహ్మణ గ్రంథాలు. అరణ్యాలలో అధ్యయనం చేసే గ్రంథాలు అరణ్యకాలనబడతాయి. వైదిక ఋషుల తత్త్వచింతనను వ్యక్తం చేసే గ్రంథాలు 'ఉపనిషత్తులు'. ఇవి ఆ ఋషుల ఆత్మవిషయకమైన అనుభూతిని వ్యక్తం చేస్తాయి. అవే కాక నాలుగు ఉపవేదాలైన ఆయు, ధను, గాంధర్వ, స్థాపత్య శాస్త్రవేదాలు. ఆరు వేదాంగాలు (శిక్ష, కల్పం, నిరుక్తం, వ్యాకరణం, జ్యోతిష్యం, ఛందస్సు). వీటిపై భాష్యాలు, టీకలుటిప్పణులను వైదిక సంస్కృత వాఙ్మయంగా పరిగణించవచ్చు.

లౌకిక సంస్కృతి సాహిత్యం చాలా విస్తృతమైంది. విశ్వంలోని అన్ని విషయాలనూ ఈ సాహిత్యం స్పృశిస్తుంది. ఇతిహాసాలు, పురాణాలు, ధర్మ అర్థ, కామ శాస్త్రాలు, దర్శనాలు (ఇవి ఆరు: న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, పుర్వమీమాంసా, ఉత్తరమీమాంసా),



సాహిత్యశాస్త్రం, అలంకార శాస్త్రం, తంత్రశాస్త్రం... లౌకిక సాహిత్యానికి చెందిన ప్రముఖ విషయాలు. మొదట్లో ఇతిహాస (రామాయణం, భారతాలు), పురాణాలు (అష్టాదశ పురాణాలున్నాయి...భాగవతపురాణం, స్కందపురాణం మొదలైనవి). 'శ్లోకము' అనబడే అనుష్టుప్ ఛందస్సులో మొదట్లో రచింపబడ్డాయి. తర్వాత కాలంలో వేరే వృత్తపద్యాలు కూడా ప్రయోగించారు.

ధరార్థకామమోక్షాలనేవి నాలుగు పురుషార్థాలు. ఇవి ఇతిహాస, పురాణాల్లో సాక్షాత్కరించబడ్డాయి.

ఇతిహాసం

- 'ఇతిహాసం' అనగా ఇలా ఉండేదట, ఇలా జరిగిందట అని అర్థం.
- 'ఇతి+హ+ఆస' అనేది ఇతిహాస శబ్దానికి వ్యుత్పత్తి.
- 'కావ్యమీమాంస' గ్రంథకర్త రాజశేఖరుడనే అలంకారికుని ప్రకారం ఇతిహాసం పరిక్రియ, పురాకల్పం అని రెండు రకాలు.
- ఒకే నాయకుడు గలది పరిక్రియ. ఉదాహరణకు: రామాయణం.
- ఎక్కువ నాయకులు గలది పురాకల్పం. ఉదాహరణకు: మహాభారతం.
- ఛాందోగ్యోపనిషత్తు ఇతిహాస, పురాణాలను పంచమవేదంగా వర్ణిస్తుంది.
- 'సత్యంవద, ధర్మంచర' అని తైత్తిరీయ ఉపనిషత్తులో చెప్పగా, వాటిని మాటల్లోనే గాక, ఆచరణలో వ్యక్తం చేయడం వంటి విషయాలను మహాభారతం తెలియజేస్తుంది.
- 'మాతృదేవోభవ, పితృదేవోభవ' (తైత్తిరీయోపనిషత్తు) మొదలైన ఉపదేశాలను ఉదాహరణ ద్వారా తెలియజేయడానికి అవతరించింది రామాయణం.
- సంస్కృత లౌకిక సాహిత్యంలో ఆదికవి 'వాల్మీకి'. ఆదికావ్యం/ఇతిహాసం: రామాయణం. ఇది అనుష్టుప్ వృత్తంలో ప్రధానంగా రచింపబడింది.
- వల్మీకము(పుట్ట) నుండి బయటకు వచ్చినాడని వాల్మీకి, కిరాతుల మధ్య పెరిగిన రత్నకరుడు, భార్గవుడు, ప్రాచేతసుడు అనే పేర్లున్నాయి వాల్మీకి మహర్షికి.
- నారదుడు వాల్మీకిని కలిసి రామకథను వివరించాడు. రామాయణాన్ని వాల్మీకి త్రేతాయుగంలో (క్రీ.పూ.800-900) రచించాడు.
- వాల్మీకి రామాయణంలో ఏడు కాండలు, 24000 శ్లోకాలు, 500 సర్గలున్నాయి.
- రామాయణంలోని ఏడు కాండలు వరుసగా బాల, అయోధ్యా అరణ్య, కిష్కింధా, సున్దార, యుద్ధ, ఉత్తరకాండము.
- సూర్యవంశ చరిత్రమే: రామాయణం, చంద్రవంశ చరిత్ర : భారతం.
- తెలుగులో భారత, రామాయణాలను ఇతిహాసాలంటారు. నన్నయ, తిక్కన, ఎర్రనలు ఇతిహాస కవులు.
- గోనబుద్ధారెడ్డి, హుళక్కి భాస్కరుడు, మొల్ల వంటి మొదలైన రామాయణం తెలుగులో రాసిన కవులు కూడా ఇతిహాస కవులు.
- కవిత్రయం వారు మహాభారతాన్ని కేవలం అనువాదం కాకుండా అనుసృజన (Trans Creation) చేశారు. కాబట్టి అది కేవలం ఇతిహాసం కాదు కావ్యేతిహాసం.

తెలుగులో వచ్చిన రామాయణాలు

గ్రంథం		గ్రంథకర్త
1. రంగనాథరామాయణం (తొలి తెలుగు రామాయణం)	-	గోనబుద్ధారెడ్డి (ద్విపదలో రాశాడు)
2. భాస్కర రామాయణం (కృతిపతి: సాహిని మారన)	-	బహుకర్తృకం (హుళక్కి భాస్కరుడు, మల్లికార్జునభట్టు, కుమార రుద్ర దేవుడు, అయ్యలార్యుడు) దీనిని 'చంపూ' పద్ధతిలో రాశారు.
3. నిర్వచనోత్తర రామాయణం (కేవలం పద్యంలో రాశాడు)	-	తిక్కన (తొలి రచనం) - మనుమసిద్ధకి అంకితమిచ్చాడు (ఎర్రన రామాయణం రాశాడు, కాని అలభ్యం)
4. మొల్ల రామాయణం (ఆరు కాండల సంక్షిప్త రామాయణం)	-	మొల్ల(15వ శ.) శ్రీకంఠ మల్లేశ్వరుని దయ వల్ల కవిత్వం చెప్పిందట. ఇది శ్రీరామ చంద్రునికే అంకితమిచ్చింది.
5. ఉత్తర రామాయణం	-	'కంకంటి పాపరాజు' దీనిని మదన గోపాల స్వామికి అంకితమిచ్చాడు.
6. 'రామభ్యుదయం'	-	అయ్యలరాజు రామభద్రకవి
7. అచ్చ తెలుగు రామాయణం	-	కూచిమంచి తిమ్మకవి కుక్కుటేశ్వర స్వామికి అంకితం చేశాడు.
8. శ్రీమద్రామాయణ కల్పవృక్షం	-	విశ్వనాథ సత్యనారాయణ ఈ రచనకే 1970లో తొలి తెలుగు జ్ఞానపీఠ్ అవార్డు లభించింది.
9. జనప్రియ రామాయణం	-	పుట్టపర్తి నారాయణాచార్యులు
10. ఆంధ్ర వాల్మీకి రామాయణం	-	వావిలికొలను సబ్బారావు
11. రామాయణం, భారతం, భాగవతం (మూడింటిని రాసిన ఆధునిక కవి)	-	శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి
12. చంపూ రామాయణం, చంపూ భారతం	-	అల్లంరాజు రంగరాజు
13. 'వచన రామాయణాలు'	-	చెలమచర్ల రంగాచార్యులు, ఉషశ్రీ.
14. రామాయణ, భారత, భాగవతాలను సరళ వచనంలో రాసిన ఆధునిక కవి	-	డా॥ దాశరధి రంగాచార్యులు

(సశేషం)